




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



గురుకుల పాఠశాలల్లో **98.7% ఉత్తీర్ణత**

సిఎస్‌గా రామకృష్ణారావు **బాధ్యతల స్వీకరణ**

కర్రెగుట్టలపై త్రివర్ణ పతాక రెపరెపలు

లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 310 | గురువారం | 01-05-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


# దేశంలో కులగణన



తెలంగాణ సాయుధపోరాట వీరనారి కామ్రేడ్
## పశ్య కన్నమ్మ కన్నుమూత

కూనంనేని నివాళి
సురవరం, నారాయణ, చాడ, పల్లా, నెల్లికంటి సంతాపం

03



- జన గణనతోపాటే నిర్వహించాలని కేంద్ర మంత్రివర్గ కమిటీ కీలక తీర్మానం
- కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశావ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో జనాభా లెక్కల సేకరణతోపాటు కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్రమంత్రివర్గంలో రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిపిఎ)బుధవారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా బాహాటపద్ధతులలో ఈ కులగణన కూడా జనాభా లెక్కల సేకరణతోపాటు చేస్తామని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ సిసిపిఎ సమావేశానంతరం పాత్రికేయులకు చెప్పారు. కొన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు రాజకీయ కారణాలతో కులగణన సర్వేలు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. జనాభా లెక్కల సేకరణ, కులగణన కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వచ్చే విషయమని అన్నారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రం ఈ నిర్ణయం తరువాయి 6లో

# కులగణనకు తెలంగాణ ఆదర్శ నమూనా

**నిర్ణీత కాలపరిమితిలో పూర్తిచేయాలి : రాహుల్‌గాంధీ**




జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయంపట్ల లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హర్షం ప్రకటించారు. ఐతే దీనిని అమలు చేయడానికి ఒక కాలపరిమితిని నిర్ణయించాలని ఆయన కోరారు. ''ఇది తొలి అడుగు, తరువాయి 6లో











# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 2008లో మోదీ 'గొప్ప ఏమిటో తెలుసు'

### ఈ సున్నిత సమయంలో సమష్టి కృషి అనివార్యం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** 2008లో ముంబై దాడులు ప్రారంభమైన రెండు రోజుల తర్వాత, గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ మీడియా ప్రసంగంలో ప్రదర్శించిన ఆయన గొప్పతనం సహా యుపిఏ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని బిజెపి ప్రభుత్వం చేసిన 'ఒక భయంకరమైన అడ్వర్టైజ్‌మెంట్'ను బుధవారం కాంగ్రెస్ పార్టీ మరోసారి గుర్తుకు తెచ్చుకుంది. ఏదీ ఏమైనప్పటికీ ఈ అత్యంత సున్నితమైన సమయంలో మనం అందరం కలిసే ఉండాలని నొక్కి చెప్పింది. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని పహెల్గామ్‌లో పర్యాటకులపై అత్యంత కిరాతక ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ ఎప్పటికీ మర్చిపోలేని గుణపాఠం నేర్పడానికి సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించాలని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి, ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేష్ పిలుపునిచ్చారు. పహెల్గామ్ ఉగ్రదాడిపై చర్చించేందుకు పార్ల మెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్ష పార్టీలను చర్చలకు పిలవాలని, ముక్తకంఠంతో తీర్మానం చేయాలని జైరాం రమేష్ కేంద్రాన్ని కోరారు.

# హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

### 14 మంది మృత్యువాత, మరో 13 మందికి గాయాలు



### కోల్‌కతాలోని రితురాజ్ హోటల్‌లో ఘటన

### ప్రమాద సమయంలో మేఘాలను కమ్మేసిన దట్టమైన పొగలు

**కోల్‌కతా :** కోల్‌కతాలోని ఓ హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సెంట్రల్ కోల్‌కతా బుర్రాబజార్‌లోని రద్దీగా ఉండే మెచుపట్టి ప్రాంతంలోని ఒక బడ్జెట్ హోటల్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 13 మంది గాయపడ్డారు. ఆరు అంతస్తుల రితురాజ్ హోటల్‌లో మంగళవారం సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో 42 గదుల్లో ఉన్న 88 మంది అతిథుల్లో చాలామంది చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మంటల్లో చిక్కుకుపోయి దట్టమైన పొగ నుండి తప్పించుకోలేకపోయిన వారేనని అత్యవసర సేవల విభాగం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయితే బాధితులలో ఎక్కువ మంది ఊపిరాడక మృతి చెందగా, కొందరు భయంతో పై అంతస్తుల నుండి దూకినట్లు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరణించిన వారిలో 11 మంది పురుషులు, ఒక మహిళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులను మేయర్ ఫిర్హాద్ హకీమ్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 14 మంది మృతదేహాలను గుర్తించామని, వాటిని బాధితుల కుటుంబాలకు అప్పగించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా, పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ, రాష్ట్ర అగ్నిమాపక మరియు అత్యవసర సేవల మంత్రి సుజిత్ బోస్ మొదట 15 మంది మృతి చెందినట్లు ధ్రువీకరించగా, ఆ తరువాత ఆసుపత్రులు, రెస్క్యూ ఏజెన్సీలతో విచారణ జరిపిన తరువాత ఆ సంఖ్యను సంఖ్యను 14కి సవరించారు. కాగా, ఘటనాస్థలిలో పది అగ్నిమాపక దళాలను మోహరించాయి. దాదాపు 10 గంటల పాటు తీవ్రంగా శ్రమించిన తర్వాత, బుధవారం తెల్లవారుజామున మంటలను అదుపులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు ప్రమాదం సమయంలో భయానక దృశ్యాలను వివరించారు. కిటికీల నుండి ఎగిసి పడుతున్న మంటలు, సహాయం కోసం అతిథులు కేకలు వేయడం, కొంతమంది మంటల నుండి తప్పించుకోవడానికి కిటికీల నుండి దూకడం వంటి దృశ్యాలు చూశామన్నారు. భవనం నుండి దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంటుండగా, చిక్కుకున్న డజన్ల కొద్దీ అతిథులను రక్షించడానికి అగ్నిమాపక సిబ్బంది నిచ్చెనలు, తాళ్ల ద్వారా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే తాజా సమాచారం మేరకు హోటల్‌లో తీవ్ర నిర్లక్ష్యం, అగ్నిమాపక భద్రతా నిబంధనలను ఉల్లంఘించిందని తెలుస్తోంది. హోటల్ బహుళ భద్రతా నిబంధనలను ఉల్లంఘించిందని ఆరోపణలు ఉన్నాయి. ఒకే అంతస్తులో నిర్మాణంలో ఉన్న అక్రమ డ్యాన్స్ బార్ కారణంగా ఉన్న ఒకే ఒక మెట్ల దారిని మూసివేశారని, వెంటిలేషన్ పాయింట్లను కూడా మూసివేశారని, దీంతో బాధితులను తరలిచేందుకు తీవ్ర ఆంటంకం కలిగినట్లు అగ్నిమాపక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. హోటల్‌కు చెందిన అగ్నిమాపక భద్రతా క్లియరెన్స్ 2022లో గడువు ముగిసిందని అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ రణవీర్ కుమార్ పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ దాఖలు చేశామని, హోటల్ యజమానులు పరారీలో ఉన్నారని చెప్పారు.

**ప్రధాని మోదీ సంతాపం**

ఈ విషాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రకటించారు. 'కోల్‌కతాలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మరణించిన ప్రతి ఒక్కరికీ పిఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్‌గ్రేషియా ఇవ్వబడుతుందని ప్రధాని కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా సంతాపం వ్యక్తం చేస్తూ మృతుల సంఖ్య 14గా నిర్ధారించారు. ఘటనాస్థలో తాను రాత్రంతా రెస్క్యూ, అగ్నిమాపక చర్యలను పర్యవేక్షించానని, హోటల్ లోపల మండే పదార్థాలు నిల్వ ఉండటం వల్ల చివరికి మొత్తం పద్నాలుగు మంది మరణించారని, ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు మమత ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ఘటన తర్వాత, కోల్‌కతా పోలీసులు అగ్నిప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు.

## జాతీయ భద్రతా సలహా బోర్డు పునరుద్ధరణ

### బోర్డు చైర్మన్‌గా 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి నియామకం

### మరో ఏడుగురు సభ్యులకు చోటు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ దాడితో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ జాతీయ భద్రతా సలహా బోర్డును కేంద్రం పునరుద్ధరించింది. బోర్డు చైర్మన్‌గా 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషిని నియమించింది. ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బోర్డులో విశ్రాంత మిలిటరీ, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఉన్నారు. బోర్డు సభ్యులుగా పిఎం సిన్హా, ఎకె సింగ్, మోంటీ ఖన్నా, మాజీ ఐఎఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి బి. వెంకటేశ్ వర్మలకు చోటు కల్పించింది. మరోవైపు పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో బుధవారం కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ(సిసిఎస్), రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిపిఎ), ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఇఎ) సమావేశాలు జరిగాయి. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

**రెండో సారి సిసిఎస్ సమావేశం**


భారత పర్యటకులపై పహల్గాంలో ముష్కరులు రెచ్చిపోయిన తర్వాత రెండోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సిసిఎస్) సమావేశం జరిగింది. అంతకుముందు ఏప్రిల్ 23న ఓసారి జరిగింది. జమ్ముకశ్మీర్‌లో విజయంతంగా ఎన్నికలు నిర్వహించడం, అక్కడ అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, స్థిరమైన పురోగతిని ఓర్వలేకే ముష్కరులు పహల్గాంలో రెచ్చిపోయారని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇస్తుందని, సింధూ జలాల ఒప్పందాల రద్దు సహా పలు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు.

# ఆప్ నేతలపై ఎసిబి కేసు



**న్యూఢిల్లీ :** పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై ఎసిబి కేసు నమోదు చేసింది. ఇందులో ఆప్ మాజీ మంత్రులు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్‌లు ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోదియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యూడి) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కాయి. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలకు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం 75ఏళ్లు ఉండేలా అయ్యింది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టుల్లో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోదియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో తాజాగా వీరిపై కేసు నమోదైంది.

# పార్లమెంట్ ప్రత్యేక భేటీకి శరద్‌పవార్ మద్దతు



**థాణెలోని :** పహల్గామ్ ఉగ్రవాద దాడిపై చర్చించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలన్న డిమాండ్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ డిమాండ్‌కు ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ బుధవారం మద్దతు ఇచ్చారు. పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చడం వల్ల దేశం ఐక్యంగా ఉందనే సందేశాన్ని ప్రపంచానికి పంపుతుందని అన్నారు. థాణెలోని 'తుల్జా భవానీ' ఆలయంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత శరద్ పవార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కశ్మీర్‌లో పర్యాటకుల ఊచకోతను దేశంపై దాడిగా అభివర్ణించారు. ఈ విషయంలో కేంద్రం ఏ చర్యలు తీసుకున్నా తాను మద్దతు ఇస్తానని అన్నారు. తమ సహచరులు కొందరు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారని, ఈ అంశంపై మొత్తం దేశం ఐక్యంగా ఉందని చెప్పారు. అన్ని పార్టీలు, పార్లమెంటు ఐక్యంగా ఉందని, ఈ సందేశాన్ని ప్రపంచానికి పంపడానికి (పహల్గామ్‌పై) ప్రత్యేక సమావేశం ఉపయోగపడుతుంది అని పవార్ అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిపై చర్చించడానికి, సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అతని సహచరులు తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఇస్తామని పవార్ పేర్కొన్నారు. ఈ అంశంలోకి మతం, కులం, భాషను తీసుకురావద్దని అన్నారు. మీడియాతో ఆయన సంభాషణ సందర్భంగా, శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేనకు నాయకత్వం వహిస్తున్న అతని బంధువు రాజ్ థాక్రే మధ్య సయోధ్యకు అవకాశం ఉందా అనే ప్రశ్నకు కూడా ఆయన స్పందించారు. 'అలా జరిగితే, అది మంచి కోసమే. రెండు కుటుంబాలు కలిసి వచ్చినప్పుడు, అది ఎల్లప్పుడూ సానుకూల పరిణామం' అని ఆయన అన్నారు. ఎంపిక చేసిన మతపరమైన కార్యక్రమాలకు మాత్రమే హాజరవుతారా అని అడిగినప్పుడు, పవార్ దానిని అర్థరహితం అన్నారు. తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పండర్‌పూర్ ఆలయంలో అనేకసార్లు పూజ చేశానని, తుల్జాపూర్‌లోని తుల్జా భవానీ ఆలయాన్ని కూడా చాలాసార్లు సందర్శించానని స్పష్టం చేశారు.

## భారత్ నుంచి 786, పాక్ నుంచి
# 1465 మంది స్వదేశానికి



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో భారత్ కఠిన చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఆయా వీసాల కింద భారత్‌లో ఉన్న పాక్ పౌరులను నిర్ణీత గడువులోగా స్వదేశానికి వెళ్లిపోవాలని ఆదేశించింది. దీంతో పాక్ దేశీయులు భారత్‌ను వీడుతుండగా, అక్కడ ఉన్న భారతీయులు స్వదేశానికి చేరుకుంటున్నారు. అందులో భాగంగా గత ఆరు రోజుల్లో 55 మంది దౌత్యవేత్తలు, వారి పై ఆధారపడినవారు, సహాయక సిబ్బంది, పాకిస్తాన్ వీసా ఉన్న ఎనిమిది మంది భారతీయులతో సహా 786 మంది పాకిస్తానీ జాతీయులు అట్టారి–వాఘా సరిహద్దు క్రాసింగ్ ద్వారా భారతదేశం నుండి బయలుదేరారని అధికారులు బుధవారం తెలిపారు. ఏప్రిల్ 24 నుండి పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు క్రాసింగ్ ద్వారా 25 మంది దౌత్యవేత్తలుష అధికారులు, దీర్ఘకాలిక భారత వీసాలు కలిగిన 151 మంది పాకిస్తానీ పౌరులతో సహా మొత్తం 1,465 మంది భారతీయులు పాకిస్తాన్ నుండి భారతదేశానికి చేరుకున్నారు. భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు ఏప్రిల్ 26లోపు దేశాన్ని వీడాలని కేంద్రం ఇటీవల ఆదేశించింది. వైద్య వీసాల కింద వచ్చిన వారికి ఈనెల 29 వరకు గడువు ఇచ్చింది. బిజినెస్, విజిటర్, స్టూడెంట్ తదితర 12 విభాగాల్లో వీసాలు ఉన్న వారు ఏప్రిల్ 27 నాటికి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా భారత్‌లో నివసిస్తున్న పాక్ పౌరులు తమ కుటుంబాలను వదిలి స్వదేశానికి తిరిగి వెళ్తుండడంతో సరిహద్దుల వల్ల భావోద్వేగ వాతావరణం నెలకొంది. 29తో భారత ప్రభుత్వం అక్కడి పౌరులకు ఇచ్చిన గడువు ముగిసిపోయింది. అందులో భాగంగా సార్క్ వీసా పథకం ద్వారా భారత్‌లో పర్యటిస్తున్న పాక్ వాసులను 48 గంటల్లోగా తిరిగి తమ దేశానికి వెళ్లిపోవాలని కేంద్ర ప్రభుత్వం కోరిన విషయం తెలిసిందే. కాగా, 10 మంది దౌత్యవేత్తలతో సహా మొత్తం 94 మంది పాకిస్తానీ జాతీయులు ఏప్రిల్ 29న అట్టారి–వాఘా సరిహద్దు క్రాసింగ్ పాయింట్ ద్వారా భారతదేశం నుండి బయలుదేరారని అధికారులు పిటిఐకి తెలిపారు. 36 మంది దౌత్యవేత్తలు, వారిపై ఆధారపడినవారు, సహాయక సిబ్బందితో సహా 145 మంది పాకిస్తానీలు ఏప్రిల్ 28న వెళ్లిపోయారు. తొమ్మిది మంది దౌత్యవేత్తలు, అధికారులు సహా మొత్తం 237 మంది పాకిస్తానీలు ఏప్రిల్ 27న భారతదేశం నుండి బయలుదేరగా, ఏప్రిల్ 26న 81 మంది వెళ్లిపోయారు; 25న 191 మంది, 24న 28 మంది వెళ్లిపోయారు. పాకిస్తానీ వీసా ఉన్న ఎనిమిది మంది భారతీయులు కూడా ఏప్రిల్ 29న అంతర్జాతీయ సరిహద్దు క్రాసింగ్ పాయింట్ ద్వారా భారతదేశం నుండి బయలుదేరారని వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, 29న 11 మంది దౌత్యవేత్తలు, అధికారులతో సహా మొత్తం 469 మంది భారతీయులు పాకిస్తాన్ నుండి అదే మార్గంలో తిరిగి వచ్చారు. 28న 146 మంది భారతీయులు తిరిగి వచ్చా రు. ఏప్రిల్ 27న ఒక దౌత్యవేత్తతో సహా 116 మంది భారతీయులు. 26న 13 మంది దౌత్యవేత్తలు, అధికారులు సహా 342 మంది భారతీయులు తిరిగి వచ్చారు, 25న 287 మంది భారతీయులు పాకిస్తాన్ నుండి దేశాన్ని దాటగా, 24న 105 మంది భారతీయులు తిరిగి వచ్చారని అధికారులు తెలిపారు.

### హైకోర్టు జడ్జిలపై ఫిర్యాదు...
## లోక్‌పాల్ ఆదేశాలపై జులైలో విచారణ

**న్యూఢిల్లీ :** సిట్టింగ్ హైకోర్టు జడ్జిలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ లోక్‌పాల్ ఆదేశాలపై జూలైలో వాదనలు వినడానికి బుధవారం సుప్రీంకోర్టు నిర్ణయించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ సూర్యకాంత్, అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం 'ఈ అంశం మరొక బెంచ్ ముందుకు రానున్నది' అని తెలిపింది. ఇది ప్రధాన న్యాయమూర్తి తీసుకోవాలసిన నిర్ణయమని, అంతేకాకుండా ఇది సముచితతకు సంబంధించిన విషయం కూడా అని జస్టిస్ ఓకా చెప్పారు. మేం జూలైలో ఎక్కడో ఒక చోట పొందుతాం అని జస్టిస్ బిఆర్.గవాయ్ తెలిపారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జిలపై ఇచ్చిన ఫిర్యాదులపై లోక్‌పాల్ జనవరి 27న ఆదేశాలు జారీచేయడంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సూమోటో కింద ఈ కేసును విచారణకు స్వీకరిచింది. రాష్ట్రంలోని ఒక అదనపు జిల్లా జడ్జిని, ఒక ప్రైవేట్ కంపెనీపై ఫిర్యాదు దాఖలు చేసిన సమస్యను పరిష్కరించనున్న హైకోర్టు న్యాయమూర్తిని, న్యా యమూర్తి ప్రభావం చేశారన్న ఆరోపణలతో ఫిర్యాదులు చేయబడ్డాయి. అత్యుతన్నత న్యాయస్థానం లోక్‌పాల్ ఆదేశాలపై ఫిబ్రవరి 20న స్టే విధిస్తూ ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతను ఆటంకపరచడమేనని ఆందోళన వ్యక్తంచేసిం ది.అనంతరం కేంద్రానికి, లోక్‌పా ల్ రిజిస్ట్రార్‌కు, ఫిర్యాదుదారుడికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. మార్చి 18న ఈ అం శం పై వి చారణకు స్వీకరించిన అత్యున్నత న్యా యస్థానం సిట్టింగ్ హైకోర్టుజడ్జిలకు వ్య తిరేకంగా దాఖలైన ఫిర్యాదులు పరిశీలించడంలో లోక్ పాల్ అధికారపరిధికి వచ్చే అంశాన్ని జూలైలో పరిశీలించనున్నట్లు చెప్పింది.ఈ అంశంలో 'అమికస్ క్యూరీ'గా సహకరించాలని సీనియర్ అడ్వకేట్ రంజిత్‌కుమార్‌ను ధర్మాసంన కోరింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా హాజరై తన వాదనలు వినిపించారు.

### కోర్టులు మధ్యవర్తిత్వం..
## అవార్డులను సవరించవచ్చు

### 4: 1 మెజారిటీ తీర్పులో స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** 1996 మధ్యవర్తిత్వం, రాజీ చట్టం కింద కోర్టులు మధ్యవర్తిత్వం అవార్డులను సవరించవచ్చని బుధవారం సుప్రీంకోర్టు ఒక ముఖ్యమైన తీర్పులో పేర్కొంది. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులలో జస్టిస్ బిఆర్.గవాయ్, సంజయ్‌కుమార్, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లను పక్కనపెట్టి 1996 మధ్యవర్తిత్వం, రాజీ చట్టంలోని కొన్ని నిబంధనలను ఉపయోగించి మధ్యవర్తిత్వం అవార్డులను సవరించవచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యామూర్తి 4:1 మెజారిటీ రూలింగ్‌లో స్పష్టంచేశారు. వాణిజ్యవివాదాలలో దేశీయ, అంతర్జాతీయ మధ్యవర్తిత్వ అవార్డులపై ఈ తీర్పు ప్రభావం చూపుతుంది.అయితే మధ్యవర్తిత్వం అవార్డులను సవరించడంలో కోర్టులు జాగ్రత్త వహించాలని భారత ప్రధాన న్యాయమూర్తి తీర్పును వెలువరిస్తున్న సమయంలో సూచించారు. భారత రాజ్యాంగంలోని 142 ఆర్టికల్ కింద మధ్యవర్తిత్వ అవార్డులను సవరించేందుకు సుప్రీంకోర్టుకు కొన్ని ప్రత్యేక అధికారాలు ఉన్నాయని తెలిపింది. కానీ భారత రాజ్యాంగం పరిమితులకు లోబడి అత్యంత జాగరూకతతో ఈ అధికారంపై కసరత్తు చేయాలి అని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా చెప్పారు. 1996 మధ్యవర్తిత్వం, రాజీ చట్టంలోని 34, 37 సెక్షన్ల కింద మధ్యవర్తిత్వం అవార్డులను సవరించడానికి కోర్టులకు పరిమితమైన అధికారం మాత్రమే ఉందని సిజెఐ తెలిపారు. దీనిపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన ఏకైన న్యాయమూర్తి జస్టిస్ కెవి.విశ్వనాథన్ కోర్టులు మధ్యవర్తిత్వం తీర్పులను సవరించలేవని చెప్పారు. మధ్యవర్తిత్వ అవార్డులను సవరించడానికి, పరిమిత అధికారాన్ని కోర్టు ఉపయోగించగల పరిస్థితులను మెజారిటీ తీర్పు సూచిస్తుంది. కొన్ని పరిస్థితులలో అవార్డు తర్వాత ఆసక్తి సవరించవచ్చని మెజారిటీ తీర్పు పేర్కొంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 తన ముందు పెండింగ్‌లో ఉన్న అవసరమైన డిక్రీ లేదా ఆర్డర్‌కు పూర్తి న్యాయం చేయడం కోసం సుప్రీంకోర్టుకు అధికారం ఇస్తున్నది. ఈ విచక్షణాధికారం న్యాయస్థానాన్ని సమాన అవసరాలకు మించి వెళ్లడానికి, అసంపూర్తిగా లేదా అసంపూర్ణంగా ఉన్న పరిస్థితులలో న్యాయాన్ని నిర్ధారించడానికి అనుమతి ఇస్తుంది. అయితే వివరణాత్మక తీర్పు కోసం వేచి ఉంది. మూడు రోజుల పాటు పార్టీల వాదనలు విన్న అనంతరం , కోర్టు వివాదాల చట్టపరమైన అంశంపై తన తీర్పును ఫిబ్రవరి 19న రిజర్వ్ చేసింది.ఈ కేసులో తుది విచారణ ఫిబ్రవరి 13న ప్రారంభమై, ఆతర్వాత ఈ అంశాన్ని జనవరి 23కు త్రిసభ్య ధర్మాసనం రిఫర్ చేసింది. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తాను పక్కనపెడితే సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, డేరియస్ ఖంబత, వేఖర్ నపాహదే, రితిన్ రాయ్, సౌరభ్ కిర్‌పాల్, గౌరబ్ బెనర్జీలు ఈ కేసులో తమ వాదనలు వినిపించారు.

## దేశాన్ని రక్షించుకునేందుకు సరైన చర్యలు తీసుకోవాలి : ఖర్గే



**బెంగళూరు :** పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత దేశ భావాలను అర్థం చేసుకుని ప్రస్తుత పరిస్థితిలో ఏదైనా ఆపరేషన్ నిర్వహించడానికి రాజకీయ పార్టీలు తనకు ఇచ్చిన అధికారాన్ని ఉపయోగిస్తూ దేశాన్ని రక్షించడానికి వీలైనంత త్వరగా సరైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. ఉగ్రవాద దాడిపై చర్చించడానికి, సమష్టి సంకల్పాన్ని చాటిచెప్పేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే తన డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. ప్రధానమంత్రిని లక్ష్యంగా చేసుకుని 'పార్టీ సోషల్ మీడియా పోస్ట్ 'గయాబ్' చేసిన వివాదం నేపథ్యంలో, ఎవరి గౌరవం లేదా ప్రతిష్టకు నష్టం కలిగించే ప్రయత్నం చేయొద్దని ఎఐసిసీఫ్ పేర్కొన్నారు. 'అన్ని పార్టీలు కలిసి ఉండాలి. పార్లమెంట్‌ను సమావేశపర్చాలి. ప్రధానమంత్రి రావాలి. ప్రధానమంత్రి ఏ చర్యలు తీసుకున్నారు, ఎలాంటి ప్రణాళికలు రచిస్తున్నారో బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని, రహస్యంగా ఉంచే కార్యకలాపాలు నిర్వహించవచ్చన్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో ఏం చేయదల్చుకున్నారో కనీసం సెషన్ సమయంలో ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలియజేయాలన్నారు. బుధవారం ఖర్గే బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. తాము కేంద్ర ప్రభుత్వానికి పూర్తి అధికారాన్ని ఇచ్చాని, భారత ప్రజలకు, సైనికులకు ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని, ఎటువంటి ఎదురుదెబ్బ తగలకుండా చూసుకోవాలని వారికి చెప్పామన్నారు. పాకిస్తాన్‌ను అదుపులో ఉంచడానికి పూర్తి మద్దతు ఇచ్చామన్నారు. దేశాన్ని రక్షించే దిశగా వీలైనంత త్వరగా సరైన చర్య తీసుకోవాలని సూచించారు. ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇప్పటికే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మోడీకి లేఖ రాశారు. ప్రధానిపై 'గయాబ్' (తప్పిపోయిన) సోషల్ మీడియా పోస్ట్ కారణంగా కాంగ్రెస్ ఇబ్బందిని ఎదుర్కోవాల్సి వచ్చిందా అని అడిగినప్పుడు, ఖర్గే, 'నేను దానిని చూడలేదు, నేను ఏమి చెప్పగలను' అని అన్నారు. 'కానీ, ఏ వ్యక్తి అయినా, అది ఎవరైనా, ప్రధానమంత్రి అయినా లేదా ఏ వ్యక్తి అయినా లేదా నాయకుడైనా, వారి గౌరవానికి లేదా ప్రతిష్టకు నష్టం కలిగించే ప్రయత్నం చేయకూడదు. ఎవరు చేసినా, వారు (బిజెపి) చేసినా లేదా మన ప్రజలు (కాంగ్రెస్) చేసినా, అది సరైనది కాదు' అని ఆయన అన్నారు.

### మణిపూర్‌లో సాధారణస్థితి నెలకొనాలంటే..
# తక్షణమే 'ప్రజాదరణ ప్రభుత్వం'

### కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు 21మంది ఎమ్మెల్యేల లేఖ

### రాష్ట్రపతి పాలన విధించి 3నెలలు గడిచినా ఫలితం శూన్యమని ఆవేదన




**ఇంఫాల్ :** రాష్ట్రపతి పాలన కింద ఉన్న మణిపూర్‌లో శాంతి నెలకొని సాధారస్థితి నెలకొనాలంటే తక్షణమే 'ప్రజాదరణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి' అని ఆ రాష్ట్రానికి చెందిన 21 మంది ఎమ్మెల్యేలు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు రాసిన ఒక లేఖలో అభ్యర్థించారు.మణిపూర్‌లో కేంద్రం ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన విధించింది.2023 మే నుంచి మణిపూర్‌లో మెయితీలు, కుకీజో గ్రూపుల మధ్య హింస ప్రజ్వరిల్లిన ఫలితంగా వేలాదిమంది నిరాశ్రయులవ్వగా, దాదాపు 250మంది చంపబడ్డారు. ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ రాజీనామా తర్వాత రాష్ట్రపతి పాలన విధించబడింది. మణిపూర్ రాష్ట్ర అసెంబ్లీ కాలం 2027వరకు ఉండగా, రాష్ట్రపతి పాలన విధించిన నేపథ్యంలో మణిపూర్ అసెంబ్లీ ఇప్పుడు సుప్తచేతనావస్థ కిందకు వెళ్లింది. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాసిన 21మంది ఎమ్మెల్యేలలో 13మంది బిజెపి ఎమ్మెల్యేలు ఉండగా, ముగ్గురు ఎమ్మెల్యేలు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్.పి.పి)కి చెందిన వారు, ముగ్గురు నాగా పీపుల్స్ ఫ్రంట్ ( ఎన్‌పిఎఫ్)కు చెందిన శాసనసభ్యులు, ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారు రాసిన లేఖలో 'మణిపూర్ ప్రజలు కొద్ది నెలల కిందట రాష్ట్రపతి పాలనను స్వాగతించారు. వారు రాష్ట్రపతి పాలనపై ఎన్నో ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు.అయినప్పటికీ ఆ పాలన అమలులోకి వచ్చి 3నెలలు అయ్యింది. కానీ శాంతి, సాధారణ స్థితిని నెలకొల్పడంలో ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోవడం కనిపించలేదు. అయితే రాష్ట్రంలో మరోసారి హింస చోటుచేసుకునే అవకాశం ఉందన్న గట్టి అభిప్రాయం ఇక్కడి ప్రజలలో ఉన్నది.అనేక పౌర సంస్థలు బయటకు వచ్చి రాష్ట్రపతి పాలనకు బదులుగా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నారు. ఈ సంస్థలు పబ్లిక్ ర్యాలీలు, స్ట్రీట్ కార్నర్ సమావేశాలు పెట్టి సాధారణ ప్రజానీకాన్ని రెచ్చగొడుతున్నారు. ప్రజాదరణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో ఎలాంటి కృషిచేయడం లేదంటూ అధికార శాసనసభ్యులను నిందిస్తున్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించడానికి వీరే బాధ్యతవహించారు' అని ఈ శాసనసభ్యులు ఏప్రిల్ 10న రాసిన లేఖలో తెలియజేశారు. రాసిన లేఖను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ 29న అందుకున్నదని, ఆ విషయాన్ని ఈ రోజు బహిర్గతం చేసిందని ఒక శాసనసభ్యుడు వివరించారు. 21మంది ఎమ్మెల్యేలు రాసిన లేఖలో ప్రజాదరణ ప్రభుత్వం మాత్రమే మణిపూర్‌లో శాంతి, సాధారణస్థితిని తీసుకురాగలదని మేం భావిస్తున్నామని నొక్కిచెప్పారు. మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ (ఎంపిసిసి) కీషమ్ మేఘచంద్ర సింగ్ మాట్లాడుతూ గవర్నర్‌ను అధిగమించేందుకే 21మంది ఎమ్మెల్యేలు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేటి నుంచి అంగన్‌వాడీలకు సెలవు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మొదటి సారిగా అంగన్‌వాడీలకు ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. మే1వ తేదీ నుంచి (గురువారం) సెలవు ఇవ్వాలని నిర్ణయించినట్లు మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్‌వాడీ యూనియన్లు, తల్లిదండ్రుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేలా ఏర్పాట్లు చేయాలని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు 'టేక్ హోం రేషన్' ద్వారా గుడ్లు, సరకులు సరఫరా చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. సెలవులలో అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటి సర్వే, చిన్నారుల గుర్తింపు వంటి విధులు నిర్వర్తించాలని సూచించారు.

# ఇక కెసిఆర్ ఫామ్‌హౌస్‌లోనే..

● వచ్చే పదేళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుంది ● కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్‌సి, బిసి వర్గీకరణ, రైతుబంధుపై శాసనసభలో చర్చకు సిద్ధమా? ● మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
● ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు




"కడుపు నిండా విషం నింపుకుని, విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలనే ప్రయత్నం మంచిది కాదు. కెసిఆర్ మాటలు, ఆయన కళ్లల్లో విషం కనిపిస్తోంది. గత ప్రభుత్వ పథకాలు ఏవి ఆగిపోయాయో చెప్పాలి. రైతుబంధు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగిందా? ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? పేదలకు సన్నబియ్యం పంపిణీ , పేదల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ కనబడడం లేదా?" .. సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చే పదేళ్ల వరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని, కెసిఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమని, ఆయన చరిత్ర ఫామ్‌హౌస్‌లోనే సమాధి అవుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, రైతు రుణమాఫీ, ఎస్‌సి వర్గీకరణ, బిసి కులగణన, రైతుబంధు అంశాలపైన శాసనసభలో చర్చిద్దామా? అని కెసిఆర్‌కు సిఎం సవాల్ విసిరారు. 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడని, ఆయన స్ఫూర్తితోనే ప్రభుత్వం పనిచేస్తోందని, ఆయన ప్రభావం రాహుల్‌గాంధీపైన కూడా ఉన్నదని తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన 'మహాత్మ బసవేశ్వర 892 జయంతి' వేడుకల్లో సిఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బసవేశ్వర విగ్రహానికి పూలతో నివాళ్లు అర్పించారు. అనంతరం 'పదవ తరగతి' పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కోతుల గుంపునకు అప్పగించినట్లయిందని,ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకున్నదని ఆరోపించారు. ఇటీవల జరిగిన వరంగల్ బిఆర్‌ఎస్ సభలో తెలంగాణ ఆగమైందని, తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అంటూ కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై సిఎం స్పందిస్తూ మరో పదేళ్ల దోచుకోవడం ఆగిందని తెలంగాణ రాష్ట్రం ఆగమైందా?, లేదా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని సిఎం నిలదీశారు. ఆగమైంది తెలంగాణ కాదని, కెసిఆర్ కుటుంబమన్నారు. వరంగల్‌లో కెసిఆర్ నిర్వహించిన బిఆర్‌ఎస్ సభ వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన వరంగల్‌కు వెళ్లి పాపాలు కడిగేసుకున్నాను అని కుంటున్నారని, కానీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను విలన్ అని కొత్తగా మరో తప్పు చేశారన్నారు. వరంగల్ సభలో కనీసం తన పేరును కూడా పలికేందుకు ధైర్యం లేదన్నారు.

**అసెంబ్లీకి పిల్లలను పంపిస్తే .. మీకేందుకు ప్రధాన ప్రతిపక్ష హోదా..**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే బిఆర్‌ఎస్ వరంగల్ సభకు ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించిందని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడటం లేదా? అని సిఎం ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలని, తమ వైఫల్యాలను ఎండగట్టాలని, కానీ ప్రధాన ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారని, 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫామ్‌హౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీకి తాను రానని, తమ పిల్లలను పంపించామని చెబుతున్నారని, పిల్లలను సభకు పంపితే, ఇక 'మీకు'(కెసిఆర్) ప్రధాన ప్రతిపక్ష పదవి ఎందుకు,?, సభకు రాని ప్రతిపక్ష నేతకు, పదేళ్ల దోచుకున్న వారికి తమను ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? అని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పిస్తే ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. అధికారం ఉంటే చెలాయిస్తాం,లేకపోతే ఫామ్‌హౌస్‌లో ఉంటామని చెబుతున్నారని, ఫామ్‌హౌస్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారని అన్నారు.

**బిసి కులగణను పరోక్షంగా అడ్డుకుంటున్న బిఆర్‌ఎస్, బిజెపి : భట్టి విక్రమార్క**

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ భూసంస్కరణలు అమలు చేయాలని తీసుకొచ్చిన చట్టాన్ని ఆనాటి ఉమ్మడి ఎపి సిఎం పి.వి నరసింహారావు రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు చేయాలని ప్రయత్నిస్తే, దీనిని నేరుగా ఎదుర్కోలేక, కొందరు దొరలు కృత్రిమంగా 'జై ఆంధ్ర' ఉద్యమం ద్వారా పరోక్షంగా అడ్డుకునేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. సామాజిక మార్పునకు నాంది కాబోతున్న కుల గణన సర్వేను కూడా అదే తరహాలో బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు బిసిలకు మేలు జరగకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బిసి కులగణనపై నేరుగా మాట్లాడకుండా ప్రభుత్వంపైన అవాకులు, చేవాకులు పేల్చుతూ కుయుక్తులు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్, బసవేశ్వరుడు, జ్యోతిభాపూలే ఆలోచనలు అనుసరించే వారు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ఆ మహనీయుల ఆలోచనలకు విరుద్ధంగా కుయుక్తులు పన్నేవారిపట్ల సమాజం జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని భట్టి కోరారు. బిఆర్‌ఎస్ వరంగల్ బహిరంగ సభలో ప్రజా ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఒక పెద్దాయన విమర్శలు చేశారని, ప్రజా ప్రభుత్వం ఎక్కడ వైఫల్యం చెందిందని ప్రశ్నించారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక ప్రకారంగా స్కీములు తీసుకురావడం వైఫల్యం చెందినట్టా? అని మండి పడ్డారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, మహాత్మ బసవేశ్వర జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరనారి
# పశ్య కన్నమ్మ కన్నుమూత

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** స్వాతంత్ర్య సమర యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట కమ్యూనిస్టు వీరనారి పశ్య కన్నమ్మ(97) కన్నుమూశారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని వారి స్వగృహంలో ఉదయం 11 గంటల ప్రాంతంలో పశ్య కన్నమ్మ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పశ్య కన్నమ్మ అంత్యక్రియలు నేడు హుజూర్‌నగర్‌లో జరగనున్నాయి. పశ్యమ్మ కన్నమ్మ కుమార్తె పశ్య పద్మ సిపిఐ జాతీయ సమితి సభ్యురాలిగా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. కాగా కన్నమ్మ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 1941లో 8వ ఆంధ్ర మహాసభకు సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డితో కలిసి పాల్గొనటం, పార్టీ సాహిత్యాన్ని రహస్యంగా నాయకులకు చేరవేయడంలో, కుటుంబంపై రజాకార్ల దాడులకు తీవ్రంగా గాయపడిన తండ్రిని, ఇతర కుటుంబ సభ్యులను కాపాడుకోవడంలో ఎంతో ధైర్యంగా, చురుకుగా వ్యవహరించారు. రజాకార్ల ఎదురుదాడిలో సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డి మృతి చెందినప్పుడు కోలుకోలేకపోయినా,నమ్మిన పార్టీలోనే కొనసాగి వివిధ స్థాయిలలో పార్టీ బాధ్యతలను నిర్వహించారు. 1971 నుండి 1980 వరకు హుజూర్‌నగర్ గ్రామపంచాయతీ సభ్యురాలుగా, హుజూర్‌నగర్ పంచాయతీ సమితీ కోఆప్షన్ సభ్యురాలుగా బాధ్యతలను నిర్వహించారు. ప్రాణానికి ప్రాణంగా ఉన్న అన్న దొంతిరెడ్డి శంభిరెడ్డి మరణం ప్రభావం కన్నమ్మపై తీవ్రంగా కొనసాగింది. అందుకే ఆయన సాధనలో జీవితాంతం భర్త పశ్య రాంరెడ్డి సహకారంతో కష్టజీవుల సమస్యల పరిష్కారానికి కదం తొక్కిన మహిళా నాయకురాలు పశ్య కన్నమ్మ. నిరుపేదలకు, వృద్ధాప్య, వితంతువు పెన్షన్‌లు ఇప్పించడంలో, వారి భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన సంఘ వ్యతిరేక శక్తులను తరిమికొట్టడంలో మడమ తిప్పని పోరాటం చేసిన నాయకురాలు పశ్య కన్నమ్మ. 1970 దశకంలోనే మహిళలకు కుట్టుమిషన్ సెంటర్ నిర్వహించి పదుల సంఖ్యలో మహిళలకు నైపుణ్యతను పెంచి ఆర్థికంగా నిలపడానికి వారి ఇంట్లోనే ఒక గదిని కేటాయించి అనేక సంవత్సరాలు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్‌గా, కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా, భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సుదీర్ఘ కాలం ఆరుట్ల కమలాదేవి, కట్కూరి సుశీల, గుజ్జుల శారదాదేవి, బ్రిజిరాణిగౌర్, చంద్ర రాజకుమారి వంటి గొప్పవారితో కలిసి పనిచేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో మొదటిసారిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన కుటుంబాలకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్‌లు ఇప్పించడంలో కన్నమ్మ చేసిన ప్రయత్నం శ్లాఘనీయం. ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంట్ సభ్యులు దాసరి నాగభూషన్‌రావు సహకారం, గ్రామపెద్దల సహకారం ప్రభుత్వ నిధులతో మహిళా మండలి భవనాన్నినిర్మించి ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు, క్విట్ ఇండియా ఉద్యమ నేత అరుణా సఫ్ అలీ పెట్టడం ఈప్రాంత మహిళలను ఉత్తేజపరిచారు. 2004 నుండి నేటి వరకు వేల సంఖ్యలో యువ మహిళలకు కంప్యూటర్ జర్దోషి మిషన్ సెంటర్ నిర్వహిస్తూ శిక్షణ ఇవ్వడం జరిగింది. హుజూర్‌నగర్ ప్రాంతంలో మహిళా నాయకురాలుగా, కమ్యూనిస్టు నాయకురాలుగా చిరస్మరణీయమైన పాత్రను నిర్వహించిన పశ్య కన్నమ్మనే మనందరికీ కూడా ఆదర్శం అనే చెప్పాలి.







తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పశ్య కన్నమ్మ భౌతికకాయం వద్ద నివాళి అర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్‌రావు, సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు

### సిపిఐ, ప్రజా సంఘాల నేతల సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వాతంత్ర సమరయోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట వీరనారి పశ్య కన్నమ్మ మరణం పట్ల సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు పలువురు సంతాపాన్ని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కన్నమ్మ మృతి పట్ల సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు కార్యదర్శి, స్వాతంత్ర సమయోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ వేర్వేరు సంతాప సందేశాలలో ప్రగాఢ సంతాపం, కుటుంబసభ్యులు సానుభూతి తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వీరనారి పశ్య కన్నమ్మ మృతి పట్ల ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.రజని, నేతలు ప్రేమ్‌పావని, కె.అరుణ, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్న కేశవరావు సంతాపాన్ని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కన్నమ్మ కూతురు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మకు వారు సానుభూతిని తెలిపారు. పశ్య కన్నమ్మ ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సమాఖ్య నల్గొండ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేశారని వారు కొనియాడారు. పశ్య కన్నమ్మ మృతి పట్ల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య సంతాపాన్ని ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె కుటుంబం మొత్తం ప్రజల కోసం పోరాడిన చరిత్ర ఉందని ఆయన కొనియాడారు. స్వతంత్ర సమర యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట వీరనారి అని, అలాంటి వారు మన నుండి భౌతికంగా దూరం కావడం విచారకరమని వారి ఆశయాల సాధన కోసం పని చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కన్నమ్మ భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు.

# గురుకులాల్లో 98.7% ఉత్తీర్ణత



పదవతరగతి పరీక్షల ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

92.78 శాతం విద్యార్థులు పాస్

బాలికలు 94.26శాతం, బాలురు 91.32 శాతం

జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పదవ తరగతి ఫలితాల్లో 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా, ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లో 94.26 శాతంతో బాలికలే పైచేయి సాధించగా, బాలురు 91.32 శాతం మంది పాసయ్యారు. కాగా ఈ సారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ప్రకటించారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సిఎం రేవంత్ రెడ్డి పదవ తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 99. 29 శాతం ఉత్తీర్ణులు కాగా, అతితక్కువగా వికారాబాద్ జిల్లాలో 73.97 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలకు 5,07,107 మంది హాజరవ్వగా, 4,96,374 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో 11,554 స్కూళ్ల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా,ఇందులో 4,629 పాఠశాలల్లో విద్యార్థులు అందరూ పాస్ అయ్యారు. వాటిలో 2007 ప్రైవేట్ స్కూళ్లు కాగా 1675 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. రెండు ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేదు. ఇది వరకు పదవ తరగతిలో సబ్జెక్టుల వారీగా గ్రేడ్లతో పాటు సిజిపిఎ ఇచ్చే వారు. ఈసారి మెమోలలో సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లు ఇచ్చారు. అలాగే సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, అంతర్గత పరీక్షల మార్కులను కూడా పొందుపరిచారు. మొత్తం మార్కులు, గ్రేడ్, పాసయ్యారా? ఫెయిలా అని కూడా వెల్లడించారు..

**ఈనెల 15లోపు రీ కౌంటింగ్‌కు దరఖాస్తులు**

జూన్ 3 నుంచి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు పదవ తరగతి పరీక్షల రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ వెల్లడించింది. జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అడ్వానస్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించగా, సప్లిమెంటరీ పరీక్షలకు మే 16వ తేదీలోపు ఫీజును చెల్లించాలని విద్యాశాఖ తెలిపింది.

**విద్యార్థులే ప్రభుత్వ అంబాసిడర్లు....**

**ఉజ్వల భవిష్యత్ కోసం పనిచేస్త: సిఎం రేవంత్ రెడ్డి**

గురుకులల విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థల కంటే మెరుగైన ఫలితాలను సాధించడం ప్రభుత్వ పనితీరుకు గీటురాయి అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నూటికి నూరు శాతం తాను శక్తివంచన లేకుండా పని చేస్తానని హామీనిచ్చారు. విద్యార్థులే ప్రభుత్వ అంబాసీడర్లుగా మారి, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలను గ్రామాల్లో తెలియజేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులే తమ వారసులని, వారే తమ కుటుంబ సభ్యులన్నారు. దేశ భవిష్యత్ తరగతి గదులలోనే ఉన్నదని, దేశంలో సమూలమైనమార్పులు రావాలంటే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో, బసవన్న స్ఫూర్తితో తమ ప్రభుత్వం పని చేస్తుందని సిఎం అన్నారు. పనులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, వాటిని ప్రచారం చేసే బాధ్యత విద్యార్థులపైన ఉన్నదన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసమే ప్రభుత్వం పని చేస్తుందని, విద్యార్థులే ప్రభుత్వ భవిష్యత్ అని, తరగతి గదులలోనో దేశ,రాష్ట్ర భవిష్యత్ ఉన్నదని సిఎం అన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అధికారులను, సిబ్బందిని సిఎం అభినందించారు.

| విద్యా సంస్థలు | ఉత్తీర్ణత శాతం |
|---|---|
| టి.జి గురుకుల | 98.79 శాతం |
| బిసి వెల్ఫేర్ | 97.79 శాతం |
| సోషల్ వెల్ఫేర్ | 97.71 శాతం |
| గిరిజన వెల్ఫేర్ | 97.63 శాతం |
| మైనార్టీ రెసిడెన్షియల్ | 96.57 శాతం |
| మోడల్ | 95.31 శాతం |
| ఆశ్రమ | 95 శాతం |
| కెజిబివి | 94.42 శాతం |
| ప్రైవేటు | 94.21 శాతం |
| ఎయిడెడ్ | 90.65 శాతం |
| జెడ్‌పి | 89.13 శాతం |
| ప్రభుత్వ | 84.83 శాతం |

# సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ ఎ.శాంతికుమారి బుధవారం పదవీ విరమణ చేయడంతో ఆమె నుంచి రామకృష్ణారావు సిఎస్‌గా బాధ్యతలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు రామకృష్ణారావు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు బాధ్యతలు తీసుకున్న అనంతరం మొదటి అధికారిక కార్యక్రమంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో బుధవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'ప్రగతి' సమావేశంలో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి నిర్వహించిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తోపాటు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 1991 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి రామకృష్ణారావు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఆర్థిక శాఖలో కీలక భాధ్యతలు నిర్వహించారు. రామకృష్ణారావు ఐఐటీ కాన్పూర్‌లో ఇంజినీరింగ్ పట్టభద్రులు, ఐఐటి ఢిల్లీలో మాస్టర్స్, అలాగే ఇన్వెస్ట్‌మెంట్‌లో ఎంబిఎ పట్టా పొందారు. గతంలో రామకృష్ణారావు ఆదిలాబాద్, గుంటూరు జిల్లాల్లో కలెక్టర్‌గా, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆర్థిక పరిపాలనలో అనుభవం, కేంద్ర నిధుల సమీకరణలో నైపుణ్యం ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనను సిఎస్‌గా నియమించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# ఎనిమిదిరోజుల ఆపరేషన్ ముగిసినట్లే

150కి పైగా మందుపాతరలు నిర్వీర్యం

కర్రెగుట్టలపై జాతీయ జెండా ఎగురవేత



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టులకు రక్షణ కోటగా పిలవబడుతున్న కర్రెగుట్టలపై జాతీయ జెండా బుధవారం రెపరెపలాడింది. ఎనిమిది రోజులుగా జరుగుతున్న ఆపరేషన్ కర్రెగుట్టలు దాదాపుగా ముగిసినట్లేనన్న సమాచారం వినవస్తుంది. దండకారుణ్యంలోని కర్రెగుట్టలలో దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నారని ఇందులో మావోయిస్టు అగ్రనేతలు ముఖ్యంగా హిడ్మా ఉన్నాడని వేలాది మంది సైనిక బలగాలతో కర్రె గుట్టలను చుట్టు ముట్టారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన ఆపరేషన్‌లో లోతైన గుహలను కనిపెట్టడంతో పాటు జాతీయ సైనిక బలగాలు దాదాపు కర్రెగుట్టలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇక్కడి అడవులపై పట్టు సాధించాయి. కర్రెగుట్ట ఆపరేషన్ ప్రక్రియలో భాగంగా 150కు పైగా మందుపాతరలను పోలీసులు నిర్వీర్యం చేశారు. బాటిల్ బాంబులు, మందుపాతరలు, అతి ప్రమాదకరమైన ఇతర పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. ఇక్కడ బేస్‌క్యాంపు ఏర్పాటు చేశారు. సైనిక బలగాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సైనిక హెలికాప్టర్ల ద్వారా ఆహార పదార్థాలను నీటిని చేరవేశారు. అయితే ఒక రకమైన విజయం మరో రకమైన అపజయాన్ని సైనిక బలగాలు చవిచూశాయి. వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నారు వీరిని హతమారిస్తే ఒక మావోయిస్టు పార్టీ చరిత్ర ముగుస్తుందని భావించిన సైనిక బలగాలకు నిరాశే ఎదురైంది. కేవలం ముగ్గురు మహిళా మావోయిస్టులు మాత్రమే ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులు గతంలో కర్రెగుట్టల్లో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్నారు తప్ప మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడం కానీ హతమార్చడం కానీ చేయలేదు. కాకపోతే దండకారుణ్యంలో మావోయిస్టులకు పెట్టని కోటగా నిలిచిన కర్రెగుట్టలను తమ ఆధీనంలోకి తెచ్చుకుని బలగాలు విజయం సాధించాయి. ఇక ఇక్కడ బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం ద్వారా మావోయిస్టులు మరోసారి కర్రెగుట్టల వైపు రాకుండా అడ్డుకోగలిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా తెలంగాణలోని ములుగు జిల్లా అటు ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మరో బేస్‌క్యాంపును ఏర్పాటు చేయడానికి సైనిక బలగాలు ప్రయత్నిస్తున్నాయి.

## కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయం

టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం కాంగ్రెస్ ప్రభుత్వ విజయ మని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కుల గణనతో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం నిర్ణయం తీసుకుని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించిందని, దేశ చరిత్రలో మొదటిసారిగా కుల గణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని వారు తెలిపారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ బుధవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే శాస్త్రీయంగా కులగణనను విజయవంతంగా పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

ప్రజాపక్షం
గురువారం, మే 01

# అధికార ఎజండాలోకి 'కుల గణన'

వచ్చే సంవత్సరం చేబడతారని భావిస్తున్న జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్)లో 'కుల గణన'ను కూడా చేర్చాలని రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నాం. ఇది వాస్తవానికి, ప్రతిపక్ష ఇండియా కూటమికి, ముఖ్యంగా ఈ డిమాండ్‌ను ఛాంపియన్ చేస్తూ ప్రజల్లో చర్చనీయాంశం చేసిన, బడుగు బలహీన వర్గాల్లో కొత్త ఆశలు చిగురింపజేసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధి విజయం. కులగణన అంశాన్ని కాంగ్రెస్ రాజకీయం చేసిందని, తాము సామాజిక న్యాయం కోరుకుంటున్నామని, అందుకే అధికారికంగా కులగణన చేబడుతున్నామని హోంమంత్రి అమిత్ షా చెప్పటం విడ్డూరంగా ఉంది. అనేక సంవత్సరాలుగా కులగణన డిమాండ్ చేస్తున్న రాహుల్‌గాంధి కర్నాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎజండాలో దాన్ని చేర్పించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణతోపాటు కులగణన అంశాన్ని సీరియస్‌గా ప్రచారంలోకి తీసుకెళ్లారు. బ్రిటిష్‌వారి పాలనలో 1931లో దేశంలో కడసారి కులగణన జరిగింది. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగం రిజర్వేషన్‌లు కల్పించింది. కాని జనాభాలో మెజారిటీ అయిన ఇతర బలహీన తరగతులకు (ఒబిసి) అటువంటి రక్షణ లేదు. విద్య, ఉద్యోగాల్లో ఒబిసి రిజర్వేషన్‌లు, ఇతర సదుపాయాలను పరిశీలించిన మండల్ కమిషన్ ఒబిసి జనాభా 50శాతంపైగా ఉన్నారని ఉజ్జాయింపు అంచనా వేసికూడా — రిజర్వేషన్‌లు 50శాతం మించరాదన్న సుప్రీంకోర్టు 'లక్ష్మణరేఖ' దృష్ట్యా 27శాతం రిజర్వేషన్‌లే సిఫారసు చేసింది. వి.పి.సింగ్ ప్రభుత్వం దాన్ని అమలులోకి తెచ్చాక దేశంలో — ముఖ్యంగా హిందీబెల్టు రాష్ట్రాల్లో పెద్ద యుద్ధమే జరిగింది. ఆనాడు బిజెపి ఎల్.కె.అద్వానీ నాయకత్వంలో మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ (అయోధ్య) ఉద్యమం నడిపింది. వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చింది. మండల్ కమిషన్ రిజర్వేషన్‌లు అమలు చేసిన ఫలితంగా బడుగు బలహీనవర్గాల్లో సామాజిక చైతన్యం పెల్లుబుకింది. సామాజిక న్యాయాన్ని ఎజండాగా స్వీకరించిన పార్టీలు యుపి, బిహార్‌లలో అధికారంలోకి వచ్చాయి. పలు రాష్ట్రాల్లో ఒబిసి రిజర్వేషన్‌ల పెంపుకోసం ఆందోళనలు జరిగాయి. కొన్ని రాష్ట్రాలు రిజర్వేషన్‌లు పెంచుతూ చేసిన చట్టాలను సుప్రీంకోర్టు — 50శాతం రూలుతో కొట్టివేసింది. అయితే మోదీ ప్రభుత్వం 10శాతం ఇబిసి రిజర్వేషన్ ఇవ్వటాన్ని సమర్థించింది! కులగణనతో ఈ 50 శాతం ఆంక్షను బద్దలు కొడతామంటున్నారు రాహుల్‌గాంధి.

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి 'కులగణన' డిమాండ్‌ను తిరస్కరిస్తూ వచ్చింది. ప్రధానమంత్రే ఒబిసి — ఇక కులగణన ఎందుకన్న రీతిలో ఆ డిమాండ్‌ను అవహేళన చేసింది. అదే సమయంలో ఒబిసి రిజర్వేషన్ ఫలాలను వారిలో అభివృద్ధి చెందిన కులాలు అనుభవిస్తున్నాయని ప్రచారం చేస్తూ అత్యంత వెనుకబడిన కులాలను రాజకీయంగా చేరదీసి లబ్ధిపొందుతున్నది. జనాభాలో వెనుకబడిన తరగతులకు వారి జనసంఖ్య ప్రకారం అభివృద్ధిలో వాటా లభింపజేయాలంటే జనగణన తప్పనిసరి అని రాహుల్‌గాంధి పట్టువిడవగుండా ప్రచారం చేస్తున్నారు. ఈలోపు బిహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం ఆదరాబాదరా 'కులగణన' సర్వే నిర్వహించింది. కర్నాటక కులగణన నిర్వహించినా రెండు ప్రధాన కులాల — లింగాయత్‌లు, వక్కళిగలు — మధ్య ఫిర్యాదులతో అది వెలుగు చూడలేదు. కాగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం శాస్త్రీయంగా కులగణన నిర్వహించింది. బిసిలకు విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ అన్ని పార్టీల తోడ్పాటుతో బిల్లును శాసనసభలో ఆమోదించి దాన్ని కేంద్రానికి పంపి మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసింది. అంతేగాక ఒబిసిలు అధిక సంఖ్యాకులుగా ఉన్న బిహార్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ కులగణన డిమాండ్ కోసం ఒత్తిడి పెరుగుతున్నది.

రాజీవ్‌గాంధి తెచ్చిన 73, 74రాజ్యాంగ సవరణలు తదుపరి మున్సిపల్, పంచాయతీ రాజ్ సంస్థల్లో ఒబిసిలకు రిజర్వేషన్‌లు దక్కాయి. ఒబిసి సంఘాలు ఇప్పుడు తమ జనాభా ప్రకారం చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్‌లు డిమాండ్ చేస్తున్నాయి. దాదాపు అన్ని పార్టీల్లో సామాజిక న్యాయం స్పృహ పెరిగింది. బిజెపి ముందు చూపుతో ముఖ్యమంత్రి పదవులకు అభ్యర్థుల ఎంపికలో ఒబిసిలకు ప్రాధాన్యత ఇవ్వటం మొదలు పెట్టింది. ఒక భావన భౌతికంగా బలపడినాక దాని అమలును జాప్యం చేయవచ్చుగాని అడ్డుకోవటం సాధ్యం కాదు. ఈ ఒత్తిడే 'కులగణన'ను జనగణనలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసింది. అయితే భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ మేఘాల నేపథ్యంలో ప్రధానమంత్రి బుధవారం నాలుగు ప్రధాన సమావేశాలు జరుపుతున్నట్లు, ఏదో కీలక నిర్ణయం తీసుకోవచ్చని తెలుగు ఎలక్ట్రానిక్ మీడియా ఊపిరిసలపకుండా బాకాలూదుతుండగా, మంత్రివర్గ రాజకీయ వ్యవహారాల కమిటీ 'కులగణన'పై తీసుకున్న నిర్ణయాన్ని 'సంచలన నిర్ణయం'గా వ్యాఖ్యానించటం కొసమెరుపు.

## మేడే స్ఫూర్తితో

# పోరాట వారసత్వం కొనసాగాలి



చలసాని వెంకట రామారావు
ఎఐటియుసి
9490952093

కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు 1848లో కమ్యూనిస్టు ప్రణాళికను రచించారు. "కార్మికులకు పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప. ప్రపంచ కార్మికులారా ఏకం కండి!" అని ఉద్బోధించారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటితం కావాలన్న వారి పిలుపు ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవులను ఐక్యం చేసింది. అనేక దేశాలలో ఎర్రజెండా ఆవిర్భవానికి దారి తీసింది. 1868లోనే ఇంగ్లీషు కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర కార్మిక సంస్థ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ముందుగా ఇంగ్లాండు కార్మిక వర్గం సంఖ్యాపరంగా పెద్దదిగా ఉండటంతో ముందుగా ఇంగ్లండులోనే ప్రారంభమైంది. ప్రపంచ కార్మికులను ఏకం చేసే ప్రయత్నం కూడా ఇంగ్లండులోనే ప్రారంభమైంది. ఇదే కాలంలో ఫ్రాన్సు, జర్మనీలలోని కార్మిక వర్గం సైతం జాగృతమై అనేక సమ్మె పోరాటాలు నిర్వహించాయి.

1864 సెప్టెంబరు 28 వ తేదీన లండన్‌లో సెయింట్ మార్టిన్ హాలులో వివిధ దేశాల కార్మిక వర్గ ప్రతినిధులతో మొట్టమొదటి కార్మిక సమావేశం జరిగింది. అనేక దేశాల కార్మిక వర్గ ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు. స్వయంగా కార్ల్ మార్క్స్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇలీ, జర్మనీ వంటి దేశాల ప్రాతినిధ్యంతో "ఇంటర్ నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్" ఏర్పడింది. "కార్మిక వర్గం తన విముక్తిని తానే సాధించుకోవాలనే" సంకల్పంతో లక్ష్య సాధన దిశగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. ఆశ్రమంలో 1886 అమెరికన్ కార్మిక వర్గం ఎనిమిది గంటల పని విధానంకోసం పోరాటాన్ని ప్రారంభించింది. ఆనాటికే చికాగో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన నగరం. అనేక పారిశ్రామిక సంస్థలతో లక్షలాది మంది కార్మికులతో ఈ నగరం అభివృద్ధి చెందింది. అభివృద్ధితో పాటు అనేక దేశాల నుంచి ప్రజలు వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ఇక్కడ ఆంగ్లో శాక్సన్ ప్రొటెస్టెంటుల ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం దీర్ఘకాలంపాటు సాగింది. జాతి, ఉపజాతి ఘర్షణలు అనేకం జరిగాయి. బయటి వారి సంఖ్య అధికంగా పెరిగిపోవటంతో స్థానిక ధనికవర్గాలు తమ ఆధిపత్యం పోతుందనే భయంతో "నో నథింగ్స్" అనే పేరుతో ఒక రాజకీయ పార్టీని స్థాపించారు. డాక్టర్ లెవి డి.బూనే అనే వ్యక్తిని నగర మేయరుగా ఎన్నుకుని జాత్యహంకారంతో విదేశీయులను వెళ్లగొట్టాలనే ఉద్యమాన్ని ప్రారంభించారు. ఒక అగ్ని ప్రమాదంలో లక్షమంది నిర్వాసితులవ్వగా అంతర్జాతీయంగా వచ్చిన సాయాన్ని దుర్వినియోగం చేశారు.

ఈ కాలంలోనే కార్మికులు తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. వారికి సరైన వేతనాలు ఇవ్వలేదు. 1872లో ఆకలిబాధతో కార్మికులు సహాయ శిబిరాలకు వస్తే వారిని ఒక సొరంగంలో బంధించి తీవ్ర హింసకు గురిచేశారు. ఇక్కడ అనేక మంది శ్రామికులు తమ ప్రాణాలను కోల్పోయారు. దీనినే 'రొట్టెల దొమ్మి' అంటారు. ఈ క్రమంలో 1877లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె చికాగో నగరాన్ని అతలాకుతలం చేసింది. ముగ్గురు కార్మికులు చనిపోయారు. కార్మికులపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. దీనినే 'వైడక్టు యుద్ధం' అంటారు. చికాగోలో మెకార్మిక్ కార్మి సంఘం మొట్టమొదటిగా ఏర్పడింది. ఇక్కడే మొట్ట మొదట 8 గంటల పని డిమాండ్ చేస్తూ ఉద్యమం ప్రారంభమైంది. 1884 అక్టోబరు 7న చికాగోలో ఏర్పడిన కార్మిక సంఘాల సమాఖ్య 1886 మే 1 నుంచి ఎనిమిది గంటల పని అమలు చేయాలని లేకపోతే సమ్మె తప్పదని అల్టిమేటం ఇచ్చింది. ఆస్ట్రేలియా, లండన్, ప్యారిస్ నగరాలు సైతం స్పందించాయి. చివరకు మే 1 న అమెరికా, చికాగోలో సమ్మె ప్రారంభమైంది. చికాగో వీధులు ఎర్రజెండాలతో, కార్మికుల నినాదాలతో హోరెత్తాయి. బెంబేలెత్తిన పెట్టుబడిదారులు కార్మికోద్యమంపై ఉక్కుపాదం మోపారు. 3, 4 తేదీలలో హే మార్కెట్‌లో ఘర్షణలు చెలరేగాయి. కార్మికులు రక్తం చిందించారు. పెట్టుబడిదారుల, పోలీసుల కుట్రల ఫలితంగా బాంబు పేలుడులో ఏడుగురు పోలీసులు సైతం చనిపోయారు. 15 మంది కార్మిక నాయకులను అరెస్టుచేసి నలుగురిని విచారించి ఉరితీశారు. చనిపోయిన కార్మికులను గూర్చి మాత్రం ఎవ్వరూ పట్టించుకోలేదు. 1889 జులై 14న అనేక దేశాల కమ్యూనిస్టు, సోషలిస్టు నాయకుల సమావేశం పారిస్‌లో జరిగింది. ఫ్రెంచి మార్క్సిస్టు గెమోలావిన్సే ప్రతిపాదన మేరకు 1890 మే 1 నుంచి ప్రపంచ కార్మిక దినోత్సవంగా ప్రపంచమంతా జరుగుతున్నది. నేడు 66 దేశాలు అధికారికంగా మేడేను ప్రకటించాయి. కానీ అమెరికా ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ మేడేని గుర్తించలేదు.




భారతదేశంలో 1862 లోనే 8 గంటల పనిదినం డిమాండ్‌తో కలకత్తాలోని హౌరా రైల్వేస్టేషన్ కార్మికులు 1200 మంది సమ్మె చేశారు. 1923లో మద్రాసు మెరీనా బీచ్‌లో సింగారవేలు చెట్టియార్, ట్రిప్లికేన్‌లో ఎస్.కృష్ణస్వామి శర్మ పెద్ద సంఖ్యలో హాజరైన కార్మికుల సమక్షంలో ఎర్రజెండా ఆవిష్కరించి మేడే జరిపారు. 1927లో బొంబాయి మున్సిపల్ కార్మికుల మేడే కార్యక్రమంలో ఎన్.ఎం.జోషి, ఎస్.ఎస్.మిరాజ్‌కర్, ఎస్.వి.ఘాటే పాల్గొన్నారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా మేడే ప్రతి సంవత్సరం జరుగుతున్నది. భారత దేశంలో 1877–1896 మధ్య నాగపూర్, సూరత్, బొంబాయి, కోయంబత్తూరు, అహ్మదాబాద్, కలకత్తా, మద్రాసులలో అనేక కార్మిక సమ్మెలు జరిగాయి. ప్రధానంగా స్పిన్నింగ్, కాటన్ మిల్లులలో ఈ సమ్మెలు జరిగాయి. ఎనిమిది గంటల పనిదినం ప్రధాన డిమాండ్‌గా ఈ సమ్మెలు జరిగాయి. 1920 లో ఏఐటీయూసీ స్థాపనతో కార్మిక సమ్మెల ఉధృతి పెరిగిపోయింది. 1881 లోనే కార్మిక సమ్మెల వెల్లువతో పెట్టుబడిదార్లు ఫ్యాక్టరీల చట్టం కావాలని బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరారు. ఇంగ్లండులోని సామాజిక కార్యకర్తలు, దేశంలో కార్మిక పోరాటాల నేపథ్యంలో ఫ్యాక్టరీల చట్టం వచ్చి సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పని గంటలు వచ్చాయి. 1920లో 10 గంటల పనిదినం, 1930–34 కార్మిక పోరాటాల వల్ల 9 గంటల పని వచ్చింది. 1948 లో 8 గంటల పని విధానాన్ని నాటి కాంగ్రెసు ప్రభుత్వం కార్మిక సంఘాల వత్తిడితో తీసుకు వచ్చింది. నాటి నుంచి నేటి వరకు భారతదేశంలో ఎనిమిది గంటల పని విధానమే అమలు జరుగుతున్నది.

1991 ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పని గంటలు పెంచాలనే చర్చ మొదలైంది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నినాదాలతో కార్మిక హక్కులను హరించి పని గంటలు పెంచాలని ప్రయత్నించారు. సెజ్‌ల పేరుతో కార్మిక చట్టాలకు విలువ లేకుండా చేశారు. దీనికి నిరసనగా భారత కార్మికవర్గం అనేకసార్లు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలుచేసి అట్టి ప్రయత్నాలను తిప్పికొట్టింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలను, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు కుట్రలను తిప్పి కొట్టింది. సమ్మె హక్కు కోసం సైతం భారత కార్మిక వర్గం దేశ వ్యాప్త సమ్మెను చేపట్టింది. గత 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఫక్తు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది. దశాబ్దాల పాటు భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చింది. కార్మికులను యాజమాన్యాలకు వేతన బానిసలుగా చేయాలని ప్రయత్నిస్తున్నది.

ప్రణాళికాబద్ధంగా అనేక దశాబ్దాలుగా నిర్మించుకున్న ప్రభుత్వ రంగాన్ని ధ్వంసంచేసి ప్రజా సంపదను పెట్టుబడిదార్ల సొంతం చేస్తున్నది. ఆయిల్, గ్యాస్, టెలికం, విమానాశ్రయాలు, బొగ్గు, ఇనుము, రైల్వేలు, పోర్టులతో పాటు బ్యాంకులు, బీమా రంగాలను, ఫార్మా కంపెనీలను, దేశ రక్షణ రంగాన్ని ప్రైవేటు పెట్టుబడిదార్లకు అప్పనంగా దోచి పెడుతున్నది. కార్పొరేట్ల ప్రయోజనాలే పరమావధిగా వారికి లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేదలపై భారం వేస్తున్నారు. ఫిక్స్‌డ్ టైమ్ ఎంప్లాయిమెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్సు పేరుతో ఉద్యోగ భద్రతకు తిలోదకాలు ఇచ్చి కోట్లాది మంది కార్మికులను వీధుల పాలు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలలో ఆధునిక సాంకేతికత పేరతో రోబోట్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఎఐ) పేరుతో ఉద్యోగ భద్రతను, నూతన ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలను ప్రశ్నార్థకం చేశారు. ఈ రంగాలలో వర్క్ ఫ్రం హోమ్ నిర్వహిస్తూ పనిలో లక్ష్యాలు నిర్ణయించి 15, 16 గంటల పాటు పనిచేయవలసిన అనివార్య పరిస్థితులు కల్పించారు. కార్మికుల, ఉద్యోగుల కనీస వేతనాలను ఎప్పటికప్పుడు నిర్ణయించటంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టి, "శుష్క వాగ్దానాలు, శూన్య హస్తాలు" అన్నట్లు కార్మికులను, పేదలను భ్రమల ప్రపంచంలో జీవింప చేస్తున్నారు. వారి జీవన ప్రమాణాల పెంపునకు ఎటువంటి చర్యలు లేవు.

నేడు ప్రజల కొనుగోలు శక్తికి పరిమితులు ఏర్పడి ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్నది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు సైతం కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నాయి. పరిమిత జీతాలు, పెన్షన్‌పై కోత, నిరుద్యోగం పెరుగుదల, కనీస వేతనాలు లేకపోవటం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. నిత్యం కార్మిక సమ్మెలు, ఆందోళనలు, భారీ ప్రదర్శనలు జరుగుతున్నాయి.

ధరల పెరుగుదల అడ్డూ అదుపు లేకుండా ఉన్నది. నేడు తిరిగి ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గం సంఘటితం కావల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భారతదేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు కార్మిక వర్గాన్ని వెంటాడి వేధిస్తున్నాయి. అమరవీరులు రక్తతర్పణంతో సాధించిన 8 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పాలకుల దన్నుతో ఎలాన్ మస్క్, నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం వంటి పారిశ్రామిక దిగ్గజాలు తిరిగి 70 నుంచి 90 గంటలు పని వారం తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారు. మేడే స్ఫూర్తితో పనిగంటలతో సహా కార్మిక హక్కులను, చట్టాలను సాధించుకోవాలి. కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించాలి. స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం, కార్మిక శ్రేయోరాజ్యం కోసం కార్మిక వర్గం పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి. పెట్టుబడిదారుల, పాలకుల కుట్రలను భగ్నం చేయాలి.


# మే డే 2025 — శ్రామికుల శక్తికి నూతన దిక్సూచి

ప్రపంచవ్యాప్తంగా మే 1, 2025న 37వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విశేష ఉత్సాహంతో, శ్రామికుల గౌరవార్థంగా ఘనంగా జరుపుకోనున్నారు.ఇది కేవలం సెలవుదినం కాదు — ఇది శ్రమదానం చేసిన వారికి, సమానత్వం కోసం పోరాడిన వారికి అంకితం చేయబడిన రోజు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన హేమార్కెట్ ఉద్యమం ద్వారా ఈ దినోత్సవానికి పునాది పడింది. అప్పటి నుంచి మే డే అనేది కార్మికుల హక్కుల గుర్తింపుకు, సంఘీభావానికి, సామాజిక న్యాయానికి నిలువెత్తు చిహ్నంగా నిలుస్తోంది.

ప్రపంచంలోని అనేక దేశాల్లో మే డేను సాంస్కృతికంగా, రాజకీయంగా తమ స్వంత అవసరాలకు అనుగుణంగా జరుపుకుంటారు. భారత్‌లో ఈ దినోత్సవం అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా గుర్తింపు పొందింది. వివిధ రంగాల్లోని కార్మికులు— గొప్ప సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు నుండి దినసరి కూలీల వరకూ— ఈ రోజు ఒకే ప్లాట్‌ఫామ్‌పై నిలిచి, సంఘీభావాన్ని వ్యక్తం చేస్తారు. కార్మికుల గౌరవార్థం సమావేశాలు, ర్యాలీలు, కళాపరమైన ప్రదర్శనలు జరుగుతుంటాయి.

ఈ సంవత్సరం మే డే, కృత్రిమ మేధస్సు (AI), ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీ వంటి ఆధునిక ఆవిష్కరణల నేపథ్యంలో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. పరిశ్రమలు వేగంగా మారుతున్నాయి. కొన్ని ఉద్యోగాలు పూర్తిగా లేకుండా పోతుండగా, కొన్ని కొత్త ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. ఈ మార్పులో ముఖ్యంగా శ్రమదారులకు గౌరవం, భద్రత, సముచిత వేతనాల పరిరక్షణ అవసరమవుతుంది. పని పద్ధతుల మార్పుతో పాటు, కార్మికుల హక్కులను రక్షించేందుకు కొత్త ప్రణాళికలు, విధానాలు రూపొందించాల్సిన అవసరం తలెత్తుతోంది.

ఈ నేపథ్యంలో, కృత్రిమ మేధస్సు యుగంలో గౌరవ భరితమైన పని అనే అంశం మే డే 2025లో ప్రధానంగా ఉత్కృష్టంగా చర్చించబడుతోంది. శ్రమను తగ్గించే టెక్నాలజీ, ఉపాధిని పెంపొందించే డిజిటల్ పరిజ్ఞానం రెండూ కలిసే సమతుల్య విధానం అవసరం. ఇది కేవలం ఉద్యోగ




భద్రతకే కాక, పని గౌరవానికి, మానసిక ఆరోగ్యానికి, జీవన నాణ్యతకు కూడా ప్రాధాన్యతనివ్వాలి. ఈ ఆవిష్కరణల వేగాన్ని అనుసరిస్తూనే, సమాజంలో ఉన్న అన్ని వర్గాల కార్మికులకు న్యాయమైన అవకాశాలు కల్పించే దిశగా పాలకులు, పౌరులు చిత్తశుద్ధితో ముందడుగు వేయాలి. ప్రస్తుత ఉద్యోగ వ్యవస్థ కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. గిగ్ ఉద్యోగాలు, రిమోట్ వర్క్, ఫ్రీలాన్సింగ్ వంటివి కొన్ని అవకాశాలు కలిగించినా, వాటి ద్వారా శ్రమదారులకు మౌలిక హక్కులు లభించకపోవచ్చు. ఉద్యోగ భద్రత, పెన్షన్, ఆరోగ్య బీమా, పని గంటలు వంటి విషయాలు అస్పష్టంగా మారుతున్నాయి. మానసిక ఒత్తిడి పెరగడం, వ్యక్తిగత జీవితం దెబ్బతినడం వంటి ప్రభావాలు దీని వల్ల చూస్తున్నాం.

ఈ మే డే, శ్రమవీరుల భవిష్యత్తు సాధికారత కోసం నైపుణ్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిస్తుంది. వేగంగా మారుతున్న టెక్నాలజీ నేపథ్యంలో, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ, ఉద్యోగ మార్పులకు సన్నద్ధం చేసే కార్యక్రమాలు, వయోజన విద్య, పునఃశిక్షణ వంటి అంశాల్లో కార్మిక సంఘాలు, ప్రభుత్వాలు, విద్యాసంస్థలు సమగ్రంగా చురుకుగా వ్యవహరించాలి. ఉద్యోగం కోల్పోయే అవకాశమున్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను అందించేందుకు అంతర్నిర్మిత విధానాలతో సమన్వయంగా ముందుకు సాగాల్సిన అవసరం ఈ దినోత్సవం మనకు గుర్తుచేస్తోంది. మే డే 2025 — ఇది కేవలం గతాన్ని స్మరించే రోజు మాత్రమే కాదు, న్యాయం, గౌరవం, సమానత్వంపై ఆధారితమైన భవిష్యత్తును నిర్మించేందుకు ఒక సంకల్పదినం.గత పోరాటాల స్ఫూర్తిని తీసుకొని, మానవీయతను కాపాడుతూ, శ్రమకు గౌరవం ఇచ్చే సమాజం వైపు మనమంతా కదలాలి. పని మారవచ్చు, పద్ధతులు మారవచ్చు — కానీ కార్మికుల హక్కులు, సంఘీభావం, సమానత్వం వంటి విలువలు నిలిచేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఇవే మన సమాజాన్ని గాఢంగా నడిపించే సత్యాలు.

డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ
రిటైర్డ్ ప్రొఫెసర్ & ప్రిన్సిపల్
కాలమిస్టు – హైదరాబాద్. 500045

యాంత్రీకరణ
మానవ సమాజంలో జొరబడింది

కొడవలి లిక్కి చూరుకి వేలాడుతుంది
పదును లేక మొద్దు బారింది
పదును బెట్ట కమ్మరి లేడు
ప్రపంచీకరణ ఊరుమ్మడి బతుకుల అంతు చూసింది
ఊర్లోకి కోత యంత్రాలు పనిలేని కొడవలి

బావులు పోయాయి ... బోర్లు వచ్చాయి
నీళ్ల లేక నోళ్లు తెరిచిన బీళ్లు
అరకొర పండినా ధర లేక విలవిల
బ్యారేజ్ రిజర్వాయర్ తేడా తెలియని
రాజకీయం చేతుల్లో నీటి పారుదల కమీషన్ల బొక్కసం
వాస్తవం గాంచి ఉద్యమించ కదలని రీతి

ప్రభుత్వ రంగ సంస్థల్లేవు
సైరన్ మోగట్లేదు ఖాకీ చొక్కాల అడుగులు లేవు




పెట్టుబడి విన్యాసాల
ప్రైవేట్ కర్మాగారాల్లో వెట్టి చాకిరీ / పనిగంటల హోరు
కార్మిక చట్టాల కుదింపుతో పెట్టుబడి రాక్షస క్రీడ
భద్రత గాలికి / అణువణువూ అర్పితం!
లోపలికి వెళ్ళటమే

బైటికి రావడం కార్మికుని చేతిలో లేదు
భార్యాపిల్లలతో గడపటానికి రోజులో ఓ గంట గగనం
ఇంకెక్కడి బంధుమిత్ర మిలాఖత్
మానవసంబంధాల చెర బడుతున్న పెట్టుబడి

ఉరుకుల పరుగుల జీవితం
ఒత్తిడిలో మానసిక వైకల్యం
మతం నరనరాన పాకి పిడికిళ్ళు బిగించలేకపోతున్న తరం
భవిష్యత్ కళ్ళ ముందు తారాడుతున్నా పెగలని నోళ్ళు
సాధక బాధకాల విశ్లేషణ లేదు పోరాట స్ఫూర్తి లేదు
హర్తాళ్ నే మర్చిన జనం !

మేడే అంటే ఏంటో అర్థం చెప్పండి అంటున్న నేటి తరం
పాఠాలు నేర్పే చరిత్ర ను చదవని తరం!
అబద్ధాలను మెదళ్లలోకి ఎక్కించుకుని ఛాందస ఊబిలోకి!

గిరి ప్రసాద్ చెలమల్లు
9483388201

# కార్మికులను మే డేకు దూరంచేసి ఛాందసంలోకి నెట్టే విశ్వకర్మ దినం

గత పది సంవత్సరాలుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ అనుబంధ కార్మిక సంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికులను మేడే నుండి, హక్కులకై పోరాటాల నుండి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నది.

**మే డే చరిత్ర:** దాదాపు 139 సంవత్సరాల క్రితం మే 1 1886 లో పని పరిస్థితులను మెరుగు పరచాలని ఎనిమిది గంటల పని దినాన్ని కోరుతూ అమెరికాలోని చికాగో సమీపంలోని హే మార్కెట్ వద్ద కార్మికులు శాంతియుతంగా సమ్మె చేసి ప్రదర్శనను నిర్వహించారు. కార్మికుల ఐక్యతను పోరాటాన్ని సహించలేని ఫ్యాక్టరీల యాజమాన్యం వీరిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపింది. ఆ కాల్పుల్లో అసువులు బాసిన తోటి కార్మికుల రక్తంతో తడిసిన బట్టే ఎర్రజెండాగ మారి అనంతరం కార్మికులు ఆ జెండానే కార్మిక హక్కుల జెండాగా పోరాటాల్లో కొనసాగిస్తున్నారు.ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ 1889లో మొదటిసారిగా మే డే ను కార్మిక దినోత్సంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జరుపుకున్నారు. నాటి నుండి కార్మికులు ప్రపంచ వ్యాప్తంగా హక్కులపై జరుపుకునే మేడే పండుగ మన దేశంలో దాదాపు 100 సంవత్సరాలకు పూర్వమే ప్రారంభమైంది. ఈ క్రమంలో అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (AITUC) స్థాపనతో ఈ పోరాటా లు మరింత పదునెక్కాయి. ఒక ప్రక్క బ్రిటిష్ వాళ్ళ వలసపాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొంటూనే కార్మికుల హక్కులైన ఎనిమిది గంటల పని దినం, బాల కార్మిక వ్యవస్థ రద్దు, యాజమాన్యంతో బేరసారాలహక్కు, యూనియన్ స్థాపించుకునే హక్కు, స్త్రీ,పురుష సమాన వేతనం, కార్మికులకు పెరిగే ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంపు, ఉద్యోగ భద్రత వంటి అనేక డిమాండ్లను భారతకార్మికవర్గం వివిధ మిలిటెంట్ పోరాటాల ద్వారా సాగించుకోగలిగింది. కాగా ప్రస్తుత బి.జె.పి ప్రభు త్వం పెట్టుబడిదారులకు ఫ్యాక్టరీ యజమాన్యానికి అనుకూలంగా, పైన పేర్కొన్న అనేక కనీస కార్మిక హక్కులను కాలరాసి వాటి స్థానంలో నాలుగు లేబరు చట్టాలను కోడ్‌లను తెచ్చింది. హెచ్ఎంటి, డిపిఎల్ వంటి భారీ ప్రభుత్వ పరిశ్రమలు, అనేక చిన్న పరిశ్రమలు మూతపడి లక్షల మంది కార్మికులు నిరుద్యోగులై వీధి పాలైనారు. ఈ నేపథ్యంలో పెరిగిన అశాంతితో కార్మికులు తిరగబడకుండా, పోరాటాల నుండి దారి మళ్లించేందుకు సనాతన ధర్మ ఆధారంగా ఉండే విశ్వకర్మ దినాన్ని ఆర్.ఎస్.ఎస్ దాని అనుబంధ కార్మిక సంఘం ముందుకు తెచ్చాయి. బి.జె.పి ప్రభు త్వం భాద్రపద మాసంలోని సెప్టెంబర్ 17వ తేదీన విశ్వకర్మ దినంగా ప్రకటించింది. ఆ రోజు వీరి అభిప్రాయం మేరకు ఫ్యాక్టరీ యాజమానులు కార్మికులు కలిసి యంత్రాలకు, పనిముట్లకు పూజలు చేసి యజ్ఞం చేయాలి. ఇరువురు కుటుంబ సభ్యుల వలె మెలగాలి. ఉత్పత్తిని పెంచి సంపదను పెంపు చెయ్యాలనేవి వీరి ఉవాచ .వృత్తి యజమానికి సంపద పెరిగితే కార్మికులకు సహజంగానే వేతనాలు పెరుగుతాయనేది వీరి అభిప్రాయం. కానీ వాస్తవానికి వస్తు ఉత్పత్తి పెరిగిన ఉత్పత్తి అధికారులైన ఫ్యాక్టరీ యజమానులు బిలియనీర్లుగా మారుతున్నారు తప్ప, కార్మికులు కనీసం తమ ఉద్యోగాలు సైతం నిలుపుకోలేక రోడ్ల పై అసంఘటిత కార్మికులుగా, రోజువారి కూలీలుగా మారుతున్నా రు.

**ఎవరీ విశ్వకర్మ ?**

సూర్యుడి కుమార్తె సంజన వృత్తి పనివాడైన విశ్వకర్మను ప్రేమిస్తుంది. ఇది సూర్యుడికి నచ్చదు. సూర్యుడి కోపోద్రేకాల నుండి రక్షణకు, తమ బ్రతుకు తెరువుకు విశ్వకర్మ అనేక పనిముట్లు సృష్టించి ఎన్నో వస్తువులను తయారు చేస్తాడు. ఋగ్వేదంలోని పురుష సూక్తం (10.8.1.6 ప్రకరణాల) ప్రకారంగా విశ్వకర్మ సృష్టి ఆరంభంలో నీరు, నేల ,జీవరాశులను ఉత్పత్తి చేస్తాడు. ఇతడు నైపుణ్యం కలిగిన ఆర్కిటెక్టు, విష్ణుమూర్తి సుదర్శన చక్రం, శివుడి త్రిశూలాన్ని, దేవేంద్రుడి రథాన్ని, ద్వారక, ఇంద్రప్రస్త తదితర నగరాలను ఇతడే తన శ్రమ శక్తితో సృష్టించాడు. ఆర్ఎస్ఎస్ కథనం ప్రకారం పురాణాల్లో శ్రమ శక్తికి విశిష్ట గౌరవం కలదని, ఈ కారణంగానే శ్రమ శక్తికి గౌరవం కల్పించడాన్నే విశ్వకర్మ దినంగా యజమాని కార్మికుడు కుటుంబ సభ్యులవలె ఆర్ఎస్ఎస్ కలిసి జరుపుకోవాలి. కాగా కార్మికుడు వెచ్చించిన శ్రమ శక్తికి తగ్గ ఫలితాన్ని యాజమాని తిరస్కరించి ధనవంతుడవటం గురించి వీరు ఒక్క మాటైనా మాట్లాడరు.

**విశ్వకర్మ పథకం:**

ప్రధాని నరేంద్ర మోదీ 2023వ సంవత్సరంలో వివిధ వృత్తి పని వార్ల సంక్షేమానికి 'విశ్వ కర్మ పథకాన్ని' ప్రారంభించారు. దీనికై 2028 వరకు 13 వేల కోట్ల రూపాయలను సైతం కేటాయించారు. వివిధ వృత్తి పనివారు వారి వ్యాపారాలను ఈ మార్కెటింగ్ ద్వారా అంతర్జాల సహాయంతో మార్కెటింగ్ చేసుకోనేటందుకు వడ్డీలు లేని రుణాలు కల్పించడం ఈ పథకం ఉద్దేశం. కాగా 2024వ సంవత్సరాని కి దేశంలో 52 కోట్ల మంది వివిధ వృత్తులకు చెందిన వెనుకబడిన కులాల వారు ఉండగా కేవలం వెయ్యి మందికి కూడా ఈ సులభ రుణాలు లభించలేదు. కాగా విశ్వకర్మ, ముద్ర పథకాల ద్వారా55 కోట్ల మందికి వ్యాపారాలు వృద్ధి చేసుకోవటానికి ఋణాలు విరివిగా ఇచ్చినట్లు ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేసుకుంటున్నది. మన చుట్టూ ప్రక్కల ఉన్న వృత్తి పనివారు వెనుకబడిన కులాల ప్రజలు ఎంతమందికి ఈ రుణ సౌకర్యం లభించిందో చూస్తే వాస్తవం మరొకటిగానున్నది. ఇలా బిజెపి, ఆర్ఎస్ఎస్ లు కార్మికులు తమ కులవృత్తిలో ఆధ్యాత్మికంగా సనాతన ధర్మం అనే వాటిలో మునిగి వాటినే నిర్వహి స్తూ తమ హక్కుల కొరకు సంఘటితం కాకుండా కులవృత్తుల పేరుతో విభజన తీసుకు వచ్చి వారిని బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నవి. అంతర్జాతీయ కార్మిక దినమైన మే డే స్ఫూర్తి ని తగ్గించి ,విశ్వకర్మ దినంగా శ్రమజీవులను మూఢ నమ్మకాల్లోకి తీసుకువచ్చే అన్ని రకాల పన్నాగాలను ఎదుర్కొంటు కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునే విధంగా పాటుపడాల్సిన ఆవశ్యకత శ్రామిక శక్తులపై ఉంది.

ఎట్టబోయిన మహేశ్వరి



# జనరల్
STATE & REGIONAL NEWS

## టిఐసిసిసి డైరెక్టర్‌గా విబి కమలాసన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టిఐసిసిసి) డైరెక్టర్‌గా విబి కమలాసన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న కమలాసన్‌రెడ్డి బుధవారమే పదవీ విరమణ చేశారు. అయితే ఆయన్ని ప్రభుత్వం తిరిగి అపాయింట్‌మెంట్ చేసుకుంది. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీవింగ్‌లో అతనికి స్థానం కల్పించింది. టిఐసిసిసి డైరెక్టర్‌గా పూర్తి బాధ్యతలు ఇచ్చారు.

## రుణమాఫీ చేసి రైతు సంక్షేమానికి
# ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

రైతులు, వ్యవసాయాధికారితో భేటీ, రుణమాఫీపై అసంతృప్తి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రుణమాఫీని రైతులందరికీ పూర్తిస్థాయిలో వర్తింపజేసి వారి సంక్షేమానికి కట్టుబడి ఉండాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రుణమాఫీ కాని రైతులు, వ్యవసాయ అధికారితో భేటీ అయి వివరాలు సేకరించిన చాడ వెంకటరెడ్డి రుణమాఫీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిందని, ఎన్నికల హామీని అమలుపరిచే క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. అనేక మంది రైతుల రుణాలు మాఫీ కాకపోవడంతో ఆందోళన, ఆవేదన చెందుతున్నారన్నారు. 60శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం భరించాలని, అటు అసలు రుణం మాఫీ కాక, ఇటు వడ్డీ మాఫీ కాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. రెండు లక్షల పైబడి రుణం ఉన్న వారి అసలు, మిత్తి సైతం మాఫీ కావడం లేదన్నారు. చిగురుమామిడి మండలంలో 9588 మంది రైతులు రుణాలు తీసుకుంటే, కేవలం 5864 మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ అయ్యిందని, మిగతా 3724 మంది రైతులకు రుణాలు మాఫీ కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చిందని, ఇప్పటికే కొంతమందికి రుణాలు మాఫీ అయినప్పటికీ మెజారిటీ రైతులకు రెండు లక్షల లోపు రుణాలు మాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులందరికీ రుణాలు మాఫీ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చాడ శ్రీధర్ రెడ్డి, మాజీ మండల కార్యదర్శి తేరాల సత్యనారాయణ, రైతులు కయ్యం తిరుపతి, సాధ వెంకటరెడ్డి, అనుమాసుల మల్లారెడ్డి, పింగళి రాంరెడ్డి, నందికొండ మల్లారెడ్డి, నాగెల్లి సంపత్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజయ్య తదితరులున్నారు.

**వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయండి**

భారతదేశంలో మహోజ్వల పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం సిపిఐ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు బండారు తిరుపతి అధ్యక్షతన సిపిఐ గ్రామశాఖ మహాసభ జరిగింది.

ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిరంతరం కార్మిక, కర్షక, పేద, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి, దోపిడీ లేని వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చాడ శ్రీధర్ రెడ్డి, శాఖ కార్యదర్శి అందె సంపత్, నాయకులు బండారి తిరుపతి, వెంకటయ్య, రాములు, నరేష్, చొక్కయ్య పాల్గొన్నారు.

## అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారిగా డాక్టర్ సువర్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారిగా డాక్టర్ సువర్ణ బుధవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఐఎఎస్ అధికారుల బదిలీ ఉత్తర్వులో ప్రభుత్వం డాక్టర్ సువర్ణను అటవీ శాఖకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ సైన్ పట్టా సాధించిన సువర్ణ 1991లో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆమె 1994–2003 వరకు గుంటూరు, రంగారెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారిగా, డిఆర్‌డిఎ, డిడబ్ల్యూఎంఎ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఎపి ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా నాలుగేళ్లు పనిచేశారు. రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో స్పెషల్ కమిషనర్‌గా కూడా విధులు నిర్వహించారు. బయోడైవర్సిటీ సెక్రటరీ మెంబర్‌గా, ఫిషరీస్ కమిషనర్‌గా, ఎన్‌ఎఫ్‌డిబి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023 నుంచి అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సువర్ణను అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారిగా బదిలీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో డాక్టర్ సువర్ణ తెలంగాణ ప్రభుత్వం నుంచి పలు రాష్ట్ర అవార్డులు అందుకున్నారు.

# 'రబీ'లోనూ తెలంగాణే రికార్డు

ధాన్యం దిగుబడిలో దేశంలోనే రికార్డు సృష్టించిన తెలంగాణ

యాసంగి పంట కొనుగోలుకు రూ.15,000కోట్లు విడుదల

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యాసంగిలో పండిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15,000 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం దిగుబడిలో ఖరీఫ్ సీజన్‌లో యావత్ భారతదేశంలోనే రికార్డ్ సృష్టించిన తెలంగాణ రాష్ట్రం రబీ సీజన్‌లోనూ అదే రికార్డు సృష్టించనుందని ఆయన పేర్కొన్నారు. యాసంగిలో తెలంగాణ రైతులు 54.89 లక్షల ఎకరాలలో సాగు చేయగా, 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు. దాదాపు 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన ప్రకటించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని పౌర సరఫరాల శాఖ కేంద్ర కార్యాలయం నుండి బుధవారం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల నుండి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ రూపొందించిన విధివిధానాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్‌లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రానున్న 20 రోజులు అత్యంత కీలకమైనవని, ఈ సమయంలో కలెక్టర్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు కలెక్టర్ల దృష్టికి వస్తే సత్వరమే చర్యలు తీసుకోవడంతో పాటు పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శిని సంప్రదించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల లోపు మద్దతు ధరను రైతుల ఖాతాలో జమ చేయడంతో పాటు సన్నాలకందించే బోనస్ చెల్లింపులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా 8,381 కొనుగోలు కేంద్రాలు**

ధాన్యం కొనుగోళ్ల కోసం ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు దాదాపు 13.71 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, మరో 3.79 కోట్ల గోనె సంచులు సమీకరిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. తేమ శాతాన్ని పరిశీలించిన అనంతరమే రైతులకు గోనె సంచులు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గోదాములు అందుబాటులో లేని చోట్ల నేరుగా రైస్ మిల్లులకు తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మధ్యంతర గోదాముల వసతి ఉన్నచోట్ల కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని సంబంధిత గోదాములకు తరలించాలన్నారు. అవసరం అని భావించిన ప్రాంతాల్లో ఇప్పటికే పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువ ఉంచే సామర్థ్యం కలిగిన గోదాములను కేటాయించినట్లు ఆయన చెప్పారు.

**సన్న రకం ధాన్యానికి రూ.444 కోట్ల బోనస్**

ఇప్పటికే 29లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందని, సుమారు 2.55 లక్షల రైతుల నుండి 19.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం అందించే మద్దతు ధర ప్రకారం 4,545.72 కోట్లు కాగా, ఇప్పటివరకు 2,289 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని మంత్రి వెల్లడించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న బోనస్ మొత్తం రూ.444.20 కోట్లను రైతుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమౌతుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు రైతాంగానికి తెలియజేసేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాలలో ప్రతి రోజు ఉదయం వాతావరణ సమాచారాన్ని వివరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఎండ వేడిమికి ఇబ్బంది పడే రైతులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు.

తేమ శాతాన్ని తెలియజెప్పే డయ్యర్‌లను కొనుగోలు చేసిన కరీంనగర్ కలెక్టర్‌ను ఆయన అభినందిస్తూనే మిగిలిన జిల్లాలలో కుడా ఇది అమలు చేయాలన్నారు. ధాన్యం నాణ్యతతో పాటు త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తిచేసేందుకు దోహదపడుతుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 1,579 రైస్ మిల్లులను సిఎంఆర్ నిమిత్తం గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే 45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వివిధ రైస్ మిల్లులకు కేటాయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన**

కొత్తగా మంజూరు చేయనున్న తెల్ల రేషన్ కార్డుల కోసం లబ్ధిదారులు పెట్టుకున్న దరఖాస్తులను సునిశితంగా పరిశీలిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పరిశీలన పూర్తి అయిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్
# రూ.1070 కోట్ల ఆర్థిక సహాయం



మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

71 మంది లబ్ధిదారులకు రూ.23.33లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/కూసుమంచి :** రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీనిచ్చారు. రాష్ట్రంలోని నిరుపేదలకు వైద్య సహాయం నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ కింద ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో రూ.1070 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 23 లక్షల 33 వేల రూపాయలు, 35 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్షా 116 రూపాయల చొప్పున కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదవాడికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. ఆనాడు పాలించిన పాలకులు 10 సంవత్సరాలలో వైద్యం పట్ల ఎప్పుడూ మనం ఇచ్చిన నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద సుమారు 1070 కోట్ల రూపాయలను పేదల వైద్య ఖర్చుల నిమిత్తం పంపిణీ చేశామని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున రిలీఫ్ ఫండ్ ఇవ్వడం ఇదే మొదటిసారి అని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేద కుటుంబానికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని 10లక్షలకు పెంచామని అన్నారు. పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ కింద 71 మంది లబ్ధిదారులకు 23 లక్షల 33 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను, కల్యాణలక్ష్మి పథకం కింద 35 మంది లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ జి.నర్సింహారావు, కూసుమంచి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూదాన భూముల అన్యాక్రాంతంపై..
# హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, అన్యాక్రాంతమైన భూదాన భూములను పరిరక్షించాలి

ముఖ్యమంత్రికి అఖిల భారత సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి విజ్ఞప్తి




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గత పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన భూదాన భూముల అన్యాక్రాంతం, అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిలభారత సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. భూదాన భూముల విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని అన్యాక్రాంతమైన భూదాన భూములను పరిరక్షించాలని, తెలంగాణ భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి రెండేళ్లలో భూముల పంపిణీని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూదాన భూముల పరిరక్షణ కోసం ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను, చేపట్టిన చర్యలను స్వాగతిస్తున్నామన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణా గౌడ్, వెదిరె రామచంద్రారెడ్డి కుమారులు వెదిరె ప్రమోతిష్ చంద్రారెడ్డి, వెదిరె ప్రభోద్ చంద్రారెడ్డి, భూదాన రామచంద్రారెడ్డి సేవా సంఘ్ నాయకులు దానయ్య, ఎం.రాజు, శ్రీమంతగిరి నరేష్ గౌడ్, భూదాన పోచంపల్లి భూదాన గ్రహీతలతో కలసి మహాదేవ్ విద్రోహి మాట్లాడారు. గతంలో బర్తరఫ్‌కు గురైన భూదాన యజ్ఞ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి హయాంలో జరిగిన భూదాన భూముల అక్రమాలకు సంబంధించి సిబిసిఐడిలో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేసి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచానికి ఆదర్శంగా భూదాన ఉద్యమం ప్రారంభమైన తెలంగాణలోనే దేశమంతా వేలెత్తి చూపే విధంగా వేల కోట్ల రూపాయల భూదాన భూముల కుంభకోణాలు జరిగినట్లు మీడియాలో వస్తున్న వార్తల ఆధారంగా తెలుస్తోందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద భూ కుంభకోణమన్నారు. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్‌లోని 14 ప్రాంతాల్లో జరిపిన దాడులలో భూదాన భూములకు సంబంధించిన పత్రాలు దొరకడం ఆశ్చర్యాన్ని కలిగించాయని, భూదాన ఉద్యమానికి సంబంధించిన కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు బయటకు ఎలా వెళ్లాయో అర్థం కావడంలేదని, ఈ చర్యల వెనుక ఉన్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశవ్యాప్తంగా బోధన భూముల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. భూదాన భూములు ప్రభుత్వ భూములు కావని, అవి పేదలకు చెందినవని ఇటీవల హైకోర్టు తీర్పునివ్వడం హర్షనీయని, ఈ నేపథ్యంలో గతంలో 'ధరణి'లో ప్రభుత్వ భూములుగా చూపిన భూదాన భూములను ప్రస్తుతం 'భూ భారతి'లో భూదాన భూములుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. భూదాన భూములకు సంబంధించిన వందలాది కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్ ఉన్నాయని వాటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. భూదాన భూములు అన్యాక్రాంతం కావడానికి గత పదేళ్లుగా భూదాన యజ్ఞ బోర్డు పాలకవర్గం లేకపోవడమే కారణమని, ఇప్పటికైనా ప్రభుత్వం భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేయాలని, కోర్టుల్లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**జులైలో భూదాన ఉద్యమ రజతోత్సవం**

భూదాన ఉద్యమానికి నాంది పలికిన వెదిరె రామచంద్రారెడ్డి జన్మదినమైన జులై 17వ తేదీన భూదాన ఉద్యమం రజతోత్సవాన్ని హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు వెదిరె అరవింద్ రెడ్డి ప్రకటించారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించనున్నామన్నారు. ఇప్పటికే భూదాన ఉద్యమం రజతోత్సవాలు మహారాష్ట్రలో ప్రారంభమై వివిధ రాష్ట్రాలలో జరుగుతున్నాయని, ముగింపు ఉత్సవాలు హైదరాబాదులో జరుగుతాయన్నారు.

## ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా షానవాజ్ ఖాసిం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న షానవాజ్ ఖాసింను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా బదిలీచేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. షానవాజ్‌ఖాసింకు అదనపు బాధ్యతల కింద డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిజిగా నియమిస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు.


మాననీయ ప్రథమ శ్రేణి న్యాయస్థానం అర్నీ
ప్రస్తుతం : శ్రీ విశాల్ శ్రావణ్ దోండే

**నోటీస్**

రెగ్యూలర్ సివిల్ క్లెయిమ్ నెం. 38/2023
వాయిద తేది: 05.05. 2025

మధ్య

1. శ్రీమతి మంగళ అలియాస్ బేబీ అనంతరావు కట్కొజ్వర్, నివాసం: ఈశ్వరీనగర్, ఘటంజీ, తాలుక, జిల్లా యవత్మాళ్.
2. శ్రీమతి శోభా దీపక్ కట్కొజ్వర్, నివాసం: భివాపూర్ వార్, చంద్రపూర్ తాలుక, జిల్లా చంద్రపూర్.

... వాదులు

మరియు

1. రాజు అంగద్ యెరోజ్వర్, నివాసం: కపేశ్వర్, తాలుక అర్నీ, జిల్లా యవత్మాళ్.
2. కృష్ణ అంగద్ యెరోజ్వర్, నివాసం; ప్రేరణానగర్, ఎలోరా ఫ్యాక్టరీ సమీపంలో, యవత్మాళ్.
3. గిరిధర్ అంగద్ యెరోజ్వర్, నివాసం: సమతానగర్, వద్గావ్ రోడ్, యవత్మాళ్, జిల్లా యవత్మాళ్.
4. అల్కా సంతోష్ కట్కొజ్వర్, నివాసం: సంభాజీనగర్, దిగ్రస్, తాలుక దిగ్రస్, జిల్లా యవత్మాళ్..
5. రాధాబాయి గోపాల్ యెరోజ్వర్
6. నితిన్ గోపాల్ యెరోజ్వర్

(5 మరియు 6 నివాసం: పటాన్పోరి, తాలుక పండర్కవడ, జిల్లా యవత్మాళ్)

7. అనితా గోపాల్ యెరోజ్వర్ అలియాజ్ అనిత రాజు శ్రీపద్మావర్, నివాసం: భాగ్యనగర్, ఆదిలాబాద్ తాలుక మరియు జిల్లా ఆదిలాబాద్.

... ప్రతివాదులు

క్లెయిమ్ నెం. 38/2023 యందు గ్రామ నెం. 40, వ్యవసాయ బ్లాక్ నెం. 136, మొత్తం విస్తీర్ణం 1 హెక్టార్ 65, ఆర్ సైజ్ రూ. 3 విలువ, భోగవల్దార్ క్లాస్ గా వర్గీకరించబడిన వ్యవసాయ భూమి పంపిణీకి సంబంధించి రెగ్యులర్ సివిల్ క్లెయిమ్ నెం. 38/2023ను దాఖలు చేశారు.

ప్రతివాది నెం. 7, అనితా గోపాల్ యెరోజ్వర్ ఉర్ఫ్ అనితా రాజు శ్రీపద్మావర్, నివాసం: భాగ్యనగర్, ఆదిలాబాద్ తహసీల్ మరియు జిల్లా ఆదిలాబాద్. కు సంబంధించి ఈ నోటీసు ద్వారా ప్రజలందరికీ తెలియజేయడమైనది. ఈ కేసుకు సంబంధించి ఎవరికైనా ఆసక్తి, అభ్యంతరాలు లేదా వ్యతిరేకతలు ఉంటే, ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 30 రోజులలోపు న్యాయవాది ద్వారా ఈ కోర్టుకు సమర్పించాలి.


సిద్ధం చేసినవారు:
సంతకం
జూనియర్ అసిస్టెంట్

ఆదేశం ప్రకారం:
సంతకం
అసిస్టెంట్ సూపరింటెండెంట్
మాననీయ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అర్నీ.


# త్వరితగతిన పుష్కరాల పనులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/ కాళేశ్వరం :** పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన కాళేశ్వరంలో వివిఐపి ఘాట్, గోదావరి ఘాట్, 100 గదుల సత్రం, వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని సూచించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటివరకు పనులు జరగలేదని అధికారులు గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

పనులు వేగవంతం చేసేందుకు కూలీలను పెంచాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముందు కుర్చీని కాపాడుకోండి : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీకి మరో పదేళ్లు అధికారం అనేది పగటి కలనేనని, ముందుగా తన సిఎం కుర్చీ లాగకుండా రేవంత్ రెడ్డి చూసుకోవాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, కాళేశ్వరం ప్రాజెక్ట్, రుణమాఫీ, బోగస్ 60వేల ఉద్యోగాలు, కులగణనపైన తాను చర్చకు సిద్ధమని, సమయం, స్థలాన్ని చెప్పాలని స్పష్టం చేశారు. బసవేశ్వరుని జయంతిని, పదవ తరగతి ఫలితాలను కూడా సిఎం రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకున్నారని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

టెండర్ నోటీస్ నెం.P-01/25-26 of DE/OP/SURYAPET

సూర్యాపేట ఆపరేషన్ డివిజన్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనుల కొరకు అర్హత కలిగిన విక్రయదారుల నుండి టెండర్లను ఆహ్వానిచడమైనది. వివరాలు www.tgsouthernpower.com లో లభించును. ఫోన్ నెం. 7288800888, ఆఖరి తేది: 08.05.2025

సం/- డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్, సూర్యాపేట్.

DIPR R.O. No. : 1093-PP/CL/ADVT/1/2025-26, Date: 30-04-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.9, చార్మినార్ జోన్.

NIT No.04/EE.Div.No.9/GHMC/2025-26 షార్ట్ టెండర్ నోటీసు తేది: 29.04.2025

పని వివరణ: నిర్వహణ పని (01) నెం., అంచనా మొత్తం: రూ.10.85లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 29.04.2025న సా.05.00గం.ల నుండి, స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 02.05.2025న సా.05.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ జి.హరి కిషోర్, 9849906768.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-9, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1127-PP/CL/ADVT/1/2025-26, Date: 30-04-2025

# ప్రపంచం WORLD NEWS

# రష్యా ఫోబియాను ప్రతిఘటిద్దాం రండి

## ఫాసిస్ట్ వ్యతిరేక మహాసభలో పుతిన్ పిలుపు



**మాస్కో :** రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా సాధించిన ఫలితాలను వక్రీకరించేందుకు సమకాలీన ప్రపంచంలో గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయని అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అన్నారు. రష్యా ఇప్పుడు ఎన్నో సవాళ్ళు ఎదుర్కొంటున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. మాస్కోలో బుధవారంనాడు జరిగిన మూడవ అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక మహాసభలో పుతిన్ ప్రసంగిస్తూ, జాత్యాహంకారం, నయా నాజీ నియంతృత్వవాదం, రష్యాకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసి రష్యా ఫోబియాను సృష్టించడం వంటి అనేక వినాశకరమైన ఆలోచనల సవాళ్ళను దేశం ఎదుర్కొంటున్నదని వీటిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని పుతిన్ పిలుపు ఇచ్చారు. ''ఈరోజున రష్యా దేశం చాలా పెద్ద సవాళ్ళను ఎదుర్కొంటున్నది, ఇరవయ్యో శతాబ్దంలో జరిగిన అత్యంత వినాశకరమైన యుద్ధం నుండి వచ్చిన ఫలితాలను తారుమారుచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి, స్వార్థపూరితమైన రాజకీయ ప్రయోజనాలు సాధించడంకోసం ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు, వినాశకరమైన ఆలోచనలు అమలు చేస్తున్నారు, రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ సాధించిన యుద్ధ విజయాన్ని కళ్ళముందు కనిపించకుండా అదృశ్యం చేస్తున్నారు, గడచిన యుద్ధం తాలూకూ పోరాటాలు, ఆనాడు పడిన కష్టాలు, సాధించిన విజయాలను మనం నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది, మన ఐక్యతను రక్షించుకోవడానికి ఇదెంతో కీలకం'' అని పుతిన్ భావోద్వేగ ప్రసంగం చేశారు. బలమైన పునాదులతో నిర్మించిన సురక్షితమైన సమాజాన్ని, న్యాయబద్ధమైన ప్రపంచాన్ని, దేశాలమధ్య సమాన భాగస్వామ్యం ఉన్న ఐక్య సంబంధాలను భావి తరానికి మనం అందించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. మాతృదేశ సంరక్షణకోసం చేసిన మహోన్నతమైన యుద్ధం జరిగి 80 సంవత్సరాలు పూర్తయిన వార్షికోత్సవాలను కూడా రష్యా చేసుకుంటున్నదని, ఆ సందర్భంగా ఇచ్చే సెలవుదినం ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రజలను ఏకం చేస్తుందన్నారు. నాజీయిజాన్ని అణచివేసి యూరప్‌ను బానిసత్వం నుండి కాపాడిన గొప్ప యుద్ధ జ్ఞాపనాలు మరచిపోకూడదన్నారు.

**యుద్ధ విరమణ ఒప్పందం అంత ఈజీ కాదు**


**కీవ్ :** ఉక్రేన్‌తో యుద్ధ విరమణ ఒప్పందం అంత సులభంకాదు, సత్వరం జరిగేదికాదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమ్రీ పెస్కోవ్ అన్నారు. ఈ విషయంలో అమెరికా చాలా సత్వర పరిష్కారాన్ని కోరుకుంటున్నదని, ఈ శాంతి ఒప్పందం కుదిరేముందుగా కొన్ని ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానాలు రావాలని ఆయన అన్నారు. ఉక్రేన్‌తో ప్రత్యక్ష చర్చలు జరపడానికి రష్యా సిద్ధంగా ఉందని, కానీ తమ ప్రశ్నలకు సమాధానాలు వస్తాయా? అనే స్పష్టత ఉండాలన్నారు. ఎలాంటి ముందస్తు షరతులూ లేకుండా చర్చలకు తాము కూడా సిద్ధంగానే ఉన్నామన్నారు. మూడేళ్ళుగా సాగుతున్న యుద్ధం ఈ మధ్య గడచిన రెండు నెలలుగా చాలా ఉద్ధృతంగా సాగుతున్నది, ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల నష్టం కూడా అపారంగా జరుగుతోంది. ఒకవైపు ట్రంప్ అల్లంత దూరంలోనే శాంతి ఒప్పందం ఉందని ఊరిస్తుండగా, మే నెల 8 నుండి 10వ తేదీ వరకూ పుతిన్ ఏకపక్షంగా ఉక్రేన్‌లో కాల్పుల విరమణ ప్రకటించారు. కానీ ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఈ కాల్పుల విరమణ గడువు కనీసం 30 రోజులైనా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ఉక్రేన్ కూడా స్వచ్ఛంధంగా కాల్పుల విరమణ పరకటిస్తుందని తాము ఎదురుచూస్తున్నామని రష్యా అధికార ప్రతినిధులు చెబుతున్నారు.

## ఘనంగా వియత్నాం 50వ విజయోత్స వేడుకలు



**హనోయ్ :** వియత్నాం పునరేకీకరణ 50వ వార్షిక విజయోత్సవ వేడుకలు బుధవారంనాడు ఘనంగా జరిగాయి. దక్షిణ వియత్నాంలోని కమ్యూనస్టు సాయుధ ఉద్యమ ఐక్య సంఘటన ''వియత్ కాంగ్'' 1975 ఏప్రిల్ 30వ తేదీన ఉత్తర వియత్నాంలోని సైగాన్ లేదా ఈనాటి హోచిమిన్ సిటీని స్వాధీనం చేసుకోవడంతో ఉత్తర–దక్షిణ వియత్నాంల పునరేకీకరణ మహోజ్వలఘట్టం పూర్తయింది. ఈ యుద్ధం పూర్తయి 2025 ఏప్రిల్ 30వ తేదీ నాటికి యాభై వసంతాలు గడిచాయి. ఈ సందర్భంగా వియత్నాంలో సైనిక కవాతులతోపాటు భవిష్యత్ భవిష్యత్ శాంతి లక్ష్య నిర్దేశాలు చేసుకున్నారు. ముందురోజు నుండే ఈ వేడుకలలో పాల్గొనేందుకు వేలాదిమంది హోచిమిన్ సిటీకి చేరుకునిఇ నగరంలోనే మకాం వేశారు. యుద్ధ సమయంలో ఉత్తర వియత్నాం సైనికులు ధరించిన దుస్తులు వేసుకుని ముందు నడుస్తుండగా చైనా, లావోస్ పీపుల్స్ రిపబ్లిక్, కాంబోడియా దేశాలకు చెందిన సైనికులు కూడా వారి వెనుక కవాతులు చేశారు. యాభైఏళ్ళక్రితం ఉత్తర వియత్నామీ యుద్ధ ట్యాంకులు గేట్లు ధ్వంసం చేసుకుని అధ్యక్ష భవనంలోకి ప్రవేశించాయి. అదే ప్రాంతంలో కవాతులు జరుగుతున్న సమయంలో ఒకవైపు ఆకాశంలో వియత్నాం హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు ఆ దేశ పతాకాలు ధరించి గగనవిన్యాస విహారాలు చేశాయి. హోచిమిన్ సిటీలో జరిగిన ఈ వేడుకలలో వియత్నాం కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి తో లామ్ మాట్లాడుతూ, యాభై సంవత్సరాలనాటి పోరాట చరిత్రను జ్ఞాపకం చేశారు. సరిగ్గా యాభై ఒవత్సరాలక్రితం చేసిన మహత్తరపోరాటంద్వారా 30 సంవత్సరాలపాటు స్వాతంత్ర్యంకోసం వియత్నాం ప్రజలు చేసిన పోరాటం,వలస పాలన ముగిశాయన్నారు. ఆనాటి సోవియట్ యూనియన్, చైనా, లావోస్, కాంబోడియా దేశాల చేతి చలువవల్లనే వియత్నాం స్వాతంత్ర్యాన్ని సాధించుకోగలిగిందని ఆయన చెప్పారు. ''మనం గతాన్ని గౌరవిద్దాం, భవిష్యత్తును నిర్మించుకుందాం, ఒక ఉత్తమ సమాజం కోసం కొత్త తరాలను తయారు చేసుకుందాం'' అని ఆయన అన్నారు. ఈ వేడుకలు, ఆనాటి స్ఫూర్తి ఈనాటికీ వియత్నాం ఐక్యతను చాటిచెబుతున్నాయన్నారు. ఒకనాడు వియత్నాం ఉద్యమకారులను ట్రక్కుల్లో రహస్యమార్గంలో ఎవరికీ తెలియకుండా ఉద్యమ ప్రాంతాలకు తరలించిన లారీ డ్రైవరు పామ్ ఎంగోక్ తన అనుభవాలను, ఆనాటి పరిస్థితులను వివరించారు. హోచిమిన్ సిటీ నివాసి ఒకరు మాట్లాడుతూ, ఈనాడు అమెరికా–వియత్నాం మధ్య ఎలాంటి శత్రుత్వానికీ తావులేదని, స్నేహానికీ, శాంతికీ మాత్రమే అవకాశం ఉందని, ప్రపంచ శాంతికి అదొక్కటే మార్గమని అన్నారు.

# అధికారానికి ఆమడ దూరంలో కార్నీ



**ఒట్టావా :** కెనడా పార్లమెంటు ఎన్నికల్లో లిబరల్‌పార్టీ ఏకైక పెద్దపార్టీగా ఘన విజయం సాధించినప్పటికీ అధికారాన్ని అందుకోవడానికి మెజార్టీ తగ్గడంతో మూడు సీట్ల దూరంలో ఆగిపోయింది. దేశంలో వరుస గా నాలుగోసారి లిబరల్‌పార్టీ అధికారాన్ని ని లబెట్టుకుని చారిత్రక విజయం నమోదు చేసింది. మొత్తం 67 శాతం పోలింగ్ నమోదుకాగా, 172 స్థానాలు గెలుచుకున్నపార్టీదే కెనడా అధికారం లభిస్తుంది. కానీ లిబరల్‌పార్టీ 169 స్థానాల్లో విజయం సాధించింది. తర్వాత అత్యధికస్థానాలు గెలుచుకున్న కన్జర్వేటివ్‌పార్టీ ప్రతిపక్ష హోదా సంపాదించింది. జస్టిన్ ట్రూడో రాజీనామా చేయడంతో లిబరల్‌పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన మార్క్ కార్నీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన కొద్దిరోజులకే ఎన్నికల ప్రకటన చేసి అనుకున్నట్టుగానే విజయం సాధించారు. ఆయన విజయానికి ట్రంప్ నోటి దురుసుకూడా ఎంతో ఉపయోగపడింది. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరిపోవడానికి ఆ దేశ ప్రజలు ఇష్టపడుతున్నారని, ఇచ్చి తమ దేశంలో ఒక రా ష్ట్రంగా చేరిపోవాలనీ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కెనడా ప్రజలను సమైక్యపరచాయి. ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీకి 144 స్థానాలు, బ్లాక్ క్యుబెకోయిస్‌పార్టీకి 22 స్థానాలు, ఎన్‌డిపికి 7 స్థానాలు లభించాయి.

## యుపిఎస్‌లో 20వేల ఉద్యోగాల కోత

**జార్జియా :** ప్రపంచ రవాణరంగ దిగ్గజం, సరఫరా వ్యవస్థ యునైడెట్ పార్శిల్ సర్వీస్ (యుపిఎస్) పొదుపు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా 20,000 మంది ఉద్యోగులను తొలగించడానికి సిద్ధమైంది. మార్కెట్ పరిస్థితుల్లో మార్పులు సంభవించినందువల్ల కొందరు ఉద్యోగుల తొలగింపుతోపాటు మౌలిక సదుపాయాలను కూడా ఉపసంహరించుకుంటున్నట్లు యుపిఎస్ సిఇఓ కరోల్ టామ్ చెప్పారు. 3.5 బిలియన్ డాలర్లు పొదుపు చేయడంతోపాటు 73 కేంద్రాలను మూసివేసి, మరో 20,000 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఏడాది జూన్ ఆఖరు నాటికి 73 కేంద్రాలను మూసివేసి ఖర్చులు తగ్గించుకుంటున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో యుపిఎస్‌కు సుమారు ఐదు లక్షలమంది ఉద్యోగులు ఉన్నారు. ఈ నిర్ణయం వల్ల వీరిలో నాలుగుశాతం ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుంది. పునర్నిర్మాణ కార్యకలాపాల కింద ఈ ఏడాది 600 మిలియన్ డాలర్లు కూడా ఖర్చుచేయాలని ప్రణాళిక రూపొందించింది.

## అఫ్గాన్ వలస ప్రజలకు 71 మి.డాలర్లు సహాయానికి విజ్ఞప్తి

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్, ఇరాన్ దేశాల నుండి స్వదేశం అఫ్గానిస్థాన్‌కు తిరిగి వచ్చిన లక్షలాదిమంది వలస ప్రజలకు 71 మిలియన్ డాలర్లు సహాయం కావాలని ఐక్యరాజ్యసమితి శరణార్థుల హై కమీషనర్ ప్రతినిధి బాబర్ బాలోచ్ చెప్పారు. అఫ్గానిస్థాన్ ఇప్పుడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఇతర దేశాలకు అక్రమంగా వలసవెళ్ళినవారిని స్వదేశం అఫ్గాన్‌కు తిరిగి పంపేశారని, వారికి ఉపాధి సమస్య ఎదురైందని అన్నారు. ఏప్రిల్ నెలలో పాకిస్థాన్, ఇరాన్ దేశాల నుండి ప్రతికూల పరిస్థితులమధ్య 2.51 లక్షలమంది అఫ్గానిస్థాన్ ప్రజలు తమ స్వదేశానికి చేరుకున్నారని చెప్పారు. వీరందరికీ తక్షణ సహాయం అవసరమన్నారు.

## ఆర్.ఎస్.నగర్ అగ్ని బాధితుల సహాయనిధి

**విజ్ఞప్తి**

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని రావినారాయణ రెడ్డి కాలనీ, ఫేస్– 3లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 400 గుడిసెలు తగలబడటం జరిగింది. ఈ గుడిసెలలో బడుగు బలహీనవర్గాల ప్రజలు గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వలన వారి నిత్యావసర వస్తువులు, దాచుకున్న డబ్బులు, బట్టలు, పిల్లల విద్యా సర్టిఫికేట్స్ అన్ని కాలీ బూడదైనాయి. వారందరూ దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయులై వున్నారు. వీరికి మానవతాదృక్పథంతో వస్తురూపంలోనైన, డబ్బు రూపంలోనైన సహకారం అందించాలని విజ్ఞప్తి. దాతల వివరాలు ఎప్పటికప్పుడు ప్రచురించబడును.

**30-04-2025 న సహాయం అందించిన దాతల వివరాలు...**

| | | |
|---|---|---|
| 1. | పాలమాకుల జంగయ్య (సిపిఐ రంగారెడ్డి జిల్లా పార్టీ తరపున..) | రూ.50,000 |
| 2. | ఉజ్జిని రత్నాకర్ రావు (ఎఐటియుసి సీనియర్ నాయకులు) | రూ.20,000 |
| 3. | హనుమాన్ కిరాణం జనరల్‌స్టోర్ | రూ.4,000 |
| 4. | కరునాకర్‌రెడ్డి (ఎస్‌టియు రాష్ట్ర నాయకులు) | రూ.2,000 |
| 5. | తిరుపతయ్య | రూ.500 |

ఫోన్‌పే: 9866996737, (రవీంద్రాచారి, భాగ్యమ్మ)

– ఆందోజు రవీంద్రాచారి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

## 100 రోజుల్లో 39 వేలమంది తిరిగి రాక

**మెక్సికోసిటీ :** అమెరికా–మెక్సికోమధ్య వలసల సమస్య ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తారాస్థాయికి చేరింది. ట్రంప్ పట్టుదలతో సరిహద్దుల్లో కఠిన నియంత్రణ చర్యలు తీసుకోవడంతోపాటు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న మెక్సికన్లను స్వదేశానికి తరలిస్తున్నారు. ఈ విధంగా ట్రంప్ అధికారం చేపట్టిన జనవరి 20వ తేదీ నుండి ఇప్పటివరకూ 39,000 మంది మెక్సికో ప్రజలను స్వదేశానికి అమెరికా తిప్పిపంపించింది. వీరందరూ ఇప్పుడు ఉపాధి, ఆహార సమస్యలు ఎదుర్కొంటున్నారు. మెక్సికన్లు పేదరికాన్ని భరించలేక తమ బతుకులు మెరుగుపరచుకోవడంకోసం సరిహద్దులు దాటి లక్షలాదిమంది అమెరికాలో చొరబడుతూ ఉండటంతో బరాక్ ఒబామా, డోనాల్డ్ ట్రంప్‌లు ఎక్కువగా ఈ సమస్యపై దృష్టి సారించారు. జోబైడెన్ ఈ విషయంలో ఒక చేతగాని అధ్యక్షుడుగా మారి దేశాన్ని నాశనం చేశారని ట్రంప్ ఇప్పటికీ బైడెన్‌పై విరుచుకుపడుతున్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత గణనీయంగా మెక్సికో ప్రజలు అమెరికాలోకి చొరబడకుండా అడ్డుకున్నారు. అమెరికాలోకి ఎక్కువగా గౌతమాలా, సాల్వడార్, వెనిజులా, హోండూరాస్‌లకు చెందిన ప్రజలు అక్రమంగా ఎలాంటి అర్హత పత్రాలూ లేకుండా జొరబడుతున్నారు. వారు హింసాత్మక కార్యకలాపాలతోపాటు ఇతర నేరాలకు కూడా పాల్పడుతున్నారని, గ్యాంగ్ వార్‌లు సృష్టిస్తున్నారనీ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారనీ ట్రంప్ ఆరోపణ. సరిహద్దులు దాటుతుండగా 2022లో 686 మంది మెక్సికన్లు అదృశ్యమయ్యారు లేదా మరణించారన్నది మెక్సికో ప్రభుత్వ ఆరోపణ.

## ఆదర్శ నమూనా (మొదటి పేజీ తరువాయి)

ఈ కులగణనకు తెలంగాణ రాష్ట్రం ఒక ఆదర్శ నమూనా'' అన్నారు. పదకొండు సంవత్సరాలపాటు వ్యతిరేకత వ్యక్తం చేశాక ఎట్టకేలకు త్వరలో జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేయాలని కేంద్రం తీర్మానించింది. కేంద్ర రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ కమిటీ తీర్మానం చేసిన కొద్దిగంటలకే రాహుల్‌గాంధీ బుధవారంనాడు పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ''ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మేం మద్దతు తెలియజేస్తున్నాం, పూర్తిగా మద్దతు ఇస్తున్నాం, కానీ మేం దీనికి ఒక కాల పరిమితి, ఒక గడువు ఉండాలని కోరుతున్నాం, ఎప్పుడు చేస్తారో తెలుసుకోవాలని మేం కోరుకుంటున్నాం'' అన్నారు. ప్రభుత్వం ఒక కాలపరిమితి చెప్పకుండా ఆకస్మికంగా ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అదేవిధంగా రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని కూడా తొలగించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. కులగణనకు నిధులను కేటాయించాలని కోరారు. ''మేం ప్రజా గణాంకాలు కోరుకుంటున్నాం, బ్యూరోక్రాట్లు చేసే గణాంకాలను మేం కోరుకోవడంలేదు'' అని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్షాలన్నీ జాతీయస్థాయిలో కులగణన చేపట్టాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. దీనిని ఒక ప్రధాన ఎన్నికల నినాదంగా చేశాయి. బీహార్, తెలంగాణ, కర్ణాటక వంటి రాష్ట్రాలు కులగణన సర్వేలు నిర్వహించాయి.

**ఇది ప్రతిపక్షాల విజయం**

కేంద్ర మంత్రివర్గం జనాభాలెక్కలతోపాటు కులగణన కూడా చేపట్టాలని ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిపక్షాల విజయంగా పలు పార్టీలు అభివర్ణించాయి. దీర్ఘకాలంగా ప్రతిపక్షాలు దేశంలో కులగణన చేపట్టాలని కోరుతున్నాయని, ఇక బిజెపి ప్రభుత్వం గత్యంతరంలేక అనివార్యంగా మెజారిటీ డిమాండ్‌కు తలవొగ్గి ఈ నిర్ణయం తీసుకుందని పలు పార్టీలు పేర్కొన్నాయి. 'అస్సలు ఏమీ చేయకుండా చేతులు ముడుచుకుని కూర్చోవడంకంటే కాస్త ఆలస్యంగానైనా కులగణన చేయడం ఆహ్వానించదగిన విషయమని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేశ్ అన్నారు. రాష్ట్రీ జనతాదళ్‌పార్టీ నాయకుడు లాలూప్రసాద్ యాదవ్ స్పందిస్తూ, గడచిన ముప్ఫై సంవత్సరాలుగా దేశంలో సోషలిస్టులు కులగణన చేపట్టాలని కోరుతున్నారని గుర్తుచేశారు. ''మమ్మల్ని కులోన్మాదులుగా అభివర్ణించేవారికి ఈ కులగణన తగిన జవాబు చెబుతుంది, ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది, దీనిని మా ఎజెండాలో కొనసాగిస్తూనే ఉంటాం'' అని ఆయన ఎక్స్ వేదికగా హిందీలో పోస్టింగ్ పెట్టారు. తాను జనతాదళ్ అధ్యక్షుడుగా ఉండగా, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు 2001లో జరిగే జనాభాలెక్కల సేకరణతోపాటు కులగణన కూడా చేపట్టాలని 1996–97లో మంత్రివర్గం ద్వారా తీర్మానించామని, కానీ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం దానిని అమలు చేయలేదని పేర్కొన్నారు. ఆర్‌జెడి రాజ్యసభ ఎంపి మనోజ్ ఝూ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం మెజారిటీ బహుజనుల నిర్ణయమని అన్నారు. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ కులగణన నిర్ణయాన్ని ఆహ్వానించారు. ఒక నిర్ణీత కాలపరిమితికి లోబడి ఈ కులగణన ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. దశాబ్దకాలంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైందని, ఈ విషయంలో కేంద్రం విఫలమైందనీ, సరైన సమయంలో చేపట్టకపోవడం విచారకరమని అన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే అందుకు కులగణన భరోసా ఉండాలన్నారు. సిపిఐ (మార్క్సిస్ట్) ఎంపి జాన్ బ్రిట్టస్ స్పందిస్తూ, బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం బిక్కమొఖంవేసి పూర్తిగా ఇంతకుముందున్న తన వైఖరిని మార్చేసుకుందని విమర్శించారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో దీనిని చూసినాగానీ కులగణన ఎంతో మంచి పరిణామమన్నారు. ప్రజలు ఎంతగానో కోరుకున్న ఈ నిర్ణయం అమలులో చాలా జాప్యం జరిగిందని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఇప్పటికే కులగణన సర్వే చేసిన రాష్ట్రాలను కేంద్రం ఎందుకు విమర్శిస్తోందని ఆయన ప్రశ్నించారు. వారి నిర్ణయం అనుమానాస్పందగా ఉందన్నారు. ఐతే ఈ నిర్ణయం హర్షించదగినదన్నారు.

# ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

## ఆరుగురి దుర్మరణం

### మృతుల్లో ఐదుగురు వైద్య విద్యార్థులు



**నెల్లూరు:** నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కారు బీభత్సం సష్టించిన ఘటనలో ఆరుగురు మతి చెందారు. ఇందులో ఐదుగురు వైద్య విద్యార్థులు ఉన్నారు. పోతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ముంబై జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్‌బంకు వద్దకు రాగానే అదుపుతప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బుచ్చిరెడ్డి పాలెంలో తమ స్నేహితుడి సోదరి నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మతులను అభిషేక్ రాజ్ (అనంతపురం జిల్లా), జీవన్ చంద్రారెడ్డి (నెల్లూరు), యజ్ఞేశ్ (ప్రకాశం), నరేశ్ నాయక్ (అనంతపురం), అభిశశి పురుషోత్తం(తిరుపతి)గా గుర్తించారు. మరో విద్యార్థి నవనీత్ శంకర్ (కడప) ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు.

**చంద్రబాబు తీవ్ర విచారం**

నెల్లూరు జిల్లాలో కారు ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఐదుగురు వైద్య విద్యార్థులు, మరో వ్యక్తి మరణించడం బాధాకరమన్నారు. మతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

# దేశంలో కులగణన

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. ప్రతిపక్షాలతోపాటు బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి మిత్రపక్షాలు కూడా ఈ కులగణన సేకరణకు సుముఖంగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే కులగణన సర్వేలు నిర్వహించాయని, నిజాయతీ, బాహాటత్వ పద్ధతులు పాటించకపోవడంవల్ల ఈ సర్వేలపై సమాజంలో చాలా సందేహాలు నెలకున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలు చాలాకాలంగా దేశంలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ కులగణన అంశాన్ని కాంగ్రెస్‌సహా పలు ప్రతిపక్షాలు ఎన్నికల్లో ఒక ప్రధాన రాజకీయాస్త్రంగా మలుచుకున్నాయని భావించిన కేంద్ర ప్రభుత్వం, రాబోయే రోజుల్లో చేపట్టే జనాభా లెక్కల సేకరణతోపాటు అరమరికలు లేని పద్ధతిలో కులగణన కూడా చేపడతామని ప్రకటించింది.జనాభా లెక్కల సేకరణ, కులగణన సేకరణ అనే ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ జాబితాకు సంబంధించిన విషయమని, ఐనాగానీ బీహార్, తెలంగాణ, కర్ణాటక వంటి కొన్ని రాష్ట్రాలు ఈ కులగణన సేకరణ చేశాయని వీటిల్లో ఎలాంటి నిజాయతీ, పారదర్శకత లేదని సమాజంలో సందేహాలు నెలకున్నాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండీ ఇప్పటివరకూ చేసిన జనాభాలెక్కల సేకరణలో అన్ని కార్యకలాపాలలో కులాన్ని చేర్చలేదని, కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాలు ఎప్పుడూ కులగణనకు వ్యతిరేకంగా ఉంటాయనీ, కానీ ఈ కులగణనను ఒక రాజకీయాస్త్రంగా ఉపయోగించాలనే దురుద్దేశంతో ఈ అంశాన్ని ఆ పార్టీ ఒక సమస్యగా మార్చిందని అశవనీ వైష్ణవ్ విమర్శించారు. ఈ వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాత రాజకీయాల కారణంగా సమాజంలో ఉన్న కులవ్యవస్థ లేదా సామాజిక అల్లికలో ఎలాంటి పొరపొచ్చాలు, అలజడి తలెత్తకూడదనే ఉద్దేశంతో అరమరికలు లేకుండా కులగణన కూడా నిర్వహించాలని రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమై నిర్ణయించిందని చెప్పారు. కులాలవారీగా దేశంలో విడి విడిగా సర్వేలు నిర్వహించేబదులుగా, జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సేకరణవల్ల ఒకవైపు దేశం పురోగతిబాటలో పయనిస్తూ ఉంటే మరోవైపు దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కూడా మరింత పటిష్టవంతమవుతుందన్నారు. ఇటీవల ఎన్నికలలో ప్రతిపక్ష ''ఇండియా'' కూటమి పార్టీలు కులగణన సర్వేను నినాదంగా ముందుకు తీసుకువచ్చాయి. కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ కూడా జనాభా ప్రాతిపదికపై ప్రజలకు ప్రాతినిధ్యం ఉండాలని, అందుకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందని ఎన్నికల్లో ప్రచారం చేశారు.

**వచ్చే సీజనులో చెరకు గిట్టుబాటు ధర రూ.15లు పెంపు:** అక్టోబరులో ప్రారంభమయ్యే 2025–26 పంట సీజనులో చెరకు గిట్టుబాటు ధర పెరిగింది. ప్రస్తుతం 2024–25 చెరకు పంట సీజనులో నిష్పక్షపాత, చెరకు గిట్టుబాటు ధర (ఎఫ్‌ఆర్‌పి)ను క్వింటాలుకు రూ.340లుగా ఉండగా, రాబోయే సీజనులో ఈ క్వింటాలు ధర రూ.355లకు పెరుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) బుధవారంనాడు సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. గతంకంటే రాబోయే చెరకు పంట సీజనులో క్వింటాలు చెరకు ధర 4.41 శాతం ఎక్కువగా ఉందని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. రాబోయే సీజనులో చెరకు ఉత్పత్తి వ్యయాన్ని క్వింటాలుకు రూ.173లుగా అంచనావేశారు. ఎఫ్‌ఆర్‌పిని క్వింటాలుకు రూ.355లుగా నిర్ణయించారు. ఉత్పత్తి వ్యయం కంటే రికవరీ రేటు 10.25 శాతం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వ్యవసాయంలో చెరకు పంట అత్యంత కీలకమైనది. దేశంలో ఐదుకోట్లమంది చెరకు రైతులపై ఈ గిట్టుబాటు ధరలు ప్రభావం చూపిస్తాయిన గనుక వీటిని ఎంతో జాగ్రత్తగా నిర్ణయించామన్నారు. దాదాపు ఐదు లక్షలమంది కార్మికులు ప్రత్యక్షంగా పరోక్షంగా చక్కెర కర్మాగారాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 28 నాటికి 87 శాతం మేరకు చెరకు రైతుల బకాయిలు చెల్లించామని మంత్రి చెప్పారు. 2024–25 చెరకు సీజనులో రూ. 97,270 కోట్లు రైతులకు మొత్తం బకాయిలు చెల్లించారు. కాగా 2024–25 చెరకు సీజనులో మొత్తం 99.92శాతం మేరకు రూ.1,11,782 కోట్లు బకాయిలను రైతులకు చెల్లించారు.

**రూ.22,864 కోట్లతో షిల్లాంగ్–సిల్చా జాతీయ రహదారి:** మేఘాలయ–అసోం రాష్ట్రాలమధ్య మావ్లింగ్‌ఖుంగ్ నుండి పంచ్‌గ్రామ్ వరకూ రూ.22,864 కోట్ల ఖర్చుతో గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించనున్నది. మొత్తం 166.80 కిలోమీటర్ల నిడివిగల ఈ జాతీయ రహదారిని అత్యాధునికంగా పర్యావరణహితంగా, అత్యంత సుందరంగా అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) బుధవారంనాడు ఆమోదం తెలియజేసింది. జాతీయ రహదారి–6 కింద మేఘాలయలో 144.80 కిలోమీటర్లు నిర్మాణం జరుగుతుంది. అసోంలో 22 కి.మీ మేరకు ఈ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంది. గువహటి, సిల్చార్ మధ్య వాహనాల రాకపోకలకు సులభంగా ఉండటానికి, రద్దీని తగ్గించడానికి ఈ జాతీయ రహదారి ఎంతగానో దోహదం చేస్తుంది. త్రిపుర, మిజోరాం, మణిపూర్, బారక్ వ్యాలీ ప్రాంతాలకు కూడా అనుసంధానం చేసేవిధంగా దీనిని నిర్మిస్తారు. దీనిని గువహటి ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తారు. దీనివల్ల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుంది.

**కాంగ్రెస్ రాజకీయాస్త్రంగా కులగణన : మంత్రి అశ్వనీవైష్ణవ్**

కులగణనను కాంగ్రెస్ రాజకీయాస్త్రంగా మార్చిందని కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్ విమర్శించారు. 2010లో మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఎస్ఇసిసి (సామాజిక ఆర్థిక కులగణన)పేరుతో ఒక సర్వే నిర్వహించారనీ, కులగణన బదులుగా ఈ సర్వేను మాత్రమే కాంగ్రెస్‌పార్టీ చేయించిందని విమర్శించారు.కులగణన అనేది లోక్‌సభకు సంబంధించిన అంశమని అప్పట్లో మన్మోహన్ చెప్పారని, మంత్రివర్గంలో చర్చిస్తామన్నారని, ఆ తర్వాత మంత్రివర్గ బృందం పరిశీలించిందనీ, చాలా పార్టీలు కూడా కులాలవారీగా గణాంకాలు తీయాలని సూచించినప్పటికీ ఆనాడు 2011లో ఎస్ఇసిసి సర్వే మాత్రమే మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం నిర్వహించిందని విమర్శించారు. ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు ఇప్పుడు కులగణను ఒక రాజకీయాస్త్రంగా ఉపయోగించుకుంటున్నాయని అర్థమవుతున్నదన్నారు. ''1881లో, 1931లో బ్రిటీష్ ప్రభుత్వం పరిపాలిస్తుండగా స్వాతంత్ర్యానికి పూర్వం జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టిల కులగణన తప్ప ఇక ఇతర కులాల లెక్కలు తీయకూడదని 1951లో నిర్ణయించారు. రాజ్యాంగంలోని 246వ అధికరణ ప్రకారం, జనాభా లెక్కల సేకరణ కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఉండే విషయం. కానీ కొన్ని రాష్ట్రాలు అందుకు విరుద్ధంగా కులగణన సర్వేలు నిర్వహించాయి'' అని అశ్వనీ వైష్ణవ్ విమర్శించారు. దేశం, సమాజ విలువలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమాజంలో రిజర్వేషన్లు పొందేవారిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆర్థికంగా బలహీనవర్గాలకు పదిశాతం రిజర్వేషన్లను తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అశ్వనీ వైష్ణవ్ అన్నారు. దేశంలో ఇంతకుముందు 2011లో జనాభా లెక్కల సేకరణ జరిగింది. తదుపరి జనాభా లెక్కలు 2020లో జరగాల్సి ఉండగా, కరోనా మహమ్మారి విజృంభించడంతో ఈ జనాభా లెక్కల సేకరణలో జాప్యం జరిగింది. చాలా తొందరలో దేశంలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని గత ఏడాదిలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఐతే ఎప్పుడు ఈ సేకరణ జరుగుతుందన్న విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఐతే సామాజిక సమానత్వం, సమాజంలో ప్రతివర్గానికీ సమాన హక్కులకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే గణాంకాలలో వారి వారి ప్రాధాన్యతలను నమోదు చేస్తామని ప్రధాని చెప్పారని ఎక్స్ వేదికగా అమిత్ షా పోస్టింగ్ పెట్టారు. అనేక దశాబ్దాలుగా కాంగ్రెస్‌తోపాటు దాని మిత్రపక్షాలు కూడా కులగణనను వ్యతిరేకిస్తూ వచ్చాయని, ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్నాక రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కులగణన చేయాలన్న నిర్ణయం దేశంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మేలు జరుగుతుందని, వారిని కూడా సామాజిక పథకాల్లో చేర్చడానికి వీలు కలుగుతుందని, అణగారిన వర్గాలకు కొత్తదారులు పరిచేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు.

## ప్రతిపక్షాల విజయం

జాతీయ జన గణనలో భాగంగా కుల గణనను చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించడం ప్రతిపక్షాల విజయం. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇప్పటికే సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టి తెలంగాణ రాష్ట్రం మార్గదర్శిగా నిలిచిం ది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో బిసి జనాభాకు అనుకూలంగా విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ పెంపుపై తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లులను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి.

– కూనంనేని సాంబశివరావు

## కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

దేశవ్యాప్తంగా జనాభా గణనలో భాగంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.కులగణన నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రివర్గానికి ధన్యవాదాలు. 'దేశంలో కుల గణన ప్రక్రియను ప్రారంభించిన తొలి రాష్ట్రం తెలంగాణ. 'తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది' అనే విషయం మరోసారి స్పష్టమైంది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దార్శనికత నెరవేరింది. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం.

– సిఎం రేవంత్‌రెడ్డి



# జనరల్

STATE & REGIONAL NEWS

## గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడు

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా బసవేశ్వరుడనీ అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కెలక్టరేట్లో ఘనంగా మహాత్మీ బసవేశ్వర 892 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భం మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ పూల మాలలు వేశారు. అలాగే సరాఫ్ బజార్ బసమేశ్వర స్వామి దేవాలయంలో బసవేశ్వర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశాడన్నారు. జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అబ్దుల్ ఖలీల్, డిపిఆర్ఒ రషీద్, అగ్రికల్చర్ అధికారి జాన్ సుధాకర్, ఆర్వీఎల్ ఎల్బి నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఆవుటి రవి కుమార్, కె.మల్లికార్జున్, గందే రవికాంత్, అరకంచి రవి కుమార్, బి.నాగభూషణం, కన్న జగదీష్, కన్న శివకుమార్ పాల్గొన్నారు.

## వేగంగా 'గ్రామీణ రహదారుల' నిర్మాణ ప్రక్రియ

'హమ్' డిపిఆర్ రూపకల్పనకు కసరత్తు

4వేల కిలోమీటర్ల రహదారుల సర్వే పూర్తి

డిపిఆర్ ఆధారంగానే బడ్జెట్ ఖరారు

2026 జనవరిలో పనులు ప్రారంభం..?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను నిర్మాణ పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఒక వైపు నిర్మాణ పనులను పక్రియను, మరోవైపు రహదారుల సర్వేను పంచాయతీరాజ్ శాఖ సమారంతంగా చేపడుతోంది. 'హైబ్రిడ్ యా న్యూటి మోడ్'(హెచ్ఎఎం హమ్) ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ రహదారులను నిర్మించే ందుకు డిపిఆర్ రూపకల్పన పక్రియను వేగవంతం చేసింది. దీనికి సంబంధించిన కన్సల్టెంట్లను నియమించింది. 'హమ్' పనులను మరింత వేగంగా నిర్వహించేందుకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయి సీతక్క పనుల పర్యవేక్షణ నిమ్మితం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక అధికారిని నియమించారు. రహదారుల నిర్మాణ పనులను 2026 జనవరిలో పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే టెండర్ ప్రక్రియను కూడా పంచాయతీరాజ్ శాఖ మొదలుపెట్టాలని భావిస్తోంది. అయితే కన్సల్టెంట్లు రూపొందించిన డిపిఆర్ ఆధారంగానే ఈ ప్రాజెక్ట్కు బడ్జెట్ను ఖరారు చేస్తారు. ఆ తర్వాత డిపిఆర్ పైన మంత్రివర్గంలో చర్చించిన, తర్వాత ప్రాజెక్ట్ విధి విధానాలను ఖరారు చేయనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, ఆధునికరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం హమ్ విధానానికి శ్రీకారం చుట్టింది. హమ్ ప్రాజెక్ట్లో భాగంగా రాష్ట్రంలో మొత్తం 17,300 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి దశగా 7393 కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో నాలుగు వేల కిలోమీటర్ల మేర సర్వే పూర్తి చేశారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించి కొంత షేర్ను ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన షేర్ను టెండర్ దక్కించుకునే కంపెనీలు భరించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి గ్యారంటీ ఉండబోదు. 15 సంవత్సరాల పాటు సదరు కంపెనీ రహదారుల నిర్వహణ బాధ్యతలను చేపట్టాల్సి ఉంటుంది. కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఈ విధానం అమలులో ఉన్నది. ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా త్వరితగతిన గ్రామీణ రహదారుల నిర్మాణం పూర్తి చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

**4వేల కి.మీ రహదారుల సర్వే పూర్తి**

ప్రతిపాదిత గ్రామీణ రహదారులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 9 జిల్లాల్లో ఇప్పటికే నాలుగు వేల కిలోమీటర్ల వరకు సర్వేను పూర్తి చేశారు. నియోజకవర్గాలల్లో ఎంఎల్ఎ ఆమోదం పొందిన తర్వాత రహదారుల ప్రతిపాదనలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఖరారు చేయనున్నారు. జాతీయ, రహదారులు, భవనాలకు చెందిన రహదారుల తరహాలోనే గ్రామీణ రహదారులను తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్ట్ను త్వరితగతిన పట్టాలు ఎ క్కించేందుకు, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి అదనపు భారం లేకుండా ప్రజలకు అధునాతన రోడ్డు సదుపాయాల కల్పనకు దోహదం చేయనున్న ఈ ప్రాజెక్ట్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని, నిర్దేశించుకున్న గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుకపై రూ.7000 కోట్లు దోపిడీ

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తగ్గిన ధరలు : పెరిగిన టిజిఎండిసి ఆదాయం

దళారీ వ్యవస్థకు చెక్

రానున్న ఏడాదిలో రూ.1200 కోట్లు ఆర్జిస్తాం: టిజిఎండిసి చైర్మన్ అనిల్కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో ఇసుకపై కెసిఆర్ కుటుంబం రూ.7000 కోట్లు దోచేసిందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టిజిఎండిసి) చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఖైరతాబాద్లోని టిజిఎండిసి కార్యాలయంలో ఎండి, వైస్ చైర్మన్ బిఆర్వి సుశీల్కుమార్తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఖనిజాభివృద్ధి సంస్థ దివాలా తీసిందన్నారు. ఇసుకపై ప్రభుత్వానికి రావల్సిన సొమ్మును దళారులు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. 2023లో ఇసుకపై టిజిఎండిసికి రూ.673 కోట్లు ఆదాయం రాగ కాంగ్రెస్ ప్రభుత్వ హయం 2024లో 748 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. గతంలో రియల్ ఎస్టేట్ రంగం ఊపు మీద ఉన్న సమయంలో కంటే కుంటుకుంటూ నడుస్తున్న తమ ప్రభుత్వ హయాంలోనే టిజిఎండిసి రూ.80 కోట్ల ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. ఈ తేడాతోనే ఏ ప్రభుత్వం ఇసుకపై దోచుకుందో అర్థం అవుతుందన్నారు. గతంలో ఇసుక ధరలు సామాన్యులకు అందనంతగా టన్నుకు రూ.2300 వరకు ఉండేదని తమ ప్రభుత్వం ధరలను నియంత్రించి టన్నుకు సన్న ఇసుక రూ.1800, దొడ్డు ఇసుక రూ.1600కే ఇస్తుందని తెలిపారు. ధరలను తగ్గించినా ఆదాయం మాత్రం దళారుల పాలు కాకుండా టిజిఎండిసికి ఆధాయాన్ని సమకూర్చామన్నారు. దళారుల వ్యవస్థ లేకుండా ఇసుకపై ప్రభుత్వం స్పష్టమైన పాలసీ ద్వారా విక్రయించడమే ఇందుకు మూలంఅన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థపై సమీక్ష సమావేశం జరిగిందని, ఇసుక విషయంలో చోటు చేసుకుంటున్న అక్రమాలను నిరోధించడానికి అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని సిఎం ఆదేశించారని గుర్తు చేశారు. ఈ మేరకు ఇసుక పాలసీలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా పారదర్శకంగా ఉండే విధంగా వినియోగదారులకే నేరుగో ఇసుకను పంపిస్తున్నామన్నారు. దీంతో దళారీల వ్యవస్థకు చెక్ పడిందని అన్నారు. సుమారు 45000 ఇసుక లారీలకు జిపిఎస్ సిస్టం ఏర్పాటు చేశామన్నారు. ఇక హైదరాబాద్ శివార్లు ఆదిబట్ల, అబ్దుల్లాపూర్మెట్, బోరంపేట్, వట్టినాగులపల్లి ఇలా నాలుగు చోట్ల 'సాండ్బజార్'లను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారుల నుంచి మంచి స్పదన వస్తుందన్నారు. వినియోగదారులు టిజిఎండిసి వెబ్సైట్ నుంచే నేరుగా ఇసుకను ఆన్లైన్లోనే బుక్ చేసుకుంటే 25 ఇసుక రీచ్ల నుంచి నేరుగా ఇసుకను 48 గంటల్లో డోర్డెలివరీ చేస్తామని అనీల్కుమార్ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది టిజిఎండిసి ఆధాయం రూ.1200 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ దిశగా అధికారులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ ఇసుక తవ్వకాలతో పాటు వేబిల్స్ లేని వాహనాలను నియంత్రించే ఉద్దేశంతో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ సాండ్ బజార్స్కు శ్రీకారం చుట్టిందన్నారు. సాండ్ బజార్ల ద్వారా టిజిఎండిసి టన్నుకు రూ.1800కే ఇసుక సరఫరా చేయడం వలన బహిరంగ మార్కెట్లో కూడా ధరలు రూ.2400 నుంచి రూ.1700కు దిగివచ్చిందన్నారు.

## సికింద్రాబాద్-కాజీపేట మధ్య రైల్వే లైన్ల విస్తరణ

రూ.2,837 కోట్ల వ్యయంతో 3, 4 లైన్ల నిర్మాణానికి పూర్తయిన తుది సర్వే



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో రైలు మార్గాల నిర్మాణం చురుకుగా సాగుతున్నది. అందులో భాగంగా అత్యంత ముఖ్యమైన సికింద్రాబాద్ కాజీపేట రైల్వే మార్గంలో రద్దీ సమస్యకు పరిష్కారం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఈ మార్గంలో ఘట్కేసర్ నుంచి కాజీపేట వరకు 110.46 కి.మీ. దూరం రెండు రైల్వే లైన్లే ఉండగా మరో రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి తుది సర్వే పూర్తయింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను దక్షిణమధ్య రైల్వే ఇటీవల రైల్వేబోర్డుకు పంపింది. ఈ అదనపు లైన్ల నిర్మాణానికి రూ.2,837 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. రైల్వే బోర్డు ఆమోదం లభించిన అనంతరం పనులు మొదలవుతాయని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. అనుమతి మంజూరైన తేదీ నుంచి నాలుగేళ్లలో నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిపిఆర్లో పొందుపర్చారు. దక్షిణమధ్య రైల్వే జోన్ ప్రధాన కేంద్రమైన సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ, చండీగఢ్, వారణాసి, ప్రయాగ్రాజ్, లఖనవ్ సహా ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లాలంటే కాజీపేట మీదుగానే రాకపోకలు సాగించాలి. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, కోల్కతాలకు వెళ్లే రైళ్లకూ వయా కాజీపేటనే ప్రధాన మార్గం. దీంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్సు బండ్లతో ఈ మార్గం కిటకిటలాడుతోంది. సెక్షన్ ట్రాక్ కెపాసిటీ వినియోగం 100 శాతంలోపు మాత్రమే ఉండాల్సి ఉండగా ఇక్కడ 128 శాతంగా ఉంది. మూడు, నాలుగు లైన్ల నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారంతో పాటు రైళ్లు చకచకా పరుగులు తీసే అవకాశం ఉంటుందని రైల్వే అధికారులు అంటున్నారు. గూడ్సు బండ్లకు ప్రత్యేక మార్గం అందుబాటులోకి వస్తుంది. సికింద్రాబాద్ నుంచి ఘట్కేసర్ వరకు రైల్వే ట్రాక్ నాలుగు లైన్లలో ఉంది. ఘట్కేసర్రాయగిరి వరకు యాదాద్రి ఎంఎంటిఎస్ ప్రాజెక్టు కోసం మూడో లైను ఇప్పటికే మంజూరైంది. ఘట్కేసర్రాయగిరి వరకు నాలుగో లైను, రాయగిరి నుంచి కాజీపేట వరకు 3, 4 లైన్లు నిర్మించాలని డిపిఆర్లో ప్రతిపాదించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## 'మే డే' సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మే డే' సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్మిక లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తుందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని అన్నారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహద పడుతుందని సిఎం తన సందేశంలో పేర్కొన్నారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. 'మే డే' స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేసిందని, 'తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ సంక్షేమ బిల్లు 2025'ను త్వరలో తీసుకవస్తామన్నారు. ఉత్పత్తి, సేవారంగాలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను అందుకుంటూ విజయవంతంగా అమలవుతుందని చెప్పారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సిఎం పేర్కొన్నారు.

## కుల గణనపై కేంద్రం గ్రీన్సిగ్నల్... పలువురి హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా జనగణనలో భాగంగా కుల గణన చేపట్టాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవాడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు. మన దేశానికి దిక్సూచిగా నాడు బెంగాల్ ఉంటే... నేడు తెలంగాణే అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సామాజిక దృక్పథం కలిగిన తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకారం తెలిపిందని ఆమె అన్నారు. తెలిపారు. జనగణన మరియు కులగణన చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీసీ కమిషన్ స్వాగతించింది. దేశవ్యాప్తంగా జనగణన, దానితోపాటు కులగణన చేపట్టాలని ఈరోజు కేంద్ర కేబినేట్ ఆమోదించడం పట్ల తెలంగాణ బిసి కమిషన్ హర్షం వ్యక్తం చేసింది.తెలంగాణలో ఈ ప్రక్రియ పూర్తయినందున దేశవ్యాప్తంగా జనగణన, కులగణన జరిగే వరకు ఆగకుండా తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించి తెలంగాణలో అమలయ్యేవిధంగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ కోరారు. దేశంలో 90 శాతం ఉన్న పేద వర్గాలకు వనరుల్లో, సంపదలో వాటా దక్కాలన్న రాహుల్ గాంధీ గారి బలమైన డిమాండ్ తో.. కులగణన చేపట్టి, వారి జనాభాకు తగ్గట్టుగా వాటా పంచాలన్న ఆయన న్యాయమైన డిమాండ్ కు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే జనగణనలో కులగణను చేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మకమైన నిర్ణయం అన్నారు. దీంతో తాను సుప్రీంకోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. జాతీయ జనగణనలో సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్గౌడ్ స్వాగతించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఎప్రిల్ 2 న ఢిల్లీలో చేసిన బిసిలు ధర్నా చేయడం, ఇందులో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పాల్గొనడం తో కేంద్రం దిగి వచ్చిందన్నారు. తెలంగాణ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కులగణన చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం పై మరింత వత్తిడి పెరిగిందన్నారు. వచ్చే జనాభా లెక్కల్లో కుల గణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 75 కోట్లకు పైగా ఉన్న బిసి వర్గాల చిరకాల డిమాండ్ను కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. జనాభాలో కులగణన ద్వారా రాజకీయ, సామాజిక, విద్య, ఉద్యోగాల పరంగా ఒబిసిలకు మరిన్ని అవకాశాలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రెండు రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలి

**ప్రజాపక్షం / వనపర్తి :** వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి కలెక్టర్ చాంబర్ లో అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో దింపేందుకు ఇబ్బందులు ఉన్నాయంటూ రైతులు తమ దృష్టికి తీసుకువస్తున్నారా అని లారీల సమస్యను, గోదాముల వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయంలో రైతులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ,జిల్లా సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు సమ్మె కాలం వేతనం మంజూరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు (సిఆర్టి) సమ్మె కాలానికి (21రోజులు) సంబంధించిన వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే మరణించిన సిఆర్టిల అంత్యక్రియల కోసం రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్టు ప్రకటించింది. సిఆర్టిలు తమ సమస్యలను పరిష్కరించాలని 21 రోజుల పాటు సమ్మె నిర్వహించారు. ఈ క్రమంలో ప్రభుత్వం,సిఆర్టి ఉద్యోగ సంఘాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం హామీనిచ్చింది. ఇందులో భాగంగానే సమ్మె కాలానికి చెందిన వేతనం,అంత్యక్రియల ఖర్చులను ప్రభుత్వం ప్రకటించింది. కాగా ప్రభుత్వంతో జరిగిన చర్చలో భాగంగా ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నందుకు సిఎం రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, సిటిడబ్ల్యు కార్యదర్శి శరత్కు తెలంగాణ ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయ సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

## బేషరతుగా ఆపరేషన్ కగార్ ఆపాలి

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెంటనే సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ ను ఆపి, వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి యతీంద్రకుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నరమేధాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కగార్ హత్యాకాండలో మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీలు దాదాపు 400 మంది ఈ సంవత్సరమే చనిపోయారని యతీంద్రకుమార్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్బిజెపి నాయకత్వాన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశంలో వున్న చట్టాల నిబంధనలు, సాయుధ ఘర్షణలకు సంబంధించిన నియమాలు ఏమాత్రం పట్టించుకోకుండా, మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించే కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో నివశిస్తున్న ఆదివాసులను గురించి ఏమాత్రం పట్టించుకోకుండా, నిరంకుశంగా వారిని కూడా హతమారుస్తోందని అన్నారు. సాయుధ చర్యలు లేకుండా చేయటానికి సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ నిర్ణయానికి ప్రతిస్పందనగా ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణను ప్రకటించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు వెంటనే మొదలు పెట్టాలని, ఆపరేషన్ కగారు వెంటనే ఆపివేయాలి. సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసులను నిర్మూలించే హత్యాకాండను ఆపాలని డిమాండ్ చేశారు.

## అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు మే నెలంతా వేసవి సెలవులు

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు మే నెలంతా వేసవి సెలవులను కమిషనర్ క్రాంతి వెస్లీ ప్రకటించారని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, రాష్ట్ర కోశాధికారి ప్యారీజాన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కమిషనర్ ఎ.క్రాంతి వెస్లీతో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోయేషన్ (ఎఐటియుసి), ఇతర సంఘాలతో జరిపిన చర్చలలో వేసవి కారణంగా తల్లులకు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలకు రావటానికి కష్టతరంగా ఉందని, లబ్ధిదారులకు లబ్ధిదారులకు హోమ్ రేషన్ ఇచ్చి సెలవులు ప్రకటించాలని విజ్ఞప్తి చేసిన మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించి వేసవి సెలవులు మే నెలంతా ప్రకటించారి తెలిపారు. సెలవులు మంజూరు చేసిన రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు, కమిషనర్కు, అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు టీచర్కు, ఆయాకు లక్ష రూపాయలు చెల్లించాలని, రిటైర్ అయిన టీచర్లందరికీ వెంటనే రిటైర్మెంట్ బకాయిలు చెల్లించాలని, ప్రతినెలా సెంటర్ అద్దెలు, ఆరోగ్యలక్ష్మి బిల్లులు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని కోరగా వేసవి సెలవుల అనంతరం పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య పెంచాలని, ఇప్పటి వరకు ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు ప్రమోట్ చేయడానికి కృషి చేయాలని కమిషనర్ కోరారని వివరించారు.

## సింహాద్రి అప్పన్న ఆలయంలో అపశృతి

గోడకూలి ఏడుగురు భక్తుల మృతి

**విశాఖపట్నం :** విశాఖ జిల్లా సింహాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో మంగళవారం అర్ధరాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. పదిహేను మందికి తీవ్ర గాయాలయ్యాయి. మతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. సింహాచలంలో భారీ వర్షం కురిసింది. సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో రూ.300 టికెట్ క్యూలైన్పై సిమెంట్ గోడ కూలింది. ఇటీవలే అక్కడ గోడ నిర్మించారు. గోడ నాసిరకంగా నిర్మించడం వలనే కూలిపోయిందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షించారు. మతదేహాలను విశాఖ కేజీహెచ్కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. మతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్వేర్ దంపతులు పిల్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధారించారు. వీరంతా విశాఖపట్నంకు చెందినవారుగా గుర్తించారు. మతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటించింది.

**మతుల వివరాలు...**

తూర్పుగోదావరి జిల్లా మాచవరంనకు చెందిన పత్తి దుర్గాస్వామి నాయుడు (32), కుమ్మపట్ల మణికంఠ (28), విశాఖపట్నం జిల్లా అడవివరంనకు చెందిన ఎడ్ల వెంకటరావు (48), వెంకోజీ పాలెం హెబీకాలనీకి చెందిన గుజ్జరి మహాలక్ష్మి (65), ఉమానగర్కు చెందిన పైలా వెంకటరత్నం (45), మధురవాడ చంద్రంపాలెంకు చెందిన పిల్లా ఉమామహేశ్ (30), పిల్లా శైలజ (26) మృతి చెందారు.

**కేజీహెచ్ మార్చురీ వద్ద బంధువుల రోదన**

సింహాచలం అప్పన్న నిజరూప దర్శనం కోసం వెళ్లి అనంతలోకాలకు చేరుకోవడంతో ఆయా కుటుంబాల్లో అంతులేని విషాదం అలుముకుంది. బుధవారం ఉదయం మార్చురీ వద్ద మతుల బంధువుల రోదనల తో ఆ ప్రాంతమంతా మారుమోగిపోయింది. అధికారులు నిర్లక్ష్యానికి తమ కుటుంబీకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం... సామాన్య భక్తులకు సౌకర్యాలు కల్పించకుండా, పెద్దలు, వీఐపీల సేవలకే పరితపించేలా పనిచేశారని విమర్శించారు. దర్శనానికి వెళ్లొస్తా ... ఇల్లు జాగ్రత్త అని చెప్పి వెళ్లిన నా కుమారుడు మృతిచెందడం తీవ్రంగా కలచివేసిందని మణికంఠ తల్లి బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.

## పులిచింతల విద్యుత్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/చింతలపాలెం:** మండలలోని వజీనేపల్లి వద్ద ఉన్న పులిచింతల విద్యుత్ తయారీ కేంద్రాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సందర్శించారు. ఈ సందర్భంగా పులిచింతల పవర్ ప్లాంట్ ఎస్ఇ జెశ్యానాయక్ కలెక్టర్‌కి టార్బన్స్ ద్వారా విద్యుత్ తయారీ విధానం, విద్యుత్ సరఫరా విధానాన్ని వివరించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాసులు, ఎడి ఎస్ఎల్ఆర్ శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేదల కోసం సిపిఐ పోరాటం



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామ సిపిఐ గ్రామశాఖ మహాసభ రమావత్ దేవిలాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా పేదలకు రేషన్ కార్డులు అందరికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు ప్రతి పేదకు అందాలని, గ్రామాలలో ఎక్కడైనా పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ప్రతి పథకం వచ్చే విధంగా సిపిఐ ఎల్లవేళలా పోరాడుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ సిపిఐ మిత్రపక్షంతో అధికారం చేపట్టినప్పటికి పేదోళ్లకు అండగా నిలబడి ప్రతి ఒక్క హామీని అందే విధంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి వెంగళయ్య, శంకర్, వెంకటేష్, శివ, బలరాం పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో సిటీ టాలెంట్ విద్యార్థుల ప్రభంజనం

### జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్ర స్థాయిలో రెండ స్థానం కైవసం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పదవ తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఆర్ ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపల్ టి మురళీధర్‌లు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఎన్ సాయి సృజన 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి జిఇల్లా ప్రథమ స్థానంతో పాటు రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. బి ప్రణవి 588, జి శ్రీజ, 583, పి హర్షిత 581, వై ప్రజ్ఞారెడ్డి 579, ఎస్ సాయిఇగోకుల్ 577, వై శిశిర 577, ఎన్ సుదీపారెడ్డి 577, ఐ కశ్యప్ రామ్ 575, ఎం సాయిరిష్విక్ 573, జి నితీఈషావర్ధిని 571 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## నిరుపేదల ఆప్తురాలు పశ్య కన్నమ్మ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నిరుపేదల ఆప్తురాలు పశ్య కన్నమ్మ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్,జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో మృతి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు,సిపిఐ నాయకురాలు పశ్య కన్నమ్మ మృతదేహంపై సిపిఐ జెండాను కప్పి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లో మహిళా వైద్యురాలి కోసం,వితంతువుల పెన్షన్ కోసం మహిళల అర్థిక స్వాలంబన కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారన్నారు. పశ్య కన్నమ్మ మృతి సిపిఐ పార్టీకి,మహిళలకు తీరని లోటని తెలిపి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని,సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,మామిడి వెంకటేశ్వర్లు,దొంతగాని సత్యనారాయణ,మండవ వెంకటేశ్వర్లు, కృష్ణ,దొడ్డ వెంకటప్పయ్య,బొల్లు ప్రసాద్,జక్కుల రమేష్,యల్లావుల రమేష్,ఇందిరాల వెంకటేశ్వర్లు,రాజు,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వ్యవస్థ బలోపేతం లక్ష్యం



### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడమే భూభారతి లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరయ్యారు. వీరితో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చేతన్య రెడ్డి, ప్రభుత్వ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన నిర్వహించి భూభారతి చట్టం పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మందుల సామేల్‌కు నిరసన సెగ

### 'డౌన్ డౌన్' అంటూ కార్యకర్తల నినాదాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు బుధవారం నిరసన సెగ తగిలింది. ఆయన నియోజకవర్గంలోని అర్వపల్లి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వంటెద్దు పోకడలతో తాము రోజు రోజుకు విసిగిపోతున్నామని, కాంగ్రెస్ పార్టీని ఆది నుండి ఉంటున్న తమను గుర్తించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే వచ్చిరాగానే అర్వపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టారు. ఏళ్ళ తరబడి పార్టీని కంటికి రెప్పల కాపాడుకున్న తమను ఎమ్మెల్యే గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు ఎన్నికల ముందు వచ్చిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, తమను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సమావేశానికి హాజరైన పార్టీ పెద్దల ముందు ఆయనను నిలదీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కార్యకర్తలకు ఇవ్వడం లేదని తనతో పాటు పార్టీలో చేరిన బిఆర్ఎస్ వారికే ఇస్తున్నారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యేను కార్యకర్తలు, నాయకులు చుట్టుముట్టగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి జోక్యం చేసుకొని సమస్య సర్దుమణిగేలా చూశారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ తాను తన నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవులన్ని ఆదినుండి పార్టీలోకి సేవ చేసిన వారికే ఇచ్చానని, తనకు వర్గాలు అంటూ ఏమి లేవని చెప్పారు. పార్టీలో కొత్తగా చేరిన తనకు వర్గం, వర్గాలు ఏమి లేవని కాంగ్రెస్ ఒక్కటే తన వర్గమని స్పష్టం చేశారు.



# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:** అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్లగొండ మండలం, నకిరేకల్ మండలాలలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ నల్గొండ మండలం, చందనపల్లి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ పరిస్థితులను పరిశీలించారు.ఈ కేంద్రంలో అన్ని సౌకర్యాలు బాగానే ఉన్నప్పటికీ లారీలను పెంచాల్సిన అవసరం ఉందని అందువల్ల మరో రెండు వాహనాలను పెంచి త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా నాణ్యత ప్రమాణాలతో తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ,ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు.ఆర్జాల బావి ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ సందర్భంగా ఎక్కువ ధాన్యం కుప్పలు గుర్తించిన జిల్లా కలెక్టర్ త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు గాను మరో 5 వాహనాలను పెంచాలని, 10 రోజుల్లో దాన్యం కొనుగోలు మొత్తాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా అకాల వర్షాలు వస్తున్నదృష్ట్యా కొనుగోలులో ఇబ్బందులు ఏర్పడి రైతులు నష్టపోకుండా కొనుగోలును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.రైతులు ఎలాంటి తాలు లేకుండా మట్టి పెల్లలు, చెత్త లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తహసిల్దార్ హరిబాబు ,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

**ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్):** అకాల వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోలు వేగాన్ని పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నకిరేకల్ మండలం గోరికంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఆమె వెంట ఇంఛార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా సహాయ అధికారి పత్యానాయక్, స్థానిక అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ భూముల సమస్యలకు అసైన్మెంట్ కమిటీలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/చింతలపాలెం :** రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో పోవాల్సిన అవసరంలేదని, అధికారులే మీ గ్రామానికి వచ్చి మీ సమస్యలు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీ కస్తూరి వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో చాల సమస్యలు పరిష్కారం కాలేదని, రైతులు ఆందోళనలో ఉన్నారని తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధరణిపై కమిటివేసి 18 రాష్ట్రాలలో పరిశీలించి నిపుణులు, రిటైర్డ్ రెవిన్యూ అధికారులతో మేధావులతో సలహాలు, సూచనలు తీసుకుని ముసాయిదా పబ్లిక్ డోమైన్‌లో పెట్టి ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించి అద్భుతమైన భూభారతి చట్టం రూపొందించినట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ మామిడి తోరణాలతో పండుగ వాతావరణంలో భూభారతి సదస్సులు నిర్వహించడం చాల సంతోషంగా ఉందన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థ బలపర్చేందుకు జిల్లాలో 279 మంది గ్రామ పాలనాధికారులు రాబోతున్నారని సమస్యలు గ్రామస్థాయిలోన పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మేళ్లచెరువు మండలంలో 1620 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మండల స్పెషల్ అధికారి పద్మ, ఎంపీడీవో ఖాజా అజగర్ అలీ, మార్కెట్ కమిటి చైర్మన్ రాధిక దేశ్‌ముఖ్, పిఎసిఎస్ చైర్మన్లు శంభిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కోటిరెడ్డి, దేవాలయ కమిటి చైర్మన్ శంభిరెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బాధిత కుటుంబ సభ్యుల ధర్నా



### ఎంపి, ఎమ్మెల్యేల చొరవతో ధర్నా విరమణ

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు మండలంలోని కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్ ప్లోజీవ్ కంపెనీలో మంగళవారం ప్రమాదవశాత్తు అకస్మాత్తుగా బాంబు పేలడంతో కంపెనీలో పని చేస్తున్న కార్మికులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మార్గమధ్యంలో ఒక్కరు మృతి చెందారు. కాగా కంపెనీ పని చేస్తున్న మరో ఆరుగురు కార్మికులు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు, బాధితుల బంధువులు మోత్కూర్ రాయిగిరి ప్రదాన రహదారి పై కాటేపల్లి వద్ద ధర్నా కు దిగారు దీంతో యాదగిరి గుట్ట ఎసిపి రమేష్ కుమార్, మోటకొండూరు ఎస్ఐ ఉపేందర్ యాదవ్‌ల నేతృత్వంలో బందోబస్తు నిర్వహించి, వాహన దారులను దారి మళ్లించారు. కాగా భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు ప్రమాదం జరిగిన ప్రదేశాలను పరిశీలించి యాజమాన్యంతో చర్చలు జరిపి మృతి చెందిన కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇస్తూ అర్హతను బట్టి ఇంటికో ఉద్యోగం ఇచ్చేవిధంగా చర్చలు జరిపారు. గాయపడిన వారికి ప్రమాదం తీవ్రతను బట్టి యాజమాన్యం ఆదుకుంటుందని తెలిపారు. ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు ప్రమాద బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని బరోస కల్పించి ధర్నాను విరమింపజేశారు.



## భూభారతితో శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : గతంలో రైతులు ధరణి పోర్టల్ ద్వారా చాలా ఇబ్బందులు అనుభవించారని, భూభారతి చట్టంతో ప్రతి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి గంజ్ మార్కెట్ యార్డ్ నందు భూభారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలకు రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలు పరిశ్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆర్డీవో క్రిష్నా రెడ్డి, అడిషనల్ కలెక్టర్ వీరా రెడ్డి, ఎమ్మార్వో అంజిరెడ్డి, అధికారులు, నాయకులు, మహిళలు, రైతులు పాల్గోన్నారు.

## పార్టీ కోసం కష్టపడ్డ వారికే గుర్తింపు

### డాక్టర్ మురళీధర్ నాయక్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పార్టీ కోసం పదేళ్ళపాటు కష్టపడ్డ వారికే గుర్తింపు లభిస్తుందని పిసిసి పరిశీలకులు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీధర్ నాయక్, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌లు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఎఐసిసి ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సిద్ధాంతాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర కీలకమైందన్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణ త్యాగం చేశారన్నారు. గత సంవత్సర కాలంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యునతికి నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. బిఆర్ఎస్ సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడ్డ వారికే టికెట్లును అధిష్టానం ఇస్తుందన్నారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కార్పొరేషన్‌ల చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, హ్యాండ్ క్రాఫ్ట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, పిసిసి సభ్యులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగుతుందన్నారు. ఈ సమావేశంలో పిసిసి అధికార ప్రతినిధి జ్ఞానసుందర్, ఈబిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తండు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర నాయకులు చత్రురావు, చకిలం రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో యువతకు ఉపాధి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు అవకాశం కల్పించి ఉపాధి చూపాలని సిపిఐ అనుబంధ సంస్థ అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పెరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం యాదగిరిగుట్టలో బుధవారం లక్కీ ఫంక్షన్ హాల్ లో ఆ సంఘం మహాసభలు రెండవ రోజు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత డ్రగ్స్ మత్తులో పెడదారి పడుతుందన్నారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎమర్జెన్సీ సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. జిల్లాలో ఐటి కారిడార్ను ఏర్పాటు చేయడంతో పాటు యాదగిరిగుట్ట దేవాలయంలో స్థానికులకే ఉద్యోగాలు అవకాశాలు ఇవ్వాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు నియంత్రించాలన్నారు. ఈ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఎల్లంకి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొందూరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా పేరబోయిన మహేందర్, ఉపాధ్యక్షులుగా బత్తుల శ్రీనివాస్, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, ఎండి నయీుం, సహా య కార్యదర్శిగా అశోక్, బెల్లి శ్రీకాంత్, కోశాధికారిగా సుద్దాల సాయికుమార్ తోపాటు 31 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు

### మే 4 న 'నీట్ యుజి-2025 ప్రవేశ పరీక్ష'



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఈనెల 4 న నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ )అండర్ గ్రాద్యుయేషన్ 2025 ప్రవేశ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నీట్ యూజీ 2025 ప్రవేశ పరీక్ష నిర్వహణపై బుధవారం తన చాంబర్లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్నారు. నీట్ 2025 ప్రవేశ పరీక్ష ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, జిల్లాలో 2048 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్ష రాయనున్నారని, ఇందుకుగాను నల్గొండ జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 4 పరీక్ష కేంద్రాలు మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేయగా, ఎన్జీ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, కేంద్రీయ విద్యాలయాలలో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఇన్చార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ రాజకుమార్, అడిషనల్ ఎస్‌పి రమేష్, డీఎస్పి శివరామిరెడ్డి, నీట్ పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, ఈ సమావేశానికి హాజరయ్యారు.

## అంగన్‌వాడీలలో విద్యార్థుల సంఖ్య పెరగాలి




**ప్రజాపక్షం/యాదాద్రి :** కలెక్టర్ కార్యాలయంలోని బుధవారం మహిళాశిశు సంక్షేమ శాఖను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి కొండాపురం నర్సింహారావు ఆధ్వర్యంలో పదవి విరమణ చెందుతున్న ఐసిడిఎస్ ఉద్యోగులైన ఏసీడీపీఓ కె.రమ, సూపర్వైజర్ డి.ఊర్మిళలను కలెక్టర్ శాలువా కప్పి ఘనంగా సన్మానిస్తూ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిరుపేదల పిల్లల సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు రూపకల్పన చేసిందని, పరిపూర్ణ వంతమైన ఆరోగ్యాన్ని అందించాలనే దృఢమైన సంకల్పంతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నదని, సంక్షేమ ఫలితాలు రాబట్టేందుకు, సత్ఫలితాలను అందించేందుకు శాఖ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలు చిన్నారుల ఆటపాటలతో విద్యలో రాణించాలన్నారు.



## పది ఫలితాలలో జయ స్కూల్ విద్యార్థుల విజయకేతనం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఎస్ఎస్‌సి 2025 ఫలితాలలో జయస్కూల్ విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మా పాఠశాలలో 587 మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు, 580పైన మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులు, 570పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 52 మంది, 560 మార్కులకుపైగా 106 మంది విద్యార్థులు, 550కు పైగా మార్కులు 154 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. జయ స్కూల్ నుండి 580 మార్కులు సాధించిన జి.హసిని, కె.శ్రేష్ఠ, యం.అనన్య, యం.శ్రీదేవి,, కె.శరణ్య, లోకేష్ 585, సాయి చర్విత 584, చాణిక్య 583, హర్షవర్ధిని 583, రేవంత్‌రెడ్డి 580, మన్విత 580, ప్రగతి 580, వేద 580 మార్కులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బింగిజ్యోతి, జెల్లా పద్మ లు పాల్గొన్నారు.

## నారాయణస్కూల్ విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పదో తరగతి ఫలితాల్లో నారయణ ఒలంపియాడ్ హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చినట్లు నారాయణ హై స్కూల్ ఎజీఎం రమేష్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని 65 ఫీట్ రోడ్డులోని నారాయణ హై స్కూల్ బుధవారం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. టి.అక్షయ్ 580 మార్కులు, రిషిత 580 మార్కులు, అశ్రిత 579 మార్కులు, ఐదుగురు విద్యార్థులు 570 మార్కులు, ఆరుగురు విద్యార్థులు 560 కి పైగా మార్కులు, 14 మంది విద్యార్థులు 550కి పైగా , 21 మంది విద్యార్థులు 530 మార్కులు, 500కు పైగా 56 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్ పుష్పలత, శ్వేత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభారతి విద్యార్థుల హవా



**ప్రజాపక్షం/సూర్యాపే ట-టౌన్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యాభారతి హై స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నంద్యాల నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వెలువడిన ఫలితాలలో మా పాఠశాలలో వంశీక శ్రీహరణి580 మార్కులు, మణికర్ణిక 568 మార్కులు సాధించగా, 500మార్కులకు పైగా ఏడుగురు విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# షో కేస్

# కళా రంగం

## అనుభూతులకు 'ఫ్రిడా' దృశ్యరూపం








మనసులో మెదిరే ఎన్నో అనుభూతులకు దృశ్యరూపాన్ని అందించిన ఫ్రిడా కాలో (1907–1954) జీవితం ఒడిదుడుకుల మధ్య సాగింది. అయితే, సమస్యలేవీ ఆమె ప్రతిభను మరుగుపరచలేకపోయాయి. ఆమె చిత్రకళ, రచనా సామర్థ్యాలను అడ్డుకోలేకపోయాయి. మెక్సికో రాజధాని మెక్సికో సిటీలో జన్మించిన ఫ్రిడా తల్లి మత్స్య కుటుంబానికి చెందినది. తండ్రి జర్మనీకి చెందిన ఫొటోగ్రాఫర్. బాల్యంలోనే ఫ్రిడా కాలుకు పోలియో సోకింది. అవిటతనంతో బాధపడుతున్న ఆమెను 18వ ఏట మరో దురదృష్టం వెంటాడింది. భయంకరమైన బస్సు ప్రమాదానికి గురికావడంతో, ఆమె వెన్నెముక, కాళ్లు, మడమలు, పెల్విస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎముకలు విరిగిపోయాయి. జీవితకాలం నొప్పులు తప్పలేదు. దీనికి తోడు అనేక శస్త్రచికిత్సలు జరపడంతో ఆమె జీవితం దుర్భరమైంది. ప్రమాదం తరువాత, మంచంపై పడుకొని ఉన్నప్పుడు, ఫ్రిడా చిత్రలేఖనాన్ని ప్రారంభించింది. ఆమె 1929లో ప్రముఖ మెక్సికన్ మురలిస్టు డియెగో రివేరాను పెళ్లి చేసుకుంది. వారి సంబంధం సజావుగాసాగలేదు. ఎన్నో ఘర్షణలు చివరికి విడాకులకు దారితీసింది. కాగా, ఫ్రిడా ప్రధానంగా స్వీయ చిత్రాలు వేసేది. వీటిని నేటికాలపు సెల్ఫీలతో పోల్చవచ్చు. 'నేను నేనే' అనే భావనతో ఆమె చిత్రాలు గీసింది. మెక్సికన్ ప్రజా కళ (ఫోక్ ఆర్ట్) ప్రాచీన మయన్, అజ్టెక్ సంస్కృతులు పునరుత్థాన కళ సూర్రియలిజం ఆమె చిత్రాల ప్రత్యేకతలు. వ్యక్తిగత బాధ, శారీరక నొప్పి, భావోద్వేగ దుఃఖాన్ని ప్రతిబింబించడం ఆమె శైలి. మెక్సికన్ సంస్కృతికి పొడగింపుగా. జంతువులు, పువ్వులు, కదిలే జీవులు వంటి ఎన్నో చిత్రాలు ఆమె కుంచె నుంచి జాలువారాయి. ఆమె అంతరంగ భావాలకు ప్రతీకలుగా, శరీరం ఆత్మ మధ్య సంబంధంపై లోతైన దృష్టిని ప్రదర్శిస్తాయి. 'ది టూ ఫ్రిడాస్' ఇందులో ఆమె తనలోని రెండు కోణాలను వివరించింది. ఒకటి మెక్సికన్ ప్రాధాన్యత కలిగినదికాగా, రెండవది ఆధునిక యూరోపియన్ దృక్పథంతో కూడుకున్నది. తన జీవితంలో, ప్రత్యేకించి ప్రేమలో విఫలమైన వైనాన్ని ఆమె 'సెల్ఫ్ పోర్ట్రయిట్ విత్ థోర్న్ నెక్లెస్ అండ్ హమ్మింగ్ బర్డ్'లో అద్భుతంగా ఆవిష్కరించింది. మానసిక బాధను, జీవితంలో ఎదురైన కష్టాలను ప్రతీకల రూపంలో చూపిస్తుంది. 'ది బ్రోకెన్ కాలమ్' ఆమె వెన్నెముక విరగడాన్ని, శరీర నొప్పిని ఉదంతంగా వ్యక్తీకరించిన చిత్రకలం. అదే విధంగా 'హెన్రీ ఫోర్డ్ హాస్పిటల్' ఆమె గర్భస్రావ అనుభవాన్ని బహిరంగ పరుస్తుంది. ఆత్మవేదనకు అద్దం పట్టింది. ఫ్రిడా కళలో మహిళా అనుభవాలను నిజమైన, ముద్దుగా చూపించింది. ప్రేమ, శరీర నొప్పి, గర్భస్రావం వంటి 'నిజమైన' మహిళా జీవిత అనుభవాలకు కళలో స్థానం ఇచ్చింది. ఆమె దుస్తులు, రంగులు, ప్రతీకలు ద్వారా మెక్సికన్ సంప్రదాయాలను ప్రాచుర్యం చేసింది. కళను పూర్తిగా వ్యక్తిగత అనుభవం మలిచింది, తన బాధను ప్రదర్శించడాన్ని అపహాస్యం కాకుండా గౌరవప్రదం చేసింది. ఫ్రిడా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక 'నారీశక్తి'గా గుర్తింపు సంపాదించింది.

రంగస్థలం లేదా స్టేజీ అనేది ఎన్నో రూపాల్లో ఉంటుంది. కథ, పాత్రల తత్వం, సాంకేతిక పరిమితులు, ప్రేక్షకులతో అనుసంధానం వంటి అంశాల ఆధారంగా రంగస్థల రూపం మారుతుంది. ఈ విధంగా, రంగస్థలాలకు వివిధ రకాల వైవిధ్యాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

## రంగస్థల పరిభాష తెలుసుకుందాం..

రంగస్థలం లేదా స్టేజ్ అనేది నాటక ప్రదర్శన జరిగే వేదిక. నాటకాలను ప్రదర్శించే క్రమంలో పలు పదాలు వినపడుతూ ఉంటాయి. వీటిలో కొన్ని అందరికీ తెలిసినవైతే, మరికొన్ని చాలా కొద్ది మందికి తెలిసి ఉండే పదాలు. ఇలాంటి పదాల్లో ప్రోసినియం ఆర్చ్ (Proscenium Arch) అనేది ఒకటి. వేదిక ముందుభాగంలో ఉండే నిర్మాణం. ఇది తెరకి తలపాగా మాదిరిగా ఉంటుంది. నాటకం ప్రారంభంలో, ముగింపు సమయాల్లోనేగాక, ఒక అంకానికి మరో అంకానికి మధ్య కూడా తెర ఉపయోగపడుతుంది. కాలక్రమేణ 'తెరతీయడం' అనే పదాన్ని 'వివరించడం' లేదా 'ప్రారంభించడం' అనే అర్థాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రంగస్థలాన్ని ప్రేక్షకుల నుండి తాత్కాలికంగా కప్పేదే పరదా. కథానుగుణంగా, వాతావరణాన్ని సృష్టించే పెయింటింగ్‌గల తెరను బ్యాక్‌డ్రాప్ (Backdrop) అంటారు. ఉదాహరణకు చారిత్రక నాటకాన్ని ప్రదర్శించే సమయంలో కోట లేదా రాజమందిరం లేదా రాజదర్బారు లేదా యుద్ధ భూమికి సంబంధించిన పెయింటింగ్స్‌ను లేదా సెట్టింగ్స్‌ను ఉంచి, దాని ముందు ప్రదర్శనను కొనసాగిస్తారు. ఫలితంగా ప్రేక్షకులు ఆయా కాలాలకు సంబంధించిన దృశ్యాలను ఊహించుకుంటారు. కాగా, ప్రదర్శనలో నటీనటులు ఉపయోగించే వస్తువులను (ఉదా: పుస్తకం, కత్తి, లాంతరు) ప్రాప్ (Prop) అంటారు. నాటకం దృశ్య ప్రాధాన్యమైనది కాబట్టి, స్టేజీపై సమయానుకూలంగా లైటింగ్‌ను మారుస్తారు. దీనినే లైటింగ్ డిజైన్ (Lighting Design)గా పేర్కొంటారు. రంగస్థలాన్ని తగిన వెలుతురులో చూపించడానికి, నాటకానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడానికి ఇది అత్యంత కీలకమైన ప్రక్రియ. ఒక నాటకాన్ని ప్రదర్శించాలంటే, కేవలం కథ ఉంటే సరిపోదు. కథనం, అందుకు తగిన మాటలు అత్యవసరం. సన్నివేశాన్ని రక్తి కట్టించాలంటే, నటీనటుల వాచకం, హావభావాల తోపాటు, మాటల్లో పదును కూడా అవసరం. కేవలం డైలాగుల వల్ల పేరుప్రఖ్యాతులు ఆర్జించిన నాటకాలు, సినిమాలు ఎన్నో ఉన్నాయి. నాటకానికి రచిత రూపాన్ని స్క్రిప్ట్ (Script) అంతటారు. ఇందులో డైలాగులు, సన్నివేశాలు ఉంటాయి. డైలాగులు చెప్పే సమయంలో లేదా, ఇతరులు డైలాగులు చెప్తున్నప్పుడు తగిన హావభావాలను ప్రదర్శిస్తూ నటీనటులు స్టేజీపై ఎక్కడ, ఎంత మేరకు, ఎలా కదలాలి అనే పద్ధతిని బ్లాకింగ్ (Blocking) అంటారు. నటులు వేదికపైకి ప్రవేశించడాన్ని ఎంట్రీ అంటారు. వదిలి వెళ్లడాన్ని ఎగ్జిట్ అంటారు. నాటకంలో ఈ రెండు ఘట్టాలూ కీలక పాత్ర పోషిస్తాయి. రెండు అంకాలుగా నాటకాన్ని విభజించినప్పుడు, నటీనటులకు, అదే విధంగా ప్రేక్షకులకు కొంత విరామం ఇస్తారు. అదే (Interval). పాటలు, సంగీతం మొదలయ్యే సందర్భాలను సూచించే సూచనల సంగ్రహాన్ని మ్యూజికల్ క్యూస్ (Musical Cues)గా పేర్కొంటారు. నటుడి దృష్టికోణం నుండి వేదిక ఎడమ వైపు లేదా కుడివైపును స్టేజ్ లెఫ్ట్ / స్టేజ్ రైట్ (Stage Left / Stage Right) అంటారు. నాటక ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించేవారు ఆడియన్స్ (Audience). నటీనటులు తమతమ పాత్రల స్వభావాన్ని ప్రతిబింబే విధంగా దుస్తులు వేసుకుంటారు. వారి వేషధారణను బట్టి, నాటక పూర్వాపరాలను ఊహించుకోవచ్చు. ఈ దుస్తులనే కాస్ట్యూమ్స్ (Costumes) అంటారు. నటీనటులు ప్రదర్శనకు ముందు ఒకటికి రెండు సార్లు స్క్రిప్ట్‌ను చదువుతారు. నాటక ప్రదర్శనకు ముందు స్క్రిప్ట్ రీడింగ్ (Script Reading) అత్యవసరం. అదే విధంగా స్టేజీని, ప్రేక్షకులను ఊహించుకొని, నాటకాన్ని ప్రదర్శించి, లోటుపాట్లను సవరించడాన్ని రిహార్సెస్ అంటారు.



## రూపాలు పలురకాలు..




**1. ప్రోసినియం రంగస్థలం:** ఇది సాంప్రదాయిక రంగస్థలం. ఈ వేదిక ముందు భాగాన తెర ఉంటుంది. ప్రేక్షకులు ఒక వైపు కూర్చొని, రంగస్థలాన్ని నేరుగా చూస్తారు. ఇది సినిమాహాళ్ల వలె అనిపిస్తుంది. ఈ విధంగా ఏర్పాటయ్యే వేదికలు కథను అందంగా చూపించటానికి సహాయపడతాయి. ప్రోసినియం స్టేజ్‌కి ఉదాహరణగా హైదరాబాద్‌లోని 'శిల్పకళా వేదిక' వంటి ప్రదేశాలను పేర్కొనవచ్చు.



**2. థ్రస్ట్ రంగస్థలం:** ఈ వేదిక ప్రేక్షకుల మధ్యకు ముందుకు వచ్చి ఉంటుంది. మూడు వైపులా ప్రేక్షకులు కూర్చుంటారు. దీని వల్ల ప్రేక్షకులు పాత్రలకు మరింత దగ్గరగా ఉంటారు. ప్రేక్షకులతో సన్నిహిత అనుభూతిని కలిగించే ఈ వేదికలో నటనను అన్ని వైపులా ప్రతిబింబించాల్సి ఉంటుంది.

**3. ఎరేనా రంగస్థలం:** ఈ వేదిక చుట్టూ నాలుగు వైపులా ప్రేక్షకులు కూర్చుంటారు. దీనిని "థియేటర్ ఇన్ ది రౌండ్" అని కూడా అంటారు. ఇక్కడ నటులు అన్ని దిశలవైపు నటించాలి. ఇది అత్యంత సవాలుతో కూడుకున్న విధానం అయినప్పటికీ, ప్రేక్షకులకు జీవితాన్ని తాకే అనుభూతిని కలిగిస్తుంది.

**4. బ్లాక్ బాక్స్ రంగస్థలం:** ఇది చిన్నతరహా వేదిక. ఇది పూర్తిగా నలుపు రంగులో ఉంటుంది. ఇందులో వేదికను, సీట్లను అవసరానికి అనుగుణంగా మార్చవచ్చు. ప్రయోగాత్మక నాటకాలకు అనుకూలంగా ఉంటుంది. ఇది చిన్న వర్గ ప్రేక్షకులకు మధురమైన అనుభూతిని కలిగించగలదు.



**5. బహిరంగ రంగస్థలం:** ఇది ఓపెన్ ఎయిర్ రంగస్థలంగా కూడా పిలుస్తారు. ప్రకృతిలోనే వేదిక ఏర్పరచబడుతుంది. ఉదాహరణకు: పార్కులు, మైదానాలు. ఇది చాలా పురాతన పద్ధతి. గ్రీకు థియేటర్‌లు ఇదే తరహాలో ఉండేవి. ప్రకృతి సహజంగా ఉండటం వలన, వాతావరణం కూడా ప్రదర్శనలో భాగమవుతుంది.

**6. సైట్–స్పెసిఫిక్ రంగస్థలం:** ఈ తరహా రంగస్థలంలో కథకు అనుగుణంగా ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడే ప్రదర్శిస్తారు. ఉదాహరణకు – కోటలో జరిగే కథను అదే కోటలో ప్రదర్శించడం. ఇది ప్రేక్షకులకు కథలో మరింత నిమగ్నతను కలిగిస్తుంది. ప్రతి ప్రదర్శన ఓ ప్రత్యేక అనుభవంగా మారుతుంది.

మొత్తం మీద, రంగస్థల వైవిధ్యాలు నాటకరంగాన్ని మరింత సమృద్ధిగా మారుస్తాయి. ఒక్కో రంగస్థలానికి ప్రత్యేకతలు, సవాళ్లు ఉంటాయి. కథను ఏ విధంగా చెప్పాలనుకుంటున్నామో దాని ఆధారంగా వేదికను ఎంపిక చేస్తే, ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించవచ్చు.

## అద్భుత నాటకాలు..

ప్రపంచ వ్యాప్తంగా, అన్ని దేశాల్లో.. అన్ని భాషల్లో ఎన్నో గొప్ప నాటకాలు ఉన్నాయి. తెలుగులోనూ వేల సంఖ్యలో ఉంటాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

**1. 'అంతఃపురం' – రచయిత:** దత్తు శ్రీరామ్
కుటుంబ బంధాలు, ఒంటరితనం, దంపతుల మధ్య సంభాషణలపై మానసికంగా లోతుగా తీసిన నాటకం. నగర జీవితం వల్ల వ్యక్తిగత సంబంధాలపై వచ్చే ప్రభావాన్ని చూపిస్తుంది.

**2. 'నీటిమడుగు' – రచయిత:** మహేష్ ధనమాజీ
గ్రామీణ వ్యక్తి ఒక ఆధునిక నగర జీవితంలో ఎదుర్కొనే అంతర్గత సంఘర్షణలపై ఆధారిత కథ. ఆధునికతకు దూరంగా ఉండే మనుషుల మనోభావాలను ప్రతిబింబిస్తుంది.



**3. 'సైలెన్స్ ప్లీజ్' – రచయిత్రి:** పద్మజ
మానసిక ఆరోగ్యం, ఒత్తిడి, ఉద్యోగ జీవితం వల్ల మహిళ ఎదుర్కొనే సమస్యలపై సున్నితంగా చూపిన నాటకం. డైలాగుల కన్నా నిశ్శబ్దం కీలక పాత్ర పోషిస్తుంది.

**4. మరో మౌనం' – రచయిత:** రత్నకర్ రావు
వివాహేతర సంబంధాల నేపథ్యంతో వ్యక్తిగత బాధలు, లోపలి బాధ్యతలపై లోతైన అవగాహనతో తీర్చిదిద్దిన నాటకం. ఆధునిక సంబంధాల క్లిష్టతను పరిశీలిస్తుంది.

**5. ఎవరు నన్ను విన్నారు?'** – సమకాలీన యువ రచయితల ప్రదర్శన సామాజిక మాధ్యమాల ప్రభావం, ఒంటరితనం, నకిలీ అనుబంధాల మధ్య ఒక యువతి అనుభవించే వాస్తవాలను చూపుతుంది. ఈ నాటకాలు ముఖ్యంగా యువతను, మధ్యతరగతి జీవనశైలిని, నిత్యజీవితంలోని మౌనతలను ప్రతిబింబిస్తాయి. చాలావరకు ఇవి బహుళ పాత్రలతో కాకుండా, సోలో లేదా మినిమలిస్టిక్ సెట్టింగ్‌లో ప్రదర్శిస్తాయి.

---

## క్యాంప్ కార్యాలయం వేదిక ద్వారా సమస్యల పరిష్కారం

క్యాంప్ కార్యాలయం ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి



**ప్రజాపక్షం/మునుగోడు:** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వేదిక ద్వారా ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడు మండల కేంద్రంలో అదనపు గదుల నిర్మాణంతో పాటు ఆధునీకరించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి తో కలిసి గృహప్రవేశం చేశారు. అధికారిక క్యాంపు కార్యాలయంలో ని యోజకవర్గ ప్రజల సమస్యలు చర్చించడానికి, అధికారులతో సమీక్ష స మావేశాలు నిర్వహించడానికి మీటింగ్ హాల్, వ్యక్తిగత సిబ్బందికి అదన పు గదుల నిర్మాణం, క్యాంపు కార్యాలయ ఆవరణలో సిసి పనుల నిర్మాణంతో పాటు శాసనసభ్యులు నివసించడానికి వీలుగా భవనాలను ఆధునికరించారు. ఆధునికరించిన అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవాని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ కుం భం శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస నే తలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.ఈ కార్యాలయం మునుగోడు ప్రజల ఇల్లు అని, ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయని, అధికారం శాశ్వతం కాదని, మనం కూడా శాశ్వతం కాదని, కానీ ఆధునీకరించబడిన ఈ క్యాంపు కార్యాలయం శాశ్వతంగా ఉంటుందని పేర్కొన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బడుగు బలహీన వర్గాల సంక్షేమం అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కొరకు చర్చించడానికి ఇది ఒక వేదికగా మా రుతుందన్నారు.ఈ కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటీ నారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, నాయకులు నారబోయిన రవిముదిరాజ్, చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, గుత్తా ఉమా ప్రేమచందర్ రెడ్డి, దోటీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు...

## కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్‌యూనియన్స్ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఎం.సాగర్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బొమ్మగాని రవీందర్ రెడ్డి సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 సంవత్సరాల కాలంలో ఎంతో పోరాడి ప్రాణ త్యాగాలు చేసి కార్మిక హక్కులను సాధించుకుంటే ఈ పది సంవత్సరాల కాలంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక హక్కులను చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌గా కొత్త చట్టాలను తీసుకొచ్చి యాజమాన్లకు పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రెజరర్ సంపత్ , ఆడిట్ సెక్షన్ ప్రెసిడెంట్ లింగారెడ్డి, కాటన్ సెక్షన్ ప్రెసిడెంట్ చిరుతలపల్లి వీరారావు, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, యాకోబు తదితరులు పాల్గొన్నారు.



## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో.. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

కాజీపేట రైల్వే డివిజన్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/ కాజీపేట :** స్థానిక నిరుద్యోగ యువతకు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో ఉపాధి కల్పించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాజీపేట మండల సిపిఐ మహాసభ మడికొండలో బుధవారం నాయకులు మాలోతు శంకర్, రాసమల్ల దీనా అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మహాసభను ఉద్దేశించి ప్రసంగిస్తూ రైల్వే కోచ్ ఫ్యాక్టరీతో పాటు కాజీపేట రైల్వే డివిజన్ అభివృద్ధి కోసం సిపిఐ పోరాడిందని, స్థానిక నిరుద్యోగ యువతకు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే డివిజన్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఉత్తర,దక్షిణ భారతానికి మధ్య వారధిగా ఉన్న కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రజలకు ఇబ్బందికరంగా పరిణమించిన రాంపూర్ గ్రామంలోని డంపింగ్ యార్డును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డుతో గాలి కలుషితమవుతోందని, దుర్వాసనతో జీవనం సాగిస్తున్న ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. రోజు రోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటినా వాటిని నియంత్రించడంలో మోదీ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, రూపాయి విలువ పతనంతో పతనమైన భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. నిత్యావసరాల ధరల పెంపు ను అరికట్టకుండా బ్లాక్ మార్కెటింగ్ దారులకు వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. హిందువులు, ముస్లింల పేరుతో ప్రజలను విడగొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకుని వచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను సిబిఐ, ఇడి వంటి రాజ్యాంగ సంస్థల దుర్వినియో గం చేస్తున్నదని, మాట వినని ప్రతిపక్ష పార్టీ నాయకుల పై వాటిని ఉసిగొల్పుతున్నారని అన్నారు. ఈ మహాసభ లో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ , అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల యెల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి,నాయకులు వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్,ఏదునూరి వెంకటరాజం, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.




## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా అఖిలపక్ష నాయకుల డిమాండ్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** మధ్య భారతాన అటవీ ప్రాంతలలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపి ఆదివాసి జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని అఖిలపక్షం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతి ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. చత్తీస్‌ఘడ్ తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల అటవీ ప్రాంతాలలో గత వారం రోజులుగా యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నదన్నారు. ఈ సరిహద్దు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసి, గిరిజనులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారని, ఇప్పటికీ హెలికాప్టర్స్, డ్రోన్‌ల ద్వారా దాదాపు 20 వేల మంది సాయుధ పోలీస్ బలగాలు అక్కడ తిష్ట వేయగా, ప్రతిరోజు ఎన్‌కౌంటర్స్ జరుగుతున్నాయన్నారు. గత రాత్రి నుండి పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో 40 మందికి పైగా మావోయిస్టులు, ఆదివాసీలు హతమైనట్లు ప్రసార, ప్రచార మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్రెగుట్టపై ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న రెండు బేస్ క్యాంపుల నుండి ఇటు తెలంగాణ, అటు చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లోని అడవి ప్రాంతాల్లో ముఖ్యంగా ఆదివాసులను వందలాదిగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అమాయకులైన వీరిని కాల్చి చంపి మావోయిస్టులుగా చిత్రించే ప్రమాదం ఉందన్నారు. కర్రెగుట్ట ప్రాంతం నుండి అన్ని రకాల సాయుధ పోలీస్ బలగాలని వెంటనే ఉపసంహరించాలని, అరెస్టు చేసిన ఆదివాసి గిరిజనులని వదిలిపెట్టాలని, ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని, బేస్ క్యాంపులో ఎత్తివేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్, సిపిఐఎంఎల్ నాయకులు సోమిశెట్టి దశరథం, టిజెఎస్ బొజ్జ కనకయ్య, సకినాల అమర్, అంకని భాను,రాగుల రాములు, చెట్కూరి ఆంజనేయులు గౌడ్, గొట్టె రవి వర్మ, పంతం రవి, పోకల సాయికుమార్, విజయ్, మంత్రి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల జీవించే స్వేచ్ఛను కాపాడాలి : అనిల్ కుమార్

**ప్రజాపక్షం/ఇల్లంతకుంట :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బలగాలు మావోయిస్టులపై అత్యాకాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గడ్ చుట్టుపక్కల ప్రాంతంల్లో బలగాలను మోహరించి మావోయిస్టు పార్టీని అంతం చేయాలని కేంద్రం ప్రకటించిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చివరి మావోయిస్టు చంపే దాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం ప్రజాస్వామికమని ఆయన అన్నారు. సాయుధలైన మావోయిస్టులకు ,పోలీ స్ బలగాలకు మధ్య జరుగుతున్న యుద్ధంలా అది లేదని, బలగాలు అడవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసి వారిని అడువుల నుంచి వెళ్లగొట్టేలా ఉందన్నారు. అక్కడ మానవ, ఆదివాసి, గిరిజన హక్కులను హరణ జరుగుతున్నదని, ఛత్తీస్ గడ్ అటవీ ప్రాంతంలోని విలువైన స్వదేశీ ఖనిజ సంపాదను, విదేశీ కార్పొరేటర్లకు కట్టబెట్టే కుట్ర దాని వెనుక ఉన్నదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య యుతంగా వ్యవహరించాలని ఇప్పటికే శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు స్పందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## ఇంటి స్థలాలు ఇవ్వకపోతే పోరాటాలు ఉధృతం



సిపిఐ భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** నిరుపేదలకు ఇంటి నివేషణ స్థలాలు ఇవ్వకపోతే పోరాటాలను ఉధృతం చేస్తాం అని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి మండల, పట్టణ సమితిల ఆధ్వర్యంలో నిరుపేదలకు నివేషణ స్థలాలు ఇందిరమ్మ ఇల్లు అర్హులైన వాళ్లందరికీ ఇవ్వాలని గత సంవత్సరం నుండి ప్రభుత్వాలకు విన్నవించినప్పటికీని స్పందన లేదని భువనగిరి తాసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రసంగిస్తూ భువనగిరి పట్టణానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములు హన్మాపురం బొమ్మాయిపల్లి ప్రభుత్వ భూములు వెంటనే నివేషణ స్థలాలకు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుపేదలు ఉదయం 9 గంటలకు ముట్టడి కార్యక్రమంలో పాల్గొని లోపలికి ఎవ్వరినీ వెళ్ళనీయకుండా గేటు వేసి దిగ్బంధనం చేశారు. సుమారు మూడు గంటలు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న సందర్భంగా నిర్బంధాన్ని ఉపసంహరించాలని పోలీసులు ఒత్తిడి చేశారు. సంబంధిత తాసీల్దారు వారు వచ్చేంత వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పోలీసులకు తెలియజేశారు. తదుపరి తహాసీల్దార్ వచ్చి స్థలాలు లేనటువంటి నిరుపేదలందరికీ హన్మాపురం భువనగిరి పట్టణానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములు రిజర్వ్ చేశామని నివేశన స్థలాలు ఇవ్వడానికి కలెక్టర్‌కి ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నివేషణ స్థలాలు త్వరలో ఇప్పిస్తామని చెప్పిన హామీ నిలబెట్టుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం భూములు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్థలాలు అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు అన్నింటిని కాపాడాలని భూ ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అశోక్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయం నుండి తాహాసీల్దార్ కార్యాలయం వరకు ఎర్రజెండాలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్తూపుల అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## హైదరాబాద్‌లో 146 మంది సిఐల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని విభాగాలను పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ప్రక్షాళన చేశారు. ఈ మేరకు ఆయా విభాగాలకు చెందిన 146 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సివి ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల విభాగంలో స్టేషన్ హౌజ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురిని ట్రాఫిక్ విభాగానికి, ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న కొంత మందిని శాంతి భద్రతల ఠాణాలకు బదిలీ చేశారు. అలాగే ట్రాఫిక్‌లో పనిచేసిన మరికొంత మందికి ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. సిసిఎస్, ఎస్‌బి ,ట్రాఫిక్,టాస్క్ ఫోర్స్,ఐటిసెల్, మహిళా విభాగాలకు పలువురిని బదిలీ చేశారు. ఇక సస్పెన్షన్‌లో ఉన్న ముగ్గురు సిఐలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరిలో గిరి ధర్మిరెడ్డికి ఎస్‌బికి, మధులత కొక్కును జువెనైల్ బ్యూరో యూనిట్‌కు, బి.దుర్గారావును మెయిన్ పిసిఆర్‌కు బదిలీ చేశారు.

## ప్రమాదానికి గురైన గుడిసెలను పరిశీలించిన ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రావి నారాయణరెడ్డి కాలనీ పేస్ 3 లో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన గుడిసెలను బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంత్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయామని బాధితులు ఆర్‌డిఒ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. అగ్ని ప్రమాదంలో 400 గుడిసెలు కాలిపోయాయని, ప్రమాద వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర హరిసింగ్ నాయక్, బిఒసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, సిపిఐ నాయకులు పొన్నాల యాదగిరి,సైదులు ముదిరాజ్, వట్టి నవనీత, కాటి అరుణ, సుజాత, వినోద్ నాయక్, వీరేష్ పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ బాధితులకు అండ

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఫుట్‌పాత్‌లపై డబ్బాలు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్న బాధితులకు గత ప్రభుత్వంలో జిహెచ్‌ఎంసి నుండి లైసెన్స్‌లు మంజూరు చేయడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బాలను తొలగిస్తామని చెప్పడం దారుణమని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న డబ్బాల నిర్వహకులకు నోటీసులు జారీ చేసి జిహెచ్‌ఎంసి అధికారులు తొలగించడానికి ప్రయత్నించారు. బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, డబ్బాల నిర్వాహకులు ఎంఎల్‌ఎకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి బాధితులకు అండగా నిలిచారు. బాధితులు ఎలాంటి అందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక డబ్బా కూడా తొలగించకుండా చూస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. దీంతో జిహెచ్‌ఎంసి అధికారులు డబ్బాల తొలగింపును వెనుక్క తీసుకున్నారు. కార్యక్రమంలో మధు గౌడ్, బాధితులు తదితరులు ఉన్నారు.

## సిఎం సహాయనిధితో ఆర్థిక చేయూత

మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సిఎం సహాయనిధి నిరుపేదల వైద్యానికి ఆర్థిక చేయూతనందిస్తుందని టిపిసిసి ప్రచార క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ తెలిపారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్‌బి నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీని సంప్రదించగా.. స్పందించిన ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సదరు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మొత్తం 8లక్షల 77వేల రూపాయలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుడ్డ సత్యనారాయణ, పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, నాయకులు నోముల రవీందర్ గౌడ్, విజయ భాస్కర్‌రెడ్డి, జాల వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్, సుభాస్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి అధిక నిధులు

కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** డివిజన్ అభివృద్ధికి అధిక నిధులు తీసుకొచ్చి, ప్రతి సమస్యను పరిష్కారం దిశగా కృషి చేస్తామని జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని ఇంద్రపస్త కాలనీ ఫేస్1లో ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసిన ఓపెన్ జిమ్ పనులను కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వేదరి యోగేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగభూషణం, రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా అక్షయ తృతీయ సంబరాలు



**ప్రజాపక్షం/షాబాద్ :** బుధవారం షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడలో అక్షయ తృతీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు రైతులు ఉత్సావంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్వాధాయ పరివార్ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మీక చింతర అలవర్చుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో స్వాధాయ పరివార్ ద్వారా ప్రతి ఇంట్లో , గ్రామంలో అందరూ ఐక్యమత్యంగా ఉండేవిధంగా స్వాధాయ కృషి చేస్తుందన్నారు.

# పరివర్తన శక్తివంతమైన సాధనం

ఖైదీలకు అందుబాటులో పదో తరగతి విద్య

జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్యామిశ్ర




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరివర్తనకు అత్యంత శక్తివంతమైన సాధనం అని జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్యామిశ్ర పేర్కొన్నారు. ఖైదీలను పదవ తరగతి పరీక్షలకు హాజరు కావడానికి నమోదు చేసుకునే కార్యక్రమాన్ని బుధవారం సౌమ్యామిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ రీఫార్మేషన్, రీహ్యాబిలిటేషన్, రీఇంటిగ్రేషన్ ఈ మూడు 'ఆర్'లతో ఖైదీల జీవితాలను మార్చాలని మేము కృషి చేస్తున్నాం. చదువే మార్పుకు శక్తివంతమైన ఆయుధం, అని స్పష్టం చేశారు. నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఒపెన్ స్కూలింగ్ (ఎన్ఐఒఎస్)సహకారంలో రాష్ట్రంలోని అన్ని జైళ్లలో పదో తరగతి చదివే ఖైదీల వివరాలను సేకరించారు. 2024–25 విద్యా సంవత్సరానికి మొత్తం 108 మంది ఖైదీలు ఐదు జైళ్లలో తమ పేర్లను నమోదు చేయించుకున్నారని సౌమ్యామిశ్ర తెలిపారు. చర్లపల్లి జైలులో 73 మంది, నిజామాబాద్‌లో 20, కరీంనగర్‌లో 5, హైదరాబాద్ మహిళా జైలులో 8 మంది, మహబూబ్‌నగర్ జైలులో ఇద్దరు ఖైదీలు పదో తరగతిలో చేర్చుకున్నారు. వీరు నేర్చుకునే పాఠ్యాంశంలో ఐదు సబ్జెక్టులు ఉంటాయని తెలిపారు. సోషల్ సైన్స్213, ఎకనామిక్స్214, బిజినెస్ స్టడీస్215, ఇంగ్లీష్ 202, రెండవ భాష (తెలుగు, ఉర్దూ లేదా హిందీ). ఈ కోర్సులు మూడు భాషా మాధ్యమాలలో అందిస్తారన్నారు. తెలుగు, ఇంగ్లీష్ , ఉర్దూ. పరీక్షలు అక్టోబర్ 2025లో జరుగుతాయని, ఫలితాలు జనవరి 2026లో వెలువడిన తరువాత సర్టిఫికెట్లు ఫిబ్రవరి 2026లో ఇస్తారని సౌమ్యామిశ్ర తెలిపారు. కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఖైదీలు తమ భావోద్వేగాలను పంచుకున్నారు. తెలంగాణ, ఎపి ఎన్ఐఒఎస్ డైరెక్టర్ పరంప్రీత్‌సింగ్ మాట్లాడుతూ తెలంగాణ జైళ్ల శాఖ ముందుచూపుతో అడుగులు వేస్తోందన్నారు. విద్య ద్వారానే పునరావాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఒఎస్ సభ్యులు అభిషేక్ ప్రతాప్ సింగ్, ఎస్.ఎన్. రాజు, ఐజిలు వై.రాజేష్, ఎన్.మురళీబాబు, డిఐజి ఎం.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 'హోమియో ఫెస్ట్' అభినందనీయం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హోమియో వైద్య విద్యార్థులు క్లినికల్ సామర్థ్యంతో పాటు సృజనాత్మక శక్తి అలవరచుకొనేలా హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్‌ఎంఎటి) హోమియో ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమని కాళోజీ హెల్త్ వర్సిటీ విసి డా.పివి నందకుమార్‌రెడ్డి, సిబిఐ మాజీ జెడి వివి లక్ష్మీనారాయణ అన్నారు. హోమియో వైద్య పితామహుడు డా.శామ్యూల్ హనిమన్ 270వ జయంతి సందర్భంగా హెచ్‌ఎంఎటి హైదరాబాద్ ఆధ్వర్యాన బుధవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో 'హోమియో ఫెస్ట్ 2కె25' కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ హోమియో వైద్యులు డా.శివశంకర్ కూనపరెడ్డిని హెచ్‌ఎంఎటి అధ్యక్షులు డా.కె.గోపాలకృష్ణ, ప్రధానకార్యదర్శి డా.జి.దుర్గాప్రసాద్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎటి ఉపాధ్యక్షులు డా.కె.ఎస్.గుప్త, డా.ఆనందరావు, కోశాధికారి డా.వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.




## కులగణనకు కేంద్ర ఆమోదం హర్షణీయం : ఆళ్ల రామకృష్ణ



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపడుతామని కేంద్ర క్యాబినెట్ ఆమోదించడం హర్షణీయమని జాతీయ ఒబిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, ఢిల్లీలో 22 రోజుల దీక్ష చేపట్టిన బత్తుల సిద్దేశ్వర్ పోరాటం ఫలితంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొన్నదని ఆయన పేర్కొన్నారు. ఇందుకు వారితో పాటు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కేంద్రం కులగణన ప్రకటించడం గొప్ప పరిణామమన్నారు. ఆలిండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్ సహకారంతో కులగణన చేపట్టాలని లక్ష పోస్టుల కార్డుల ఉద్యమం కొనసాగించానని ఆళ్ల గుర్తుచేశారు.

# సత్వరమే భూసేకరణ ప్రక్రియ పూర్తి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆరాంఘర్ ఫ్లైఓవర్ అప్ డౌన్ ర్యాంప్‌ల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఆరాంఘర్ నుండి జూపార్క్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్, శాస్త్రి పురం ఆర్.ఓ.బి పనులను ఆయనబుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్.ఓ.బి రైల్వే పోర్షన్ పెండింగ్ లో ఉందని ప్రాజెక్టు ఈ ఈ శ్రీనివాస్ కమిషనర్ కు వివరించారు. రైల్వే పోర్షన్ ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని, రైల్వే పోర్షన్ పూర్తయిన తర్వాత్త పూర్తి పని ఎన్ని రోజుల్లో పూర్తవుతుందనిప్రాజెక్ట్ అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైల్వే పోర్షన్ పనులు పూర్తయిన తర్వాత 30 నుండి 45 రోజుల్లో ప్రాజెక్ట్ మొత్తం పనులు పూర్తవుతుందని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించారు. రైల్వే సిఇతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులనుకమిషనర్ ఆదేశించారు. అంతకుముందు కమిషనర్ ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో చార్మినార్



ను పర్యాటకులు సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, ప్రాజెక్టు ఈ ఈ బిఎల్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారం కోసమే భూభారతి

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కొందుర్గు:** భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ మండలాల్లోని రైతు వేదికల్లో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశాలకు జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటి చైర్మెన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఉన్న ధరణి స్థానంలో కొత్త గా భూమి హక్కుల రికార్డు భూ భారతిని చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఇస్తూ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ విధానం భూ భారతి చట్టంలో తీసుకురావడం జరిగిందని, మోస పూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయశాఖ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం అధికారులకు ఉందని, భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్ర వివరాలతో భూధార్‌ను తీసుకురాబోతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పిల్ వ్యవస్థ, రైతులకు న్యాయ బద్ధమైన మార్గం కల్పిస్తుందని, ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకొని, తమ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. భూ భారతి చట్టంతో ప్రతి రైతుకు సంబంధించిని భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో సరిత, షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ ఎ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, పిఏసిఎస్ చైర్మెన్ చిట్టెం దామోదర్ రెడ్డి, తహసీల్దార్లు రమేష్ కుమార్, జగదీశ్వర్, రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, కావలి యాదయ్య, బి నరేందర్, కె రాములు గౌడ్, రోహిత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, జిబి కృష్ణ, ఎస్ మల్లయ్య, బి రవి, గోవర్ధన్‌గౌడ్, మల్లేష్ గౌడ్, ఆర్.రామస్వామి, సి కృష్ణయ్య, రఘు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## అట్టడుగువర్గాల అభ్యున్నతికి బసవేశ్వర కృషి

**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి :** మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సమాజం అభివృద్ధి, అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు మహాత్మా బసవేశ్వరుడు అని డిఆర్‌ఇ సంగీత అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా బసవేశ్వర జయంతిని వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ సంగీత, బిసి వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, ఎఒ సునిల్ కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ సంగీత మాట్లాడుతూ మూఢనమ్మకాలపై నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడు అన్నారు. ప్రప్రథమ సంఘసంస్కర్త, సమతవాది అని అన్నారు. అణగారిన వారి వర్గాల పట్ల ఆశావాది నిరంతర మార్గదర్శకుడని, బసవేశ్వరుడి స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.




# యాచారంలో మెరిసిన ఆణిముత్యాలు

ప్రభుత్వ పాఠశాలల్లో 88 శాతం ఉత్తీర్ణత...



**ప్రజాపక్షం/యాచారం :** బుధవారం ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మండలంలో 88 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ఉన్న రెసిడెన్షియల్, ప్రైవేటు పాఠశాలలను కలుపుకుంటే 91 శాతం ఉత్తీర్ణత సాధించామని మండల విద్యాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. యాచారం మండలంలో 12 ప్రభుత్వ పాఠశాలల్లో 497 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 435 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గున్‌గల్ మోడల్ పాఠశాలలో చదువుకుంటున్న చెరుకూరి నిఖిత పదవ తరగతిలో 600 మార్కులకుగాను 547 మార్కులు సాధించి మండల టాఫర్ గా నిలిచారు. మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కసిరెడ్డి ఉషశ్రీ 536 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. నల్లవెల్లి ప్రభుత్వ పాఠశాలకు చేందిన మనిషా 524 మార్కులు సాధింధి తృతీయ స్థానంలో నిలిచింది. మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం చిన్నతూండ్ల 100 , నల్లవెల్లి 95 , చితపట్ల లో 93 , గున్‌గల్ 92, గున్‌గల్ మోడల్ పాఠశాల 92, కెజిబివి యాచారం 92, మేడిపల్లి నక్కర్త ఉన్నత పాఠశాల 89 శాతం, కోత్తపల్లి, 88,కుర్మిద్ద 88 , నందివనపర్తి 87, మాల్ 82, యాచారం 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా పాఠశాల ల ఉపాధ్యాయుల, ఎంఇఒలు అభినందించారు.

## పది ఫలితాల్లో భాష్యం విజయకేతనం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో వనస్థలిపురం డివిజన్‌లోని భాష్యం స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పదవ తరగతిలో 600 మార్కులకు గాను అభిజ్ఞ కుంభం 590 మార్కులతో రాష్ట్ర మొదటి స్థాయిలో నిలిచారు. 20 మంది విద్యార్థులు 580 కిపైగా మార్కులు సాధించగా, 49 మంది విద్యార్థుల 570కి పైగా, 94 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారు. మొత్తంగా 99.9 శాతంతో విజయకేతనం ఎగురవేశారు. నునుపెన్నడు లేని విధంగా అత్యధిక మార్కులతో ప్రభంజనం సృష్టించారు. అత్యధికంగా హైదరాబాదులో 524 సగటు మార్కులతో ప్రథమంగా నిలిచారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులందరికి భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో సిఇఒ చైతన్య, జడ్ఇఒ అంకమరావు, ప్రిన్సిపాల్ కె.సుజాత, చాంప్స్ ప్రిన్సిపాల్ హేమ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం విడుదల చేసిన ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సత్తా సాధించి మండలంలోనే 92.98% ఉత్తీర్ణత సాధించారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన మార్చి 2025 వార్షిక పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల సమీపంలో ఉన్నా జిల్లా పరిషత్తు, సాంఘీక సంక్షేమ గురుకుల, జ్యోతిరావు పూలే బిసి గురుకుల, మైనార్టీ గురుకుల, కస్తూరభ ఆశ్రమ పాఠశాలలతో పాటు వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించి ప్రయివేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన ఆయా పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## 'పది' ఫలితాల్లో 'నాగార్జున' విద్యాసంస్థల ప్రభంజనం

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాగార్జున విద్యాసంస్థల విద్యార్థులు రికార్డు స్థాయిలో ఫలితాలను సాధించి మరోసారి తమ పాఠశాల సత్తాచాటారని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు విద్యార్థులు 587 మార్కులు సాధించగా, 13 మంది విద్యార్థులు 540పైగా మార్కులతో 90శాతం మార్కులు సాధించారన్నారు. మార్కుల విధానమైనా, గ్రేడుల విధానమైన తమ పాఠశాలల్లో ప్రతి ఏడాది అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం వనస్థలిపురంలో జరిగిన కార్యక్రమంలో 560కు పైగా మార్కులు సాధించిన 79 మంది విద్యార్థులకు పుష్పగుచ్చాలు బహుకరించి వారిని అభినందించారు. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ జి.రజిని విఠల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, సిఇఒ ఏ.శేషారావు, పాఠశాల ప్రిన్సిపాల్‌లు విజయ కుమార్, మహేష్, రవీందర్ రెడ్డి, మురళి, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## జెవివి శిక్షణా శిబిరంలో ఫన్ సైన్స్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం శ్రీ చక్రీ విద్యా నికేతన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి సైన్స్ శిక్షణ శిబిరం ఏడవ రోజు ఫన్ సైన్స్ అంశంపై బోధకుడు శివకుమార్ విద్యార్థులకు వివిధ ప్రయోగాల ద్వారా శాస్త్రీయ పాఠాల పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు నూతన అనుభవాలను అందిస్తూ ఫన్ సైన్స్ శిక్షణ కార్యక్రమం విశేష ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు





**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మేడ్చల్ జిల్లా మూసాపేటలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జె.సౌమ్య (2521 112966)600 మార్కులకు గాను 579 మార్కులు, సిహెచ్ త్రివేణి (252111 2932) 572 మార్కులు, వి.హారిక (2521113010) 560 మార్కులు సాధించి ప్రతిభ కనపరచారు. .

## చర్లపల్లి టర్మినల్‌లో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో ఆర్‌పిఎఫ్ అధికారులు భద్రతా తనిఖీలు నిర్వహించారు. బుధవారం చర్లపల్లి టర్మినల్ లో ఆర్‌పిఎఫ్ సిఐ ఆర్‌కె మీనా, ఎస్ఐ అనిల్‌కుమార్‌లు బిడిడిఎస్,జిఆర్‌పి సిబ్బందితో కలసి అధిక హెచ్చరిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి వెయిటింగ్ హాలు,ప్లాట్‌ఫారాలు, పార్శిల్ ఆఫీస్,రైళ్లలో,కీలక ప్రదేశాలలో పేలుడు పదార్థాల కోసం డాగ్ స్క్వాడ్‌తో భద్రతా తనిఖీలు చేశారు. తనిఖీ సమయంలో ఎటువంటి వస్తువులు కనుగొనబడలేదని వారు తెలిపారు.



## రైల్వే టర్మినల్‌కు కనీస వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి రోడ్లు విస్తరణలు చేపట్టాలని ఉప్పల్ మాజీ ఎంఎల్‌ఎ, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం చర్లపల్లి రైల్వే టర్మినల్ ముందు బిజెపి ఆధ్వర్యంలో ప్రభాకర్‌తో నాయకులు,కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, కేంద్ర ప్రభుత్వం 450 కోట్లతో చర్లపల్లి టర్మినల్‌ను నిర్మించి ప్రధాని మోదీచే వర్చువల్‌గా నాలుగు నెలల క్రితం ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణీకులకు కనీస వసుతులు కల్పించక పోవడం సిగ్గు చేటని, కనీస వసతులు లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 15 రోజులలో ప్రజలకు కావలసిన వసతులు కల్పించకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని అష్ట దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నర్సింగ్, డి నాధం,లక్ష్మణ్‌గౌడ్, చల్లా ప్రభాకర్, డి బాలచందర్, తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్య తరగతి తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నయని మేడ్చల్ నియోజకవర్గం ఇంఛార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ఒక కార్యక్రమంలో హాజరైన తోటకూర వజేష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షులు ముల్లి పావనిజంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్‌ల చేతులమీదుగా బండారు రామకృష్ణ 27,500,అశ్ర బేగం 60వేల రూపాయల సిఎంఆర్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షులు కోరుబోతు నాగరాజు ముదిరాజ్, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి,మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మండల గిరిదార్వర్ అన్వేష్ బదిలీ

**ప్రజాపక్షం/దుండిగల్ :** గండిమైసమ్మ మండల గిరిదార్వర్ సిహెచ్.అన్వేష్ కుమార్ బదిలీ అయ్యారు. గత కొంతకాలంగా గండిమైసమ్మ దుండిగల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న సిహెచ్ అన్వేష్ కుమార్ మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో మూడుచింతలపల్లి లో గిరిదార్వర్‌గా విధులు నిర్వహిస్తున్న రజినీకాంత్‌ను గండిమైసమ్మదుండిగల్ మండలాన్ని బదిలీ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఈ నెల 29న ఉత్తర్వులు జారీ చేశారు.



## క్రికెట్ క్రీడా పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వనపర్తి :** పెద్దమందడి మండలం మనిగిళ్ల గ్రామంలో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను బుధవారం ఎమ్మెల్యే తూడి ఏమఘూరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ క్రీడా పోటీలలో గెలుపు, ఓటములు సహజమని యువకులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మణిగిల్ల మాజీ సర్పంచ్ సరితా తిరుపతిరెడ్డి, వెంకటయ్య, వెంకటేష్ , నర్సింహారెడ్డి, క్రీడాకారులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షా ఫలితాల్లో

# మేడ్చల్ జిల్లా 92.59%తో ఉత్తీర్ణత

* బాలికలదేపై చేయి
* జూన్ 3 నుండి సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మేడ్చల్ జిల్లాలోని 896 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 92.59 శాతం ఫలితాలతో రాష్ట్రంలో 28వ స్థానం దక్కించుకొంది. పరీక్షకు హాజరైన 47, 235 మంది విద్యార్థుల్లో 42,870 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో బాలుర కంటె బాలికలే అధిక శాతంగా ఉత్తీర్ణత సాధించారు. హాజరైన 22,748 మంది బాలికల్లో 21,062 మంది 92.59 శాతంతో, 24,487 మంది బాలురులో 21,808 మంది 89.06 శాతంతో ఉత్తీర్ణులయ్యారని జిల్లా విద్యా శాఖాధికారిణి విజయ కుమారి తెలిపారు.

**జూన్ 3 నుండి సప్లిమెంటరీ**

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుండి 13వ తేదీ వరకు జరగనున్నాయని డిఈఓ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకుఈ పరీక్షలు జరుగుతాయని, దీనికి ఫీజు చెల్లించేందుకు గడువు తేదీ మే 16 అని తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15 వరకు అవకాశం ఉందని, రీ కౌటింగ్ కోసం ఒక్కో సబ్జక్టుకు గాను రూ.500 చొప్పున, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జక్టుకు గాను రూ. 1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్షల్లో ఫెయిలయిన వారెవరూ అధైర్య పడవద్దని, జూన్‌లో జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించవచ్చని, దీని వల్ల విద్యా సంవత్సరం నష్ట పోవటం జరుగదని, ఫెయిలయిన విద్యార్థులు మరింత పట్టుదలతో చదివి ఉత్తీర్ణులు కావాలని డిఈఓ సూచించారు.

## మరోమారు మానవత్వం చాటిన డాక్టర్ సంపత్‌కుమార్

**161వసారి రక్తదానంతో రికార్డు**



**ప్రజాపక్షం/తాండూరు:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ మారుమారు మానవత్వం చాటారు. 161వ సారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నారు. ప్రసవం కోసం కోడంగల్ మండల పరిధి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ భార్య అబింక గర్భిణిని తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తీసుక వచ్చారు. రక్తం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న గర్భిణి బాధలను జిల్లా ఆసుపత్రి సిబ్బంది ద్వారా తెలుసుకున్న బాలాజీ ఆసుపత్రి అధినేత, బివిజి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్‌కుమార్ స్పందించి మరోమారు రక్తదానం చేసిన మానవత్వం చాటుకున్నారు. ఏకంగా 161వ సారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నారు. అంబిక ప్రసవంకోసం రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన డాక్టర్ సంపత్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు అభినందించారు.



### పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు

# త్వరగా పెన్షన్ల మంజూరు

అధికారులకు పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సూచన

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు శాఖాపరంగా రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా మంజూరు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సంబంధిత అధికారులకు సూచించారు. కమిషనరేట్‌లో పదవీ విరమణ చేసిన అంబర్‌పేట రిజర్వ్ ఇనస్పెక్టర్ ఎండి గౌస్, స్పెషల్ బ్రాంచి ఎస్సై సాదిక్ అలీ, వాలంటరీ పదవీ విరమణ పొందుతున్న ఉప్పల్ ఎస్సై మనోహర్‌రావు, ఎల్‌బినగర్ ఎస్సై జంగయ్య, కుషాయిగూడ ఏఎస్సై ఖాజా జహీరుద్దీన్‌లను కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ జీవితంలో మరచిపోలేనిదని, తమ విధులను అనేక సవాళ్లను ఎదుర్కొంటూ సమర్థవంతంగా నిర్వహించటం గుర్తుండి పోతాయన్నారు. విశ్రాంత జీవితాన్ని ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనపరుస్తూ మరింత క్రమశిక్షణతో గడపాలన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం తాను ఏర్పాటు చేసిన పెన్షన్ డెస్క్ ద్వారా పెన్షన్ త్వరగా అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి ఇందిర, అడ్మిన్ అడిషనల్ డిసిపి శివకుమార్, స్పెషల్ బ్రాంచి ఎసిపి రవీందర్‌రెడ్డి, అకౌంట్స్ విభాగ సిఎఒ సుగుణ, అడ్మిన్ విభాగ సిఎఒ పుష్పరాజ్, పోలీసు అధికారులు సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ప్రతీక్ జైన్ ఆదేశాలు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ సంబంధిత అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 128 వరి కొనుగోలు కేంద్రాల్లో వరి కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు కావలసిన తడిపత్రిలు, సంచులు, తేమ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను సూచంచారు. కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వర్తించని వారిని తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైస్ మిల్లర్ల వద్ద బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్లు రాజుయువ వికాసం లబ్ధిదాలరుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి లోపభూయిష్టం లేకుండా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డిఆర్‌డిఓ శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజస్,వ్యవసాయ శాఖ ఎడిఎ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

సమాజం అభివృద్ధికి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు బసవేశ్వరుడు అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మహాత్మా బసవేశ్వర 892వ జయంతిని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మూఢనమ్మకాల పైన నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడు అన్నారు. బసవేశ్వరుని యొక్క మార్గాన్ని ముందుకు సాగాలని సమాజ అభివృద్ధికి పాటు పడాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లింగ్యానాయక్, డిబిసిడబుఒ ఉపేందర్, కమలాకర్‌రెడ్డి డిఆర్‌డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తే, జీవితంలో ఎంతో సంతృప్తి**

పదవీ విరరమణ పొందుతున్న షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, యువజన క్రీడల అధికారి హనుమంతు, యాలాల్ తహసీల్దార్ అంజయ్యలకు జిల్లా యంత్రాంగం తరపున పదవీ విరమణ ఆత్మీయ సన్మానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవచేసే అదృష్టం ప్రతి ఒక్కరికి రాదని ఆ అదృష్టం ప్రభుత్వ ఉద్యోగులకు రావడం అదృష్టమన్నారు. ఉద్యోగ బాధ్యత లో భాగంగా మన సర్వీసులో నిబద్ధతతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందడం పదవీ విరమణ సమయంలో ఎంతో తృప్తిని కలిగిస్తుందని కలెక్టర్ అన్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపాలని అదేవిధంగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆసక్తి ఉన్న కార్యక్రమాలతో ముందుకు సాగాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్ ట్రైనింగ్ కలెక్టర్ హర్ష చౌదరి, డిఆర్‌డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ పంపును ప్రారంభించిన వజ్రేష్ యాదవ్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నూతన ఇండియన్ పెట్రోల్ పంపును కొండాపూర్ గ్రామంలో కోటి యాభై లక్షల సబ్సిడీతో ప్రారంభించిన మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , మేడ్చల్ బిబ్లాక్ నియోజకవర్గం అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్‌లు దేవి ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ రోజులలో చూస్తుంటే ప్రతి ఇంట్లో నాలుగు కార్లు, బైకులు ప్రతి ఒక్కరికి ఉంటున్నాయి. అందుకు పెట్రోల్ అనేది చాలా అవసరం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అదుకోవాలనే ఆలోచనలతో కొండాపూర్ గ్రామంలో ప్రజలకు అందుబాటులో పెంట్రోల్ పంపును లంబాడ శంకర్ నాయక్ ఏర్పాటు చేసినందుకు అతనిని అభినందిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కోటాలో చాలా మందికి పెట్రోల్ పంపులు కేటాయించడం వలన నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాయని అన్నా రు. పెట్రోల్ పంపు నిర్వాహకులు లంబాడ శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు మా పంపులో ఎలాంటి కల్తీ లేకుండా ప్రజలకు నాణ్యమైన పెట్రోల్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, బంకు యజమాని కల్పన, లంబాడ శంకర్ నాయక్, భరత్ కుమా ర్, కంపెనీ సేల్స్ ఆఫిసర్ ఉపేందర్, ఉపాధ్యక్షులు కోరుబోతు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పౌరులు తమ హక్కులను పొందాలి...

అవగాహన సదస్సులో ఎమ్మార్వో జయరాం, ఎస్సై అరుణ్ కుమార్



**ప్రజాపక్షం/నవాబుపేట్:** సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని నవాబుపేట్ ఎమ్మార్వో జయరాం అన్నారు. మండలంలోని కడిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి నెలలో 30 తారీకు సివిల్స్ రైట్స్ డే నిర్వహించడం జరుగుతుందని, ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మార్వో జయరాం, ఎస్సై కె.అరుణ్ కుమార్ సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. ప్రతి నెలాఖరులో గ్రామాల్లో సివిల్స్ రైట్స్‌డే కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జయరాం, ఎస్సై అరుణ్ కుమార్, ఎంపీఓ విజయ్ కుమార్, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శి అరుంధతి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప సంఘసంస్కర్త బస వేశ్వరుడు

ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన దార్శనికుడు, గొప్ప సంఘసంస్కర్త మహాత్మా శ్రీ బసవేశ్వరుడుని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి కొనియాడారు. శ్రీ బసవేశ్వర జయంతిని పురష్కరించుకుని బుదవారం తాండూరు పట్టణంలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూమాలలు సమార్చించిన ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్బంగా ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జగజ్యోతి శ్రీ బసవేశ్వరుడని ఆయన సమాజ స్థాపనకు కృషి చేశారని అన్నారు. ఆయన అగుడుజాడలలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ధారాసింగ్, చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, లింగదళి రవికుమార్, మాదవి, పట్టణ నాయకులు పాల్గోన్నారు.

**బిసి సంఘం ఆధ్వర్యాన....** జగజ్యోతి శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను తాండూరులో బీసి సంఘం ఆద్వర్యాన ఘంగా నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి బీసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజుకుమార్ పూలమాలలు సమర్పించిన ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బిసి మహిళ సంఘం నాయకురాలు, కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## పదిలో 'నవీన ఆదర్శ'విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం /కొడంగల్ :** పదవ తరగతి పరీక్షలో నవీన ఆదర్శ విద్యార్థులు ప్రభంజనం సృష్టించడంతో కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచాలు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకుంటు సంబరాలు చేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో రవీంద్రభారతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పదవ తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలలో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు మహీన్ ఫాతిమా 557 స్కూల్ టాఫర్‌గా నిలువడంతో విద్యార్థిని అభినందించారు. సాయిశ్రీ 547, వైష్ణవి 520, బిందు 518, బిలాల్ 56, అక్షత 503, శరత్ 492, శివశంకర్ 490 విద్యార్థులు టాఫర్‌లుగా రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సంబరాలు నిర్వహించారు. గత 28 సంవత్సరాలుగా అలుపెరుగని ర్యాంకులు సాధిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన నవీన ఆదర్శ పాఠశాలపై విద్యార్థుల తల్లీదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అతి తక్కువ ఫీజులు , నాణ్యమైన విద్యబోధనలు అందించడం ఎంతో అభినందనీయమని నవీన ఆదర్శ పాఠశాల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ లక్ష్మి వెంకటయ్యముదిరాజ్, ప్రిన్సిపల్ నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోషలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లీదండ్రులు తదితరులు పాల్గోన్నారు.






## వ్యాపారాలు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలి

కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/ వికారాబాద్ప్రతినిధి :** వ్యాపారాలు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ సూచించారు. నూతన ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ,పిఎసిఎస్ ,కంప్యూటరైజేషన్ .నతూన పెట్రోల్ పంపులు ,ఎల్పిజి ,మత్య సంఘల ,డైయిరీ ఫాంలు ,గోదాములు ,ఎర్పాటు తదితర అంశాలపై జిల్లా సహకార అధికారుల ,వివిధ బ్యాంకుల అధికారులతో అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు వివిధ రంగాల్లో పోత్సహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా అదనంగా ప్రాథమిక వ్యవసాయ సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన ఇవ్వడం జరుగుతుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కొత్త పెట్రోల్ పంపులు ఇప్పటికే ఉన్న పెట్రోల్ పంపుల మార్పిడి పై దృష్టి సారించాలని అయన తెలిపారు. కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగర్జున , నాబార్డ్ డిడిఎం అఖిల్ పున్న , సుబ్రమణ్యం జిల్లా సెంట్రల్ బ్యాంక్ సిఈఓ, వ్యవసాయఅధికారి పద్మావతి, , జిల్లా పశుసంవర్దక శాఖ అధికారి సదానందం తదితరులు పాల్గోన్నారు.

# 'మాయదారి' రోగం.. పరీక్షలకు దూరం

**రాష్ట్ర వ్యాప్తంగా 15వందల మంది 'పాలిటెక్నిక్'కు దూరం**

**హాజరు శాతం తక్కువగా ఉండడంతో అనుమతి నిరాకరణ**

**జూన్‌లో రీ అడ్మీషన్‌కు ఛాన్స్..**


**తీవ్ర నిరాశలో విద్యార్థులు**

**మరోసారి ప్రత్యేక పరీక్షకు అవకాశం కల్పించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొందరికి అనారోగ్యం, మరి కొందరికి కుటుంబం ఇలా పలు రకాల సమస్యలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. ఇలాంటి కారణాల నేపథ్యంలో హాజరుశాతం లేకపోవడంతో విద్యార్థులు 'పాలిటెక్నిక్ వార్షిక పరీక్ష'ను రాయలేకపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 వందల నుంచి 15 వందల వరకు 'పాలిటెక్నిక్' పరీక్షకు దూరంగా ఉన్నారు. విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు ఉండాలని, వివిధ అనారోగ్య సమస్యలు వస్తే పది శాతం హాజరును మినహాయిస్తారని, తద్వారా 65 శాతం తరగతులకు హాజరుకావాల్సి ఉంటుందని సాంతికేత విద్యా శాఖాధికారులు చెబుతున్నారు. ఈ నిబంధనలకు లోబడే విద్యార్థులకు పరీక్షలకు అనుమతినిస్తారు. హాజరుశాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అనుమతిని నిరాకరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ 'సెమిస్టర్'లకు చెందిన 14 నుంచి 15వందల మంది విద్యార్థులు పరీక్షలు రాయలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇందులో కొందరు తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడేవారు కూడా ఉన్నారు. దీంతో తమ పిల్లలకు పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని తల్లిదండ్రులు అధికారులను విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. నిబంధనల ప్రకారం హాజరుశాతం తక్కువగా ఉన్న వారికి పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారు. 'కరోనా' సమయంలో మాత్రమే హాజరుశాతానికి మినహాయింపు ఇచ్చామని, ఆ తర్వాత ఎప్పుడూ హాజరుశాతానికి మినహాయింపులు ఇవ్వలేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. అయితే పరీక్ష రాయలేని విద్యార్థులకు జూన్ మాసంలో అదే సెమిస్టర్‌లో రీ అడ్మీషన్ ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఏటా హాజరు శాతం తక్కువగా ఉన్న వారికి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వడం లేదని, హాజరుశాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షను రాసేందుకు అనుమతి ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని ప్రతి ఏటా సాంకేతిక విద్యా మండలికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ ఇప్పటి వరకు దీనిపైన ఎటువటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. హాజరు శాతం తక్కువగా ఉండి పరీక్షలు రాయాలని విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

## విద్యార్థులపై తీవ్ర ప్రభావం...

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌పైన తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలకు అనుమతి నిరాకరిస్తే, తమ పిల్లల విలువైన కాలం వృదా అవుతుందని, తద్వారా విద్యార్థులపై తీవ్ర మానసిక ప్రభావం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనారోగ్య కారణంగానే తన కుమారుడు తరగ తులకు వెళ్లలేకపోయారని, తద్వారా హాజరు శాతం తగ్గి, పరీక్షకు అనుమతి ఇవ్వలేదని, ఇటువంటి నిర్ణయాలు పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, తద్వారా మరో అనారోగ్యానికి కారణమయ్యే పరిస్థితులు వస్తాయని పెద్దపల్లికి చెందిన విద్యార్థి తండ్రి 'గౌస్' తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను మానవీయ కోణంలో ఆలోచించి హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.









































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com